www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 20-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 245 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 10.49 తదుపరి షష్ఠి; నక్షత్రం: మఖ తె. 3.47 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 2.53-4.36; దుర్ముహూర్తం: ఉ. 8.55-9.39, మ. 12.34-1.18; అమృతఘడియలు: రా. 1.12-2.55; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 5.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేటీఆర్‌పై 'రేసు' కేసు!

ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద నమోదు

నోటీసులిచ్చి.. అరెస్టు చేసే అవకాశం!?

ఏ1గా కేటీఆర్.. ఏ2గా ఐఏఎస్ అర్వింద్

నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్ఈవోకు చెల్లింపులు

ఒప్పందానికి ముందే డాలర్లలో పేమెంట్

ఎఫ్ఐఆర్‌లో ఏసీబీ అభియోగాలు 12

పార్లమెంటు ఆవరణలో
బాహాబాహీ!

చరిత్రలో ఎన్నడూ చూడని దృశ్యం

మలుపు తిరిగిన అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యల వివాదం

ఇండియా, ఎన్డీఏ ఎంపీల పోటాపోటీ నిరసనలు

మకరద్వారం వద్ద తోపులాట

ముఖేశ్ రాజ్‌పుత్‌ను రాహుల్ బలంగా తోసేశారు

ఆయన ప్రతాప్ సారంగిపై పడ్డారు

మా ఎంపీలకు గాయాలయ్యాయి

హత్యాయత్నం జరిగింది: బీజేపీ

బీజేపీ వాళ్లే అడ్డుకొని నన్ను, ఖర్గేను తోసివేశారు: రాహుల్ గాంధీ

నా మోకాలికి గాయమైంది: ఖర్గే

ఠాణాలో ఇరుపక్షాల ఫిర్యాదులు.. రాహుల్‌పై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ పార్లమెంటు చరిత్రలోనే ఎన్నడూ కనీవినీ ఎరుగని దృశ్యం గురువారం ఆవిష్కృతమైంది. అధికార, విపక్షాల మధ్య ఇప్పటివరకూ జరుగుతున్న మాటల యుద్ధం గురువారం భౌతిక దాడులకు దారితీసింది. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఒకవైపు.. కాంగ్రెస్ పార్టీ అమిత్ షా మాటల్ని వక్రీకరించటమే కాక వారి హయాంలో

మిగతా 2వ పేజీలో...



ప్రియాంక, బీజేపీ ఎంపీ హేమంగ్‌జోషి పోటాపోటీ నినాదాలు


గాయపడిన బీజేపీ ఎంపీ ప్రతాప్‌చంద్ర సారంగిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఏనాడూ గౌరవించలేదు: బాబు 13


సస్పెండైన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి సోదరి ప్రియాంకతో సాయిరెడ్డి 12

శాంతి సిస్టర్స్‌కు సాయి
సిఫారసు!

ఇద్దరికీ ఫైబర్‌నెట్‌లో కొలువు

వాట్సాప్ మెసేజ్‌తోనే నియామకాలు

బాబుపై కేసుకు వీలుగా ఫైళ్లలో మార్పులు చేశారనే అనుమానాలు

కూపీ లాగుతున్న కూటమి ప్రభుత్వం

చంద్రబాబుపై కేసు ఫైలులో మార్పులు?

విజయసాయి సిఫారసు చేసిన మహిళా ఉద్యోగి చేతికి ఫైబర్‌నెట్ ఫైలు 12

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా నియామకాలు

వైసీపీ నేతల ఇళ్లలో పనిమనుషులు, కారు డ్రైవర్లకు ఫైబర్‌నెట్‌లో వేతనాలు

వర్మ వ్యూహం సినిమాకు 2.15 కోట్ల చెల్లింపు

అన్నింటిపైనా విజిలెన్స్ విచారణ జరుగుతోంది

ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి వెల్లడి

కక్ష సాధింపులొద్దు

స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల సమయం కుదించం: సీఎం

79 'మున్సిపాలిటీల' పదవీకాలం వచ్చే మార్చికి పూర్తి

మిగతావాటికి నవంబరు దాకా గడువు

ఇంత తక్కువ సమయం ఉంటే పనిగట్టుకుని దించడం ఎందుకు?

విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం.. సీఎం స్పష్టీకరణ

పులివెందుల మంచినీటి పథకం కొనసాగింపు

సంక్రాంతి తర్వాత కొనసాగనున్న రెవెన్యూ సదస్సులు

దరఖాస్తుల లెక్క కాదు.. ఎన్ని పరిష్కరించారన్నదే ప్రధానం

మంత్రుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే: చంద్రబాబు


రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక వర్గాలపై అవిశ్వాస తీర్మానం పెట్టే సమయాన్ని కుదించరాదని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. వాటి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి, నవంబరుల్లో పూర్తవుతున్నందున ప్రత్యేకంగా పనిగట్టుకుని ఎందుకు దించేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. కక్ష సాధింపులు అవసరం లేదని.. విలువలతో కూడిన రాజకీయాలు చేద్దామని ఆయన స్పష్టం చేశారు. గురువారమిక్కడ

మిగతా 13వ పేజీలో...

పార్టీకి ఎవరూ చెడ్డపేరు తేవొద్దు

అలాంటి వారిని ఉపేక్షించం: బాబు

జెండా మోసేది కార్యకర్తలే

వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నాయకులు పనిచేయాలి

వారికి న్యాయం చేసి ఆదుకోవాలి

మెజారిటీ నామినేటెడ్ పదవుల భర్తీ

పార్టీ నేతలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతికి ప్రపంచబ్యాంకు రుణం

రూ.6,750 కోట్లు ఇవ్వడానికి ఆమోదం

నాడు అడ్డుకునేందుకు జగన్ అండ్ కో కుట్రలు

ఈ బ్యాంకు రుణం రాకుండా ఫిర్యాదులు

కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి వినతులు

రాజధానిలో పర్యటించిన బ్యాంకు ప్రతినిధులు

రైతులు, అధికారులతో భేటీలు

అమరావతి మునిగిపోతుందంటూ అప్పట్లో విజయసాయిరెడ్డి లేఖలు

బలవంతంగా భూములు తీసుకున్నారని కొందరు రైతులతో కంప్లయింట్లు


గద్దెనెక్కాక అప్పు వద్దంటూ జగన్ లేఖ

ఐదేళ్లలో రాజధాని విధ్వంసం 2

ఖర్గేను, నన్ను తోసేశారు

బీజేపీ ఎంపీలు కర్రలు చేతబట్టి సభలోకి వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకున్నారు

- అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ యత్నం
- బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు వ్యతిరేకం
- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఆగ్రహం
- షా క్షమాపణ, రాజీనామాకు డిమాండ్
- నన్ను నెట్టారు.. బ్యాలెన్స్ తప్పి కిందపడ్డా
- రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే
- దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ; చిత్రంలో ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని.. గురువారం పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలు అందులో భాగమేనని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు అదానీ లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైందని.. దానిపై చర్చించాలని తాము కోరామని, కానీ ఆ చర్చ జరగకుండా సమావేశాలు మొదలైనప్పటి నుంచీ బీజేపీ ఇదే పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగం, అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఉంటుందని.. అందుకే ఆయన జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నాయని రాహుల్ మండిపడ్డారు. "కేంద్ర హోంమంత్రి తన వ్యాఖ్యల ద్వారా తన ఆలోచనా తీరును బయటపెట్టుకున్నారు. ఆయన క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని మేం డిమాండ్ చేశాం. కానీ ఆ రెండూ జరగలేదు. ఇవాళ వాళ్లు ఒక కొత్త గత్తరకు తెరతీశారు. మేం అంబేడ్కర్ విగ్రహం నుంచి పార్లమెంటు హౌస్‌కు వెళ్తున్న సమయంలో.. బీజేపీ ఎంపీలు చేతుల్లో కర్రలు పట్టుకుని మెట్ల వద్ద నిలబడి, మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు"అని తెలిపారు. "నేను పార్లమెంటులోకి వెళ్తుంటే బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకుని, తోసేస్తూ బెదిరించారు" అని ఆవేదన వెలిబుచ్చారు. ఖర్గే, ప్రియాంకను కూడా తోసేశారా? అని మీడియా ప్రశ్నించగా.. "అది కూడా జరిగింది. కానీ, ఈ తోపులాటలకు మేం బెదరం"అని రాహుల్ స్పష్టంచేశారు. పార్లమెంటు మకర ద్వారాన్ని చూపుతూ.. "ఇది పార్లమెంటులోకి ప్రవేశించే ద్వారం. లోపలికి వెళ్లడానికి మాకు హక్కుంది. బీజేపీ సభ్యులు మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా.. అందుకు క్షమాపణ చెప్పి, రాజీనామా చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రధాని మన దేశాన్ని అదానీకి తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

నేనెప్పుడు తెల్లటి టీ-షర్టులే వేసుకొంటాను. పారదర్శకతకు, దృఢత్వానికి, సరళత్వానికి తెలుపు దనం ప్రతీక.. మొన్న జూన్ 19న తన 54వ పుట్టిన రోజు సందర్భంగా ఈ మాటలు చెప్పిన రాహుల్ గురువారం హఠాత్తుగా నీలిరంగు టీ-షర్టులో కనిపించి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. అంబేడ్కర్‌కు వచ్చినది దళిత జాతికి గుర్తింపు తెచ్చినదీ నీలిరంగే. రాజ్యాంగం, అంబేడ్కర్ అంశాలపై రాజకీయ రచ్చ నేపథ్యం లో రాహుల్ ఇలా నీలిరంగు టీ-షర్టుకు మారిపోవడం ప్రాధాన్యం ఉన్న పరిణామమే!

అంతా వాళ్లే చేసి..

అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యలను మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా ఖండించారు. "తాను తప్పు చేసినట్టు ఒప్పుకోవడానికి ఆయన (అమిత్ షా) నిరాకరిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం. ఆయన్ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోదీని కోరాం. అదీ జరగలేదు. అందుకే రాహుల్, ప్రియాంక సహా మా పార్టీ నేతలందరం నిరసన తెలిపాం. బీజేపీ ఈ అంశాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోంది"అని ఖర్గే అన్నారు. ఆ కుట్రలో భాగంగానే బీజేపీ ఎంపీలు తమపై దాడి చేశారన్నారు. "మేమెంతో క్రమశిక్షణతో ఒక వరుసలో వస్తున్నాం. వాళ్ల(బీజేపీ) మనసులో ఏముందో నాకు తెలియదు. మకర ద్వారం వైపు వచ్చి మాకు అడ్డు తగిలారు. పార్లమెంట్ లోపలికి వెళ్లాలని మేం అనుకున్నాం. కానీ వారు తలుపుల వద్ద మమ్మల్ని ఆపేశారు. పురుష ఎంపీలు కండబలాన్ని చూపించారు. మాతో వస్తున్న మహిళా ఎంపీలను సైతం అడ్డుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే మాపై దాడి చేశారు. వారు నన్ను నెట్టేసరికి నేను కిందపడిపోయాను"అని ఖర్గే తెలిపారు. "ఇదంతా వాళ్లే చేసి.. మేమే వాళ్లను తోసేసి, వారి గాయాలకు కారణమయ్యామంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారు. మమ్మల్ని చూసి హేళన చేస్తున్నారు" అన్నారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని, దీనిపై దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని తెలిపారు. "తిన్నది లేదు తాగింది లేదు.. 12 అణాల గ్లాస్ పగలగొట్టాడు"అని హైదరాబాద్‌లో అంటుంటారని..బీజేపీ వాళ్లు చేస్తున్నది అలాగే ఉందని ఖర్గే అన్నారు.

ఇదిలా ఉండగా.. అంబేడ్కర్‌పై అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యల వీడియోను డిలీట్ చేయాలంటూ 'ఎక్స్'కు కేంద్రం తాఖీదునిచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. కేంద్రం ఇలా అడుగుతోందంటూ 'ఎక్స్' నుంచి తమకు ఒక ఈ మెయిల్ వచ్చిందని ఆ పార్టీ సోషల్ మీడియా అండ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ఛైర్‌పర్సన్ సుప్రియ తెలిపారు. అయితే.. 'ఎక్స్' ఆ వీడియోలను తొలగించలేదని ఆమె చెప్పారు.

షాను కాపాడే కుట్రలో భాగమే: ప్రియాంక

బీజేపీ ఎంపీని రాహుల్‌గాంధీ తోసేశారంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు అమిత్‌షాను కాపాడేందుకు ఆ పార్టీ పన్నిన కుట్రగా ప్రియాంకా గాంధీ అభివర్ణించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలను పార్లమెంటులో ప్రవేశించకుండా అడ్డుకునేందుకు అధికారపార్టీ ఎంపీలు గూండాగిరీకి పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. బీజేపీ ఎంపీ ప్రతాప్‌చంద్ర సారంగిని రాహుల్ తోసేశారన్న బీజేపీ ఆరోపణను ఆమె తోసిపుచ్చారు. రాహుల్.. అంబేడ్కర్ చిత్రపటాన్ని పట్టుకుని 'జై భీమ్' అని నినదిస్తూ శాంతియుతంగా పార్లమెంటులోకి వెళ్తుండగా ఆయన్ను అడ్డుకున్నారని పేర్కొన్నారు. తన కళ్ల ముందే వారు ఖర్గేను తోసేస్తే ఆయన కింద పడిపోయారన్నారు. అంబేడ్కర్‌పై బీజేపీ అసలు ఆలోచనలు.. అమిత్‌షా వ్యాఖ్యల రూపంలో బయటపడ్డాయన్నారు. "దేశానికి రాజ్యాంగాన్ని, కోట్లాది మంది దళితులు, అణగారినవర్గాల ప్రజల జీవితాలను మార్చేసిన అంబేడ్కర్‌ను బీజేపీ తన ఆలోచనలు, చర్యలతో అవమానిస్తోంది"అని ప్రియాంక ట్వీట్ చేశారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్ తగరు

కండబలం చూపిస్తారా?: బీజేపీ

న్యూఢిల్లీ, డిసెంబరు19: పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ చేపట్టిన నిరసనల్లో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు ప్రతిపక్ష నేతగా ఆయన తగరని నిరూపించిందని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్, అనురాగ్ సింగ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ తోయడంతో తమ పార్టీ ఎంపీలు ప్రతాప్ సింగ్ సారంగి, ముఖేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారని చౌహాన్ ఆరోపించారు. పార్లమెంట్‌లో కండబలం చూపిస్తారా, గూండాలు పార్లమెంట్‌కు రావొచ్చా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ఎటువైపు తీసుకెళ్లాలనుకుంటుందని రాహుల్ ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న తీరు సరికాదని, పీయూష్ గోయల్ అన్నారు. తన తీరుపై రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'అంబేడ్కర్'పై అబద్ధాలు ఆపండి

అంబేడ్కర్ అంశంలో అబద్ధాలు ఆపాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాంగ్రెస్‌కు సూచించారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అనేకసార్లు అవమానించిందన్నారు. అంబేడ్కర్‌ను నెహ్రూ ద్వేషించేవారని, రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేశారని ఆరోపించారు. తన మంత్రివర్గంలో అంబేడ్కర్ లేకపోవడం తనకు ఆనందాన్నిస్తోందని నెహ్రూ లేఖలు రాశారని గుర్తు చేశారు. అంబేడ్కర్ అంత్యక్రియలు జరిగిన ముంబైలోని చైతన్య భూమిని అప్పగిస్తామని కాంగ్రెస్ చేయలేదని, మోదీ ప్రభుత్వం 2015లో ఆ పని పూర్తి చేసిందని నడ్డా గుర్తు చేశారు.

రాహుల్ నాపట్ల అనుచితంగా ప్రవర్తించారు: మహిళా ఎంపీ

పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ తనను అసౌకర్యానికి గురిచేశారని బీజేపీ రాజ్యసభ మహిళా ఎంపీ ఫంగ్నోన్ కొన్యాక్ ఆరోపించారు. ప్లకార్డులు పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా రాహుల్ తనకు అతి సమీపంగా వచ్చారని ఆమె చెప్పారు. తనపై గట్టిగా అరుస్తూ అనుచితంగా ప్రవర్తించారని, ఒక మహిళగా అసౌకర్యానికి గురయ్యానన్నారు. రాహుల్ చర్యలతో తన గౌరవానికి భంగం కలిగిందని, తనకు రక్షణ కల్పించాలని రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్‌ను కోరారు.

పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ!

(మొదటి పేజీ తరువాయి)

అంబేడ్కర్‌ను అవమానించారని పేర్కొంటూ అధికార పక్ష సభ్యులు మరోవైపు.. పార్లమెంట్ ప్రాంగణంలో పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఆ నిరసనలు తోపులాటకు దారితీసి ఉద్రిక్తత ఏర్పడింది. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు గాయపడి ఆస్పత్రి పాలు కాగా, ఆ పార్టీకే చెందిన ఓ మహిళా ఎంపీ తన పట్ల రాహుల్‌గాంధీ అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ తోసేయడం వల్లే తమ ఎంపీలు గాయపడ్డారని బీజేపీ ఆరోపించగా.. తొలుత వాళ్లే తనను నెట్టివేశారని, తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా తోసివేస్తే ఆయన మోకాలికి గాయమైందని రాహుల్ గాంధీ అన్నారు. తమ సభ్యులపై హత్యాయత్నం జరిగిందని బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ రాహుల్‌గాంధీపై పార్లమెంట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. 84 ఏళ్ల ఖర్గే పట్ల బీజేపీ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ ఎంపీలు దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్ తదితరులు అదే స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు పార్టీల నేతలు పరస్పరం నిందించుకుంటూ, జరిగిన ఘటనపై దర్యాప్తు జరిపించాలంటూ ఉభయ సభల అధ్యక్షులకు లేఖలు రాశాయి. ఇరు వర్గాలూ తమ కథనాలను సమర్థించుకుంటూ వీడియోలు విడుదల చేశాయి. ఈ మొత్తం ఉదంతం ఉభయ సభలను కుదిపివేయడంతో గందరగోళం, నినాదాల మధ్య ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

మకరద్వారం వద్ద ఉద్రిక్తత

గురువారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాలు ప్రారంభం కావటానికి ముందే ఎన్‌డీఏ, ఇండియా ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సుప్రియా సూలేతో పాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎస్పీ, ఎన్సీపీ (శరద్‌పవార్), వామపక్షాలు తదితర పార్టీల సభ్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్‌కు సంకేతంగా పలువురు ఎంపీలు నీలి రంగు టీషర్టులు ధరించారు. నిరసన అనంతరం ఊరేగింపుగా.. పార్లమెంటులోకి ఎంపీల ప్రవేశద్వారమైన మకర ద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ సమయంలో మకరద్వారం వద్ద అధికారపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని, దానికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలంటూ వారు నినాదాలిచ్చారు. ప్రతిపక్ష ఎంపీలు అటువైపు రావటంతో.. ఇరు వర్గాలు పోటాపోటీగా నినాదా లు చేయటం ప్రారంభించాయి. దీనితో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ సభ్యులు కర్రలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని, ఆ కర్రలతో తమ మీద దాడి చేశారని, తాము పార్లమెంట్ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాహు లే తమ మీద దాడి చేసి తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలను గాయపర్చారని బీజేపీ సభ్యులు ఆరోపించారు. ముఖేశ్ రాజ్‌పుత్ అనే ఎంపీని రాహుల్ బలంగా తోసివేశారని, ఆయన ప్రతాప్ సారంగి అనే మరో ఎంపీపై పడ్డారని, ఇరువురూ గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని తెలిపారు. రాహుల్ కారణంగానే తాను గాయపడ్డానని 69 ఏళ్ల ప్రతాప్ సారంగి ఆరోపించారు. తనను రాహుల్ తోసి వేశారని ముఖేశ్ చెప్పారు. కాగా, ఇతర ఎంపీలను కొట్టేందుకే మీరు కరాటే, కుంగ్‌ఫూ నేర్చుకున్నారా అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ.. రాహుల్‌ను ప్ర శ్నించారు. కాగా, తానెవరినీ తోసేయలేదని రాహుల్ గాంధీ చెప్పారు. తాను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా బీజేపీ ఎంపీలే తనను బెదిరించి తోసేశారని ఆరోపించారు. తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా తోసేశారని చెప్పారు. దీనిపై ఖర్గే కూడా స్పందించారు. బీజేపీ ఎంపీలు తనను నెట్టివేస్తే కూలబడ్డానని, తన మోకాలికి గాయమైందని, కుంటుకుంటూ సభలోకి వెళ్లానని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ దాడిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులోకి రాకుండా బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారని కాంగ్రెస్ ఎంపీలు ఓం బిర్లాను కలిసి ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని పేర్కొంటూ, ఆయన మీద రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రతిపక్ష నేత ఖర్గే సభాహక్కుల ఉల్లంఘన నోటీసు సమర్పించారు. మరోవైపు.. తాము ఊరేగింపుగా వెళ్తుండగా బీజేపీ ఎంపీలే అడ్డుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఓ వీడియో విడుదల చేయగా.. బీజేపీ మరో వీడియో విడుదల చేసింది. గాయపడి నేల మీద కూర్చున్న బీజేపీ ఎంపీ సారంగి వద్దకు రాహుల్ రావటం, రాహుల్‌ను ఉద్దేశించి 'మీకు సిగ్గు లేదా! మీరు గుండాలా వ్యవహరిస్తున్నారు' అని మరో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యానించటం ఆ వీడియోలో కనిపించింది. సారంగే తనను తోసివేశారని రాహుల్ అంటున్నట్లుగా ఆ వీడియోలో ఉన్నది.



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎన్‌డీఏ ఎంపీలు

ప్రథమ చికిత్స చేసిన బైరెడ్డి శబరి

తలకు గాయమైన ప్రతాప్ సారంగికి టీడీపీ ఎంపీ, స్వయంగా డాక్టరైన బైరెడ్డి శబరి వెంటనే ప్రథమ చికిత్స చేస్తే మరో టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పల్నాయుడు దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాహుల్‌గాంధీ వ్యవహరించిన తీరు సరైంది కాదని శబరి వ్యాఖ్యానించారు. 69 ఏళ్ల వృద్ధుడని చూడకుండా రాహుల్ గాంధీ తోసేశారని, రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నదంటున్నవారు ఇలాగేనా ప్రవర్తించేది అని ఆమె ప్రశ్నించారు.

గేట్ల వద్ద ఆందోళనలు చేయొద్దు: స్పీకర్

పార్లమెంట్ ప్రాంగణంలో తోపులాట నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్‌కు సంబంధించిన గేట్ల వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టవద్దని ఎంపీలకు సూచించారు. అన్ని ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

ఎంపీలకు మోదీ పరామర్శ

తోపులాటలో ఒడిసాలోని బాలాసోర్ ఎంపీ ప్రతాప్ సారంగి (69), యూపీలోని ఫరూఖాబాద్ ఎంపీ ముఖేశ్‌లోధా రాజపుత్ (56)లకు గాయాలు తగలడంతో చికిత్స కోసం వారిని రాంమనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఇరువురికీ తలకు గాయాలయ్యాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ అజయ్ శుక్లా చెప్పారు. సారంగి తలకు లోతుగా గాయమైందని.. కుట్లు వేయాల్సి వచ్చిందన్నారు. కాగా ప్రధాని మోదీ ఇద్దరు ఎంపీల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్ ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. కాగా, కాంగ్రెస్, బీజేపీలు పార్లమెంటుస్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. తమ పార్టీ ఎంపీ ప్రతాప్ సారంగి మీద రాహుల్ దాడి చేశారంటూ బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

తగ్గనున్న అమెరికా వీసా కష్టాలు

- యూఎస్ వీసా జారీ నిబంధనల్లో మార్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 19: నూతన సంవత్సరంలో అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు శుభవార్త. వీసా కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన అవసరం ఇంక ఎంతమాత్రం లేదు. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా జారీ విధానాలను సరళీకరిస్తూ బైడెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్చిన నిబంధనలు 2025, జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నిబంధనల ప్రకారం వీసా అపాయింట్‌మెంట్ షెడ్యూల్, రీ షెడ్యూల్ మరింత సులభమవుతుంది. అలాగే దానికోసం ఎదురు చూడాల్సిన సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈమేరకు భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఓ ప్రకటన చేసింది. 'ప్రతి ఒక్కరూ వీసా అపాయింట్‌మెంట్ సమయం పొందడానికి, వేచి ఉండాల్సిన సమయాన్ని తగ్గించడానికి అనుగుణంగా పలు మార్పులు చేశాం. నూతన నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు వారి అపాయింట్‌మెంట్‌ను ఎలాంటి అదనపు రుసుము లేకుండా నచ్చిన వీసా కేంద్రానికి మార్చుకొని, ఒకసారి రీ షెడ్యూల్ చేసుకోవచ్చు. ఒకవేళ రీ షెడ్యూల్ చేసుకున్న సమయానికి వీసా ఇంటర్వ్యూకి వెళ్లలేక, మరోసారి రీ షెడ్యూల్ చేసుకోవాలని భావిస్తే కొత్త అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాలి' అని ఎంబసీ తన ప్రకటనలో పేర్కొంది.

కెనడాలో శాశ్వత నివాసానికి దరఖాస్తులు

- 1,085 మందికి అవకాశం కల్పించిన ట్రూడో ప్రభుత్వం
- భారతీయ నిపుణులకు భారీ లబ్ధి చేకూరే అవకాశం

న్యూఢిల్లీ, డిసెంబరు 19: తమ దేశానికి వలసల సంఖ్యను పెంచడానికి కెనడా సిద్ధమైంది. ప్రొవిన్షియల్ నామినీ ప్రోగ్రామ్ (పీఎన్‌పీ) కింద విదేశీ పౌరులు శాశ్వత నివాస హోదా పొందేందుకు ట్రూడో ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికోసం ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్ (ఈఈఎస్) ద్వారా మొత్తం 1,085 మంది నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) ఈ నెల 16న ప్రకటన విడుదల చేసింది. ఇదే కార్యక్రమం కింద ఈ నెల 2న 672 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తాజా నిర్ణయంతో కెనడాలో శాశ్వత నివాసం పొందాలని భావించే భారతీయ వృత్తి నిపుణులకు బారీ లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. విదేశీ పౌరులు నిర్దిష్ట ప్రావిన్స్‌లో నివసించడానికి, పనిచేయడానికి పీఎన్‌పీ అనుమతిస్తుంది.

2030 నాటికి చైనా వద్ద వెయ్యి అణ్వాయుధాలు!

- ఈ ఏడాది ఇప్పటికే 100 తయారు.. 'పెంటగాన్' వెల్లడి

వాషింగ్టన్, డిసెంబరు 19: చైనా అణ్వాయుధాల తయారీలో వేగం పెంచింది. ఈ ఏడాది ఇప్పటికే కనీసం 100 అణ్వస్త్రాలను తయారు చేసింది. ఇదే వేగం కొనసాగిస్తే 2030 నాటికి చైనా అమ్ములపొదిలో 1,000 అణ్వాయుధాలు సమకూరనున్నాయి. చైనా మిలిటరీకి సంబంధించి అమెరికా రక్షణశాఖ కార్యాలయం పెంటగాన్ తాజాగా రూపొందించిన వార్షిక నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద 600కు పైగా అణ్వాయుధాలు ఉన్నాయని నివేదిక పేర్కొంది. 2019లో వీటి సంఖ్య 400 మాత్రమేనని, 2023 మే నాటికి ఆ సంఖ్య 500కు పెరిగిందని తెలిపింది. ఈ ఏడాది వాటిసంఖ్య ఏకంగా 20% పెరిగి 600కు చేరడం గమనార్హం. తమ జాతీయ భద్రతకు సరిపడా అణ్వాయుధాలు ఉంచుకొంటామని ఇప్పటికే చైనా తేల్చిచెప్పింది. కాగా, 2023 నాటికి అమెరికా వద్ద దాదాపు 3,748 అణ్వాయుధాలు ఉన్నాయి. చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఆ దేశ అణు సామర్థ్యాన్ని మరింత పెంచాయని పెంటగాన్ నివేదిక తెలిపింది. చైనా రక్షణ వ్యయాన్ని భారీగా పెంచేసినట్టు వివరించింది.

శబరిమలలో మండల పూజకు సిద్ధం

- 22న అరన్ములలో తంగఅంకి కార్యక్రమం
- 25న శబరిమలకు రథం చేరిక
- 26న మండల పూజ

శబరిమల, డిసెంబరు 19: శబరిమలలో అయ్యప్ప స్వామి మండల పూజకు సర్వం సిద్ధమైంది. నవంబరు 16న ప్రారంభమైన మండల పూజ సీజన్ ఈ నెల 26న సన్నిధానంలో జరిగే ప్రత్యేక పూజలతో ముగియనుంది. మండల పూజల్లో అత్యంత కీలకమైన ఘట్టం తంగఅంకి కార్యక్రమం. అరన్ములలోని పార్థసారథి ఆలయం నుంచి ఈ నెల 22న ఉదయం 7గంటలకు ప్రారంభంకానున్న తంగఅంకి రథం.. 25న సాయంత్రానికి శబరిమల సన్నిధానాన్ని చేరుకుంటుంది. ఇక గురువారం నుంచి భక్తుల రద్దీ పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు తెలిపారు. గురువారం శరణ్‌గుత్తి నుంచి పంపావైపు కిలోమీటరు దూరంలో ఉన్న ట్రీక్లస్టర్ వరకు స్వాములు క్యూలైన్‌లో నిలబడ్డారని, రద్దీని నియంత్రించడానికి మారకుట్టం వద్ద క్యూలైన్‌ను 2-3 గంటలపాటు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో కేరళీయులు కూడా మండలపూజకు వచ్చే అవకాశాలున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణ్ నాయర్ నేతృత్వంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. "ఎక్కడికక్కడ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరిస్తాం. అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తాం. తెలుగు, తమిళం, హిందీ సహా పలు భాషల్లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశాం. వృద్ధులు, చిన్నారుల సౌకర్యార్థం నడపందల్ వద్ద ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి వారికి శీఘ్ర దర్శనానికి అనుమతిస్తున్నాం" అని ఆయన వివరించారు. కాగా అటవీ మార్గంలో విష కీటకాల వల్ల భక్తులకు ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో.. నల్లత్రాచు, త్రాచు, రక్తపింజర వంటి పాములను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు మోహరించాయి. పంపానదిలో కూడా పాముల బెడద ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా.. తిరువనంతపురానికి చెందిన బిజోయ్ అనే వ్యక్తి కుమారులు.. అభినవ్, అద్వైత్‌లు సన్నిధానం వద్ద 504 రూబిక్స్ క్యూబ్‌లతో అయ్యప్ప ప్రతిరూపాన్ని రూపొందించారు. ఈ చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిన్నారులిద్దరూ అయ్యప్ప దీక్ష తీసుకుని.. మొదటిసారి శబరిమలకు రావడం గమనార్హం.!



రూబిక్స్‌క్యూబ్‌లతో అయ్యప్పను రూపొందిస్తున్న చిన్నారులు అభినవ్, అద్వైత్

వాట్సాప్‌లోనూ చాట్‌జీపీటీ

- 18002428478 నంబరుతో చాట్
- అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ ఏఐ..!
- అయితే, ప్రస్తుతానికి అమెరికా, కెనడాల్లోనే

న్యూఢిల్లీ, డిసెంబరు 19: ఇటీవలి కాలంలో చాట్‌జీపీటీ విస్తృతంగా ప్రజాదరణ పొందింది. దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మద్దతున్న ఓపెన్ ఏఐ రూపొందించిన ఈ చాట్‌బాట్ మరింత అందుబాటులోకి రానుంది. ఇప్పటిదాక దీనిని వాడాలంటే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు మాత్రం వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ సేవలను పొందే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది ఓపెన్ ఏఐ. దీనికోసం ఇతర యాప్, ప్రత్యేక ఖాతా నంబరుతో పనిలేకుండా మనం కోరుకున్న సమాచారాన్ని తెలుసుకునేందుకు 18002428478 నంబరుతో చాట్ చేయొచ్చు కాల్ చేసి కూడా సేవ లు పొందే అవకాశం ఉంది. అయితే, దీనికి నిర్దిష్ట పరిమితి ఉంది. ప్రస్తుతానికి ఈ సౌలభ్యం అమెరికా, కెనడాలకు మాత్రమే పరిమితం. ఇప్పటికే మెటా.. వాట్సాప్ లో ఏఐ చాటాబాట్ సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి పోటీగా ఓపెన్ ఏఐ కూడా రంగంలోకి దిగింది. ఈ ఏడాది ముగుస్తున్న నేపథ్యంలో.. '12 డేస్ ఆఫ్ ఓపెన్ ఏఐ అనౌన్స్‌మెంట్'లో భాగంగా గురువారం చాట్‌జీపీటీ వాట్సాప్ వినియోగాన్ని ప్రకటించింది.


కుట్రలు ఛేదించుకుని..!

రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు రూ.6,750 కోట్లు రుణం

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు జగన్ అండ్ కో చేసిన ప్రయత్నాలన్నీ వమ్మయ్యాయి. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా.. ప్రపంచబ్యాంకు రుణం రాకుండా చేసిన కుట్రలన్నిటినీ ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం ఛేదించింది. ముమ్మర యత్నాలతో అమరావతి అభివృద్ధికి రుణ మంజూరుకు ఆమోదముద్ర వేయించగలిగింది. కొద్ది రోజుల కిందట రూ.6,800 కోట్ల రుణానికి ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ఆమోదించగా.. గురువారం రాత్రి పొద్దుపోయాక ప్రపంచబ్యాంకు బోర్డు అమరావతి అభివృద్ధికి రూ.6,750 కోట్ల అప్పు ఇవ్వడానికి ఆమోదముద్ర వేసింది. వాస్తవానికి 2018లోనే రాజధాని నిర్మాణానికి రుణం మంజూరుకు ప్రపంచబ్యాంకు అంగీకరించింది. కానీ ఆ డబ్బు రాకుండా నాటి ప్రతిపక్ష నేత జగన్ అండ్ కో ఎన్నో కుట్రలు పన్నారు. ఈ వ్యవహారంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక పాత్ర పోషించారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేస్తూ ప్రపంచబ్యాంకుకు లేఖలు రాశారు. అమరావతి వరదలకు మునిగిపోతుందని.. రుణమిస్తే నీటిపాలవుతుందంటూ పదే పదే ఈ-మెయిల్స్ పంపారు. రాజధాని గ్రామాలతో సంబంధం లేని రైతులతోనూ ఫిర్యాదులు చేయించారు. బెదిరించి భయపెట్టి భూములు లాక్కున్నారని చెప్పించారు. రాజధాని భూముల కొనుగోలులో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందంటూ జగన్ రోతపత్రికలో విషపు కథనాలు వండి వార్చారు. ఈ పరిణామాలతో ప్రపంచబ్యాంకు వెనక్కి తగ్గింది. తర్వాత కొద్దికాలానికే జగన్ సీఎం అయ్యారు. అమరావతి నిర్మాణానికి తమకు రుణం అక్కర్లేదని ప్రపంచబ్యాంకుకు లేఖ రాశారు. తర్వాత మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారు. గత ఐదేళ్లలో నిర్మాణ పనులు ఆపేసి అమరావతిని సర్వనాశనం చేశారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక రాజధాని నిర్మాణానికి ఉన్న ఒక్కొక్క ఆటంకాన్ని తొలగిస్తూ వస్తున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించేలా చేశారు. తర్వాత ప్రపంచబ్యాంకు, ఏడీబీలను సంప్రదించారు. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు, కేంద్రప్రభుత్వ అధికారులు వారంరోజులపాటు రాజధానిలోనే మకాం వేసి.. వైసీపీ చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని రూఢి చేసుకున్నారు. ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో పలు దఫాలు చర్చించాక ఎట్టకేలకు గురువారం రాత్రి బ్యాంకు పాలక బోర్డు అప్పు మంజూరుకు ఆమోదముద్ర వేసింది.

లోకం తీరు

హైదరాబాద్‌లో పుస్తక ప్రదర్శన ప్రారంభం ≡



ఉపరాష్ట్రపతిపై అభిశంసన నోటీసు తిరస్కరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 19: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన అభిశంసన నోటీసు తిరస్కరణకు గురయింది. దీన్ని తిరస్కరిస్తున్నట్టు రాజ్యసభ వైస్‌ఛైర్మన్ హరివంశ్ గురువారం సభలో ప్రకటించారు. ధన్‌ఖడ్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందువల్ల ఆయనను అభిశంసిస్తామని పేర్కొంటూ 60 మంది సభ్యులు ఈ నెల 10న నోటీసు ఇచ్చారు. ఆ నోటీసును రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి మోదీ సభలో ప్రవేశపెట్టారు. దీనిని అందుకోగానే ధన్‌ఖడ్ దానిని వైస్‌ఛైర్మన్‌కు అందజేశారు. తన స్థానం నుంచి తప్పుకొన్నారు. ఈ నోటీసుపై హరివంశ్ వ్యాఖ్యానిస్తూ ఇది అనుచితమైనది, ధన్‌ఖడ్ పరువుకు భంగం కలిగించేలా హడావిడిగా ఇచ్చినదని పేర్కొన్నారు. లోపభూయిష్టంగా ఉందని, రాజ్యాంగ వ్యవస్థను దెబ్బతీసేదని తెలిపారు. ఇందులో వాస్తవాలు లేవని, ధన్‌ఖడ్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేశారని చెప్పారు. ఉపరాష్ట్రపతిని అప్రతిష్ఠ పాల్జేయడానికి ఇచ్చిన ఈ నోటీసు ఆందోళనకరమని, ఇది పార్లమెంటు, సభ్యుల ప్రతిష్ఠకు భంగకరమని అన్నారు. అందువల్ల తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ ధన్‌ఖడ్ వ్యవహార శైలిని ఎత్తిచూపుతూ తాను గతంలో ఆయనకు లేఖ రాశారని తెలిపారు. తాను ప్రస్తావించిన అంశాలకు ఆయన కూడా అంగీకరించారని చెప్పారు.



సభలో మాట్లాడుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు

పింఛనుదారుల్లో 3 లక్షల మంది అనర్హులు

» వారిని గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే

» ప్రభుత్వంపై 1,400 కోట్ల భారం: స్పీకర్ అయ్యన్న

నాతవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మూడు లక్షల మంది అనర్హులు పెన్షన్ పొందుతున్నారు. వారిని గుర్తించేందుకు అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మర్రిపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయ్యన్న మాట్లాడారు. 'చేతులు ఉన్నవారికి కూడా లేనట్టు వైద్యులు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారు. దాంతో అనర్హులు దివ్యాంగుల కోటాలో పింఛన్లు పొందుతున్నారు. తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లను అరెస్టు చేయాల్సిన అవసరం ఉంది. మూడు లక్షల మంది అనర్హులు పింఛన్లు తీసుకోవడం వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.1,440 కోట్ల భారం పడుతుంది. అనర్హులకు పింఛన్లు తొలగిస్తే ఆ సొమ్ముతో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు' అని అయ్యన్న అన్నారు.

సజ్జల భార్గవ్‌రెడ్డికి 35(3) నోటీసులు ఇవ్వండి

» సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల వ్యవహారంలో హైకోర్టు ఆదేశం

» ఫిర్యాదుదారులకు నోటీసులు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ భార్గవ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం విచారణ జరిగింది. పిటిషనర్‌పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్ల లోపు శిక్ష పడేందుకు వీలున్నవేనని న్యాయస్థానం పేర్కొంది. అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ఫిర్యాదుదారులకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యాలపై విచారణను ఫిబ్రవరి మొదటివారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 35(3) సెక్షన్ ప్రకారం పోలీసులు నోటీసులు ఇచ్చి విచారించాలి. ఎన్టీఆర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వన్ టౌన్ పోలీసులు, సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ భార్గవ్‌రెడ్డి వేర్వేరుగా నాలుగు పిటిషన్లు దాఖలు చేశారు.

ఏటీఎస్‌లకు రైట్ రైట్..!

» వాహన ఫిట్‌నెస్‌లో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సంతకం తప్పనిసరి

» ఏకపక్షంగా ప్రైవేటు వ్యవస్థకు అప్పగించబోమన్న ఆర్టీఏ

» సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఏటీఎస్ కాంట్రాక్టర్లు

» రెండేళ్లపాటు ఫీజు వసూలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

» ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై ఎంవీఐల సంతకం ఉండాలని సూచన

» కొత్త ఏడాదిలో ప్రతి జిల్లాలోనూ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రవాణా శాఖలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ల (ఏటీఎస్) ఏర్పాటులో నెలకొన్న గందరగోళానికి శుభం కార్డు పడనుంది. ముఖ్యమంత్రి వద్దకు చేరిన ఫైలు ముందుకు కదలడంతో ఇక రాష్ట్రవ్యాప్తంగా ఏటీఎస్‌లు ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. మొత్తం వ్యవస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పెట్టేందుకు ససేమిరా అన్న రవాణా శాఖ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించడం.. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు వసూలు చేసే ఫీజులను రెండేళ్లపాటు ఏటీఎస్ కాంట్రాక్టర్లే తీసుకునేందుకు అనుమతించడంతో... రవాణా శాఖ, కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న గందరగోళానికి తెరపడింది. అలాగే మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై తప్పనిసరిగా సంతకం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అనంతపురం, నంద్యాలలో ఏర్పాటైన ఏటీఎస్‌లు కొత్త ఏడాది నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ప్రారంభం కానున్నాయి.



వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే ట్రాక్

వైసీపీ హయాంలో కోట్లు నొక్కేసే ప్రయత్నాలు..

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలకు కారణాలపై సుదీర్ఘంగా సమీక్షించిన కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ డ్రైవర్ల తప్పిదంతోపాటు వాహన ఫిట్‌నెస్ కూడా ప్రధాన కారణంగా గుర్తించింది. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. డ్రైవింగ్ లైసెన్స్ జారీ, వాహన ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమేటిక్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించింది. అన్ని రాష్ట్రాలూ తప్పనిసరిగా ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) ఏర్పాటు చేసుకోవాలని మార్గదర్శకాలు జారీ చేసింది. కేంద్రం సూచన మేరకు గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కుమ్మక్కై ప్రభుత్వ సొమ్ము దోచుకోవడానికి టెండర్లు వేసి ఏటీఎస్‌లు దక్కించుకునే ప్రయత్నం చేశారు. చిత్తూరులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కర్నూలులో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువులు ఏటీఎస్ కేంద్రాలను దక్కించుకుని కొన్నాళ్లపాటు డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) ఫీజులు కోట్లాది రూపాయలు నొక్కేసే ప్రయత్నాలు చేశారు. అయితే ఈలోగా ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వైసీపీ నేతలు తెరవెనుక నుంచి అక్రమమార్గాల ద్వారా ఏటీఎస్‌లు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీంతో మంత్రి సూచన మేరకు రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి.. ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు భిన్నంగా టెండరు నిబంధనలు ఉన్నాయని, ఎంవీఐల పాత్రను పూర్తిగా తొలగిస్తే భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.

ఎంవీఐల పర్యవేక్షణ ఉండాల్సిందే..

ఇదే విషయమై అధికారులతో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి సమీక్షించగా.. మొత్తం వ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అది మరింత ప్రమాదానికి దారితీస్తుందని ఎంవీఐలు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఎంవీఐ ప్రతిదీ తనిఖీ చేసిన తర్వాతే ఫిట్‌నెస్‌కు అనుమతిస్తారని, దీన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే తప్పులు ఎక్కువ జరుగుతాయని అన్నారు. గుజరాత్‌లో 5 వేల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు నకిలీవని తేలాయని గుర్తుచేశారు. తెలంగాణ, కేరళల్లో సొంతంగా ప్రభుత్వాలే ఏర్పాటు చేస్తున్నాయని, ఏపీలోనూ అదే పద్ధతి కొనసాగిస్తే మేలని చెప్పారు. సమ్మతించిన మంత్రి నాన్ ఆటోమేటిక్ పరిశీలనకు ఎంవీఐలను ఏటీసీ కేంద్రాల్లో నియవించాలని, పూర్తిగా ప్రైవేటు పెత్తనాన్ని ఒప్పుకోవద్దని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శికి చెప్పారు. ఫలితంగా రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన ఏటీఎస్‌లు ఆగిపోయాయి. పలు మార్గాల్లో ప్రయత్నాలు చేసిన ఏటీఎస్ కాంట్రాక్టర్లు... ఎంవీఐల పరిశీలనలో జరిగినా తమకు అభ్యంతరం లేదని, కానీ.. ఫీజు రెండేళ్లు తీసుకోకపోతే ఒక్కో కేంద్రానికి నాలుగైదు కోట్లు పెట్టుబడి పెట్టిన తాము తీవ్రంగా నష్టపోతామని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ గందరగోళంపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండేళ్లపాటు ఫీజు ఏటీఎస్‌లు తీసుకునేందుకు.. వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై ఎంవీఐలు సంతకం పెట్టేందుకు అనుమతి ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.



ఆ బాలుడికి జికా వైరస్ లేదు

» స్పష్టం చేసిన తమిళనాడు ప్రభుత్వం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురంలో బాలుడికి జికా వైరస్ సోకలేదని, ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం నిర్ధారించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపురంలోని ఆరేళ్ల బద్దల సుబ్బారాయుడుకు జికా వైరస్ సోకిందనే అనుమానంతో చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. అక్కడి ప్రభుత్వం కూడా స్పందించి బాలుడితోపాటు తల్లిదండ్రుల రక్తనమూనాలను సేకరించి హెల్త్ లేబరేటరీలో పరీక్షించింది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆ ల్యాబ్ ప్రతినిధులు బాలుడికి జికా వైరస్ లేదని నిర్ధారించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. అయితే పూణే వైరాలజీ ల్యాబ్ నుంచి వివరాలు రావాల్సి ఉందని పేర్కొన్నారు.

పేర్ని నాని గోదాముల.. రికార్డులు, కంప్యూటర్లు స్వాధీనం

» తాళాలు పగులగొట్టి తీసుకున్న అధికారులు

» వాటి పరిశీలన పూర్తయితే ఎంత బియ్యం మాయమైందో తెలిసే అవకాశం

» పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

» అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు కోర్టు నో

మచిలీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి చెందిన గోదాముల నుంచి పీడీఎస్ బియ్యం మాయమైన వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. అధికారులు గోడౌన్ కార్యాలయం తాళాలు పగులగొట్టి మరీ రికార్డులను, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్ తాళాలు, రికార్డులు సకాలంలో ఇవ్వకుండా పేర్ని కుటుంబ సభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దాంతో ఈ నెల 15వ తేదీనే న్యాయవాదుల సమక్షంలో అధికారులు గోడౌన్ తాళాలు పగులగొట్టి తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో గోడౌన్‌లోని బియ్యాన్ని మచిలీపట్నం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. అనంతరం తాళాల విషయంలోనూ పేర్నినాని మనుషులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పొట్లపాలెంలోని ఈ గిడ్డంగుల్లో 444.406 టన్నుల పీడీఎస్ బియ్యం ఉండాల్సి ఉండగా, 248.74 టన్నుల బియ్యం మాయమైనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. సర్కారు ఆదేశాల మేరకు మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, తహశీల్దార్ మధుసూధనరావు, పౌరసరఫరాశాఖ అధికారులు బుధవారం రాత్రి అక్కడకు వెళ్లారు. కార్యాలయానికి వేసిన తాళాలను పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని నిశితంగా తనిఖీ చేస్తున్నారు. రికార్డుల పరిశీలన, కంప్యూటర్లలో లెక్కలు సరిచూసే పని పూర్తయితే.. గోడౌన్‌ల నుంచి ఎంతమేర బియ్యం మాయమయ్యాయో తేలిపోతుంది. కాగా.. మచిలీపట్నంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో విజయవాడకు చెందిన స్పెషల్ పీపీ, జాయింట్ డైరెక్టర్ విజయను ప్రాసిక్యూషన్ తరఫున వాదించేందుకు ప్రభుత్వం నియమించింది. ఈ కేసు గురువారం 9వ అదనపు జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. సోమవారానికి వాయిదా వేయాలని స్పెషల్ పీపీ కోరగా.. న్యాయాధికారి ఎస్.సుజాత శుక్రవారానికి విచారణను వాయిదా వేశారు. ఈ కేసులో నిందితురాలు, పేర్ని నాని భార్య జయసుధను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న ఆమె తరఫు న్యాయవాదుల అభ్యర్థనను తిరస్కరించారు.

ముందస్తు బెయిల్‌పై.. మోహన్‌బాబు పిటిషన్ వాయిదా

» బెయిల్ ఇవ్వొద్దన్న జర్నలిస్టు రంజిత్

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీవీ చానల్ లోగోతో జర్నలిస్టుపై దాడికి సంబంధించిన కేసులో ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేస్తూ సినీనటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల కవరేజీలో ఉన్న రంజిత్‌పై మోహన్‌బాబు దాడి చేసిన విషయం తెలిసిందే.! దీనిపై పహాడీషరీఫ్ ఠాణాలో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం మరోమారు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌లో జర్నలిస్టు రంజిత్ ఇంప్లీడ్ అయ్యారు. రంజిత్ తరఫున న్యాయవాది ఎనుగంటి సుధాంశురావు వాదనలను వినిపిస్తూ.. మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని పేర్కొన్నారు. మోహన్‌బాబు హైదరాబాద్‌లో లేరని.. దుబాయ్ వెళ్లిపోయారని పేర్కొన్నారు. మోహన్‌బాబు తరఫు న్యాయవాది అవినాశ్‌రెడ్డి వాదిస్తూ.. తన క్లైంట్ హైదరాబాద్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్న ధర్మాసనం.. అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని సూచించింది. ముందస్తు బెయిల్ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

మహిళల ఆర్థిక స్వావలంబనే చంద్రబాబు లక్ష్యం

» ఎన్టీఆర్ ట్రస్టు సేవలు విస్తరిస్తాం: నారా భువనేశ్వరి

» కుప్పంలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం



కుప్పంలో లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేసి, వారితో ముచ్చటిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ట్రస్టు సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తామని చెప్పారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పంలో నాలుగు రోజుల పర్యటన కోసం వచ్చిన ఆమె, మొదటిరోజైన గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మమేకమై, వారికి దిశానిర్దేశం చేశారు. పట్టుదల, కృషి, క్రమశిక్షణతో ఏదైనా సాధించగలమన్నారు. డ్రగ్స్, సోషల్ మీడియాకు బానిసలు కావద్దని హితవు పలికారు. తానిక్కడకు ముఖ్యమంత్రి భార్యగానో లేదా ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగానో రాలేదన్నారు. ఒక యువతరం మేలుకోరే తల్లిగా కొన్ని మంచి మాటలు చెప్పిపోవడానికి వచ్చానన్నారు. తాను కూడా హౌస్ వైఫ్‌గా ఉంటూ చంద్రబాబు ఆదేశం మేరకు హెరిటేజ్ ఎండీగా బాధ్యతలు తీసుకునే నాటికి బయటి ప్రపంచమే తెలియదన్నారు. అయితే స్వయం కృషితో, తన శక్తిమీద తనకు నమ్మకంతో, టీం వర్క్‌తో సంస్థను ఉన్నత స్థానానికి తీసుకురాగలిగానని చెప్పారు. కష్టపడితే ఫలితం దక్కుతుందన్నారు. తన కుమారుడు లోకేశ్‌కు కూడా ఇదే చెబుతానన్నారు. అనంతరం గుడుపల్లె మండలం నలగాంపల్లెలో మహిళలతో మమేకమయ్యారు. వారి సమస్యలు విని, చంద్రబాబుకు చెప్పి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. తాను ఎన్నికల ముందు చెప్పినట్టుగా ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గానికి వస్తున్నానని, భవిష్యత్తులో కూడా వస్తానని తెలిపారు. ప్రతి గ్రామానికీ వచ్చి సమస్యలు వింటానని, ఆ విన్న సమస్యలను చంద్రబాబుకు నివేదించి తీర్చడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి చంద్రబాబు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ట్రస్టు తరఫున కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు అవసరమైన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించామన్నారు. అనంతరం కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున నడుస్తున్న స్కిల్ డెవలప్ సెంటర్ విస్తరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఇక్కడ మహిళలు ఉత్పత్తి చేసిన జూట్ బ్యాగులు, గాజులు వంటి వాటిని పరిశీలించారు. మార్కెటింగ్ సౌకర్యాన్ని మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. కుట్టు శిక్షణలో ఉన్న యువతులతో మాట్లాడి వారికి ఉపాధి కూడా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ట్రస్టు తరఫున నడుస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌కు వెళ్లి, అక్కడ విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఇంకా ఢిల్లీలోని క్రాక్ అకాడమీ తరఫున కుప్పంలో త్వరలోనే సివిల్స్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. అనంతరం కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ట్రస్టు తరఫున తోపుడు బండ్లు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి యంత్రాలు, కుట్టు మిషన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ కుప్పంలో ట్రస్టు తరఫున ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా పలు సేవలను ట్రస్టు తరఫున విస్తరిస్తామని చెప్పారు. అంతకుముందు శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మిస్తున్న సొంత ఇంటి పనులను ఆమె పరిశీలించారు.

ఆన్‌లైన్‌లోనూ టీటీడీ డైరీ, క్యాలెండర్ల విక్రయాలు

తిరుమల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం టీటీడీ 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లోను.. ఆన్‌లైన్‌లోనూ భక్తులకు విక్రయిస్తోంది. 12 పేజీలు, 6 పేజీలు, టేబుల్ టాప్ క్యాలెండర్లు, డీలక్స్ డైరీలు, చిన్న డైరీలను, పెద్ద, చిన్నసైజు క్యాలెండర్లను అందుబాటులో ఉంచింది. టీటీడీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్నవారికి తపాలా ద్వారా ఇంటి వద్దే టీటీడీ డైరీ, క్యాలెండర్లు పొందే సౌలభ్యం ఉంది.



జాయింట్ కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

జిల్లా విపత్తు సహాయ నిధికి శ్రీసిటీ పరిశ్రమల రూ.కోటి విరాళం

శ్రీసిటీ, డిసెంబరు 19: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా తిరుపతి జిల్లా విపత్తు సహాయ నిధికి శ్రీసిటీ పరిశ్రమలు రూ.కోటి విరాళాన్ని అందించాయి. ప్రభుత్వ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సమక్షంలో శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ విరాళం చెక్కును జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు అందజేశారు. శ్రీసిటీ, పరిశ్రమల భాగస్వామ్య సమష్టి కృషిని యువరాజ్ ప్రశంసించారు. ఈ తరహా సాయం సామాజిక బాధ్యత, సమాజ సంక్షేమం పట్ల కార్పొరేట్ రంగం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ విపత్తు సహాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో శ్రీసిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

ఐలాకు టీహెచ్‌కే అంబులెన్స్ విరాళం

సీఎస్ఆర్ చర్యల్లో భాగంగా శ్రీసిటీలోని లీనియర్ మోషన్ గైడ్‌లను ఉత్పత్తి చేసే ప్రముఖ జపనీస్ పరిశ్రమ టీహెచ్‌కే ఇండియా రూ.29 లక్షల విలువైన అంబులెన్స్‌ను శ్రీసిటీలోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) కార్యాలయానికి విరాళంగా ఇచ్చింది.

వారం రోజులు ఈ-ఆఫీస్ బంద్

» అప్‌గ్రేడేషన్ కోసం నిలిపివేత

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిపాలనలో ఫైళ్ల కదలిక కోసం వాడుతున్న ఈ-ఆఫీస్‌ను వారంపాటు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీశాఖ ఆదేశాల మేరకు ఈ-ఆఫీస్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందని సాధారణ పరిపాలన శాఖ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 సాయంత్రం 6 గంటల నుంచి 26 ఉదయం 11 గంటల వరకు నిలిపివేసి, అప్‌గ్రేడేషన్ పనులు చేస్తామని తెలిపారు. అన్ని శాఖల సెక్రటరీలు, శాఖాధిపతులు ఈ వారం రోజులూ ఈ-ఆఫీస్‌కు ప్రత్యామ్నాయం చూసుకోవాలని ఆదేశించారు.

4న విశాఖలో నేవీ సాహస విన్యాసాలు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జనవరి 4న విశాఖ సాగర తీరంలో నేవీ సాహస విన్యాసాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గురువారం తెలిపారు. ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

క్రికెట్ మేధావి

బ్యాటర్ బుర్రను చదివేసే మేధావి అతను. ఏ షాట్‌కు ఎలా వికెట్ పడగొట్టాలన్న ప్రణాళిక వేసుకునే ఇంజనీర్ అతను. బంతిపై పట్టు సాధించి వేళ్లతోనే మాయ చేసే మాంత్రికుడు. మొత్తంగా విభిన్నమైన అస్త్రాలతో ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల స్పిన్ యోధుడు. ప్రపంచ క్రికెట్‌లో అతికొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే ఘనతలెన్నో అందుకున్న బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ ఆటను ముగించాడు. పద్నాలుగేళ్ల తన సుదీర్ఘ కెరీర్‌కు తెరదించుతూ ఆ[illegible]యా పర్యటనలో ఉండగానే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్టు ప్రకటించాడు.

అనిల్ కుంబ్లే రిటైరయ్యాడు.. హర్భజన్ సింగ్ కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. మరి.. దశాబ్దాలుగా భారత బౌలింగ్‌కు ప్రధాన ఆయుధంగా ఉన్న స్పిన్ దళాన్ని ముందుకు నడిపించేదెవరు? కుంబ్లే, హర్భజన్‌ల వారసత్వాన్ని కొనసాగించేదెవరు? ఇలాంటి సందేహాలు ముసురుకున్న వేళ భారత జట్టులోకి వచ్చాడు అశ్విన్. ఆరంభంలో సాధారణ బౌలర్‌గానే కనిపించినా, రానురాను తన శైలిని అసాధారణంగా మార్చుకున్నాడు. తన అమ్ములపొదిలోని ఒక్కో అస్త్రాన్ని బయటకు తీస్తూ ముందుకు సాగాడు. ఒక ఓవర్‌లో ఆరు బంతులను ఆరు రకాలుగా వేయగలిగే నైపుణ్యాన్ని సంతరించుకొని బ్యాటర్లకు కఠిన పరీక్షలా నిలిచాడు. బంతిని మధ్యవేలితో పట్టుకొని సంధించే క్యారమ్‌బాల్‌తో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెట్టడం అశ్విన్‌కే చెల్లింది.

క్రీడాకారులు చిన్నప్పుడు ఆటలను కెరీర్‌గా ఎంచుకునే క్రమంలో చదువుపై అంతగా దృష్టి సారించరు. కానీ, అశ్విన్ అందుకు భిన్నం. క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంటూనే చదువులోనూ రాణించాడు. ఏకంగా ఇంజనీరింగ్ పట్టభద్రుడయ్యాడు. మొదట మీడియం పేసర్‌గా క్రికెట్‌లోకి అడుగుపెట్టినా, అమ్మ సూచనతో ఆఫ్ స్పిన్ బౌలింగ్‌కు మారడం, అతని కెరీర్‌కు ఎంతో దోహదం చేసింది. కెరీర్ ఆరంభంలో అశ్విన్‌కు మోకాలి నొప్పి సమస్యగా ఉండేది. ఆ సమయంలో అమ్మ..'పేస్ బౌలింగ్‌తో ఎక్కువగా ఎందుకు పరుగులు పెడతావు? కొన్ని అడుగులు వేసేలా స్పిన్ బౌలింగ్ వేయొచ్చు కదా' అని కుమారుడికి సలహా ఇచ్చింది. వెంటనే బౌలింగ్ తీరును మార్చుకొన్న అశ్విన్.. తర్వాతి కాలంలో స్పిన్నర్‌గా అత్యున్నతస్థాయికి ఎదిగిన తీరు అమోఘం. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడుతున్న సందర్భంలో తన తల్లికి గుండెపోటు వచ్చిందని తెలియడంతో పరామర్శకు వెళ్లి వచ్చి మళ్లీ ఆడడం అశ్విన్ అంకితభావానికి నిదర్శనం.

'ప్రతి ఒక్కరికీ వీడ్కోలు సమయం వస్తుంది.. ఇప్పుడు నా వంతు' అని అశ్విన్ మీడియా సమావేశంలో హుందాగా వెల్లడించి ఆట నుంచి తప్పుకొన్నాడు. ప్రతి ఆటగాడు ఏదో ఒకరోజు గుడ్‌బై చెబుతాడు. ఇందులో విశేషమేమీ లేకపోవచ్చు. కానీ, తానెంచుకున్న ఆటపై అతని ప్రభావం ఎంత అనేదే ప్రధానాంశం. 106 టెస్టులాడిన అశ్విన్ 537 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే తర్వాత రెండోస్థానంలో ఉన్నాడు. ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన ఘనతను 37 పర్యాయాలు అందుకున్నాడు. టెస్టుల్లో పదకొండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నిసార్లు ఈ అవార్డు అందుకున్న ప్రథముడిగా శ్రీలంక దిగ్గజ బౌలర్ ముత్తయ్య మురళీధరన్‌తో సమంగా నిలిచాడు. స్పిన్నర్ అంటే తమకు అనుకూలమైన పిచ్‌లపై మాత్రమే ప్రభావం చూపగలరన్న ముద్రను చెరిపేసిన బౌలర్. బంతితోనే కాదు, బ్యాటుతోనూ సత్తాచాటిన ప్రతిభావంతుడు అశ్విన్. ఎన్నో సందర్భాల్లో తనదైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత జట్టు విజయాల్లో తోడ్పాటు అందించిన అతడు నాలుగువేలకు పైగా పరుగులు కూడా రాబట్టాడు. టెస్టుల్లో ఆరుసార్లు శతకాలు సాధించి ఆల్‌రౌండర్‌గానూ తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. ప్రత్యర్థి జట్టును జయించే క్రమంలో సారథి రచించే ప్రణాళికలు, వ్యూహాల్లో ఎన్నోసార్లు భాగస్వామి అయ్యాడు. ఆటను సునిశితంగా పరిశీలిస్తూ, వైవిధ్యమైన ఆలోచనలతో రాజుకు మంత్రి తరహాలో అండగా నిలవడంలోనూ అశ్విన్‌కు మరెవరు సాటిరారు. ఇలా తనకు అంది వచ్చిన ప్రతి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయిన అతను ఆటకు వందశాతం న్యాయం చేశాడు. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని లిఖించుకొన్నాడు. క్రికెట్ అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆటను ప్రదర్శించి కెరీర్‌ను పరిపూర్ణంగా ముగించాడు.

బలమున్నా, లేకున్నా తగ్గేదిలేదు!

పార్లమెంటులో 'ఒకే దేశం—ఒకే ఎన్నిక' బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా ఎన్డీయే ప్రభుత్వం, ముఖ్యంగా బీజేపీ... అటు విపక్షాలకు, ఇటు మిత్ర పక్షాలకూ తగ్గేదేలేదనే సంకేతం ఇస్తున్నది. మోదీ నేతృత్వంలో బీజేపీ మూడోసారి ప్రభుత్వం ఏర్పరిచినా, గత రెండు దఫాల మాదిరి పూర్తి మెజారిటీ దక్కక, మిత్రపక్షాలపై ఆధారపడిన పరిస్థితి. అయినా తన ఆత్మవిశ్వాసంలో ఏ మాత్రం తేడా రాలేదని చెప్పడానికి అన్నట్లు కేబినెట్ ఈ బిల్లుని ఆమోదించడం, పార్లమెంటుకి పంపించడం చకచకా జరిగిపోయాయి. 'ఒకే దేశం—ఒకే ఎన్నిక' అన్నది బీజేపీ మ్యానిఫెస్టోలో ముఖ్యాంశం. కానీ దానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు జరపడానికి రెండింట మూడొంతుల సభ్యుల మద్దతు కావాలి. ఈ అంశంపై తన మిత్రపక్షాలకే ఏకాభిప్రాయం లేని స్థితిలో ప్రభుత్వం దీన్ని తలకెత్తుకుంటుందని సాధారణంగా ఎవరూ అనుకోరు. అయితే 'బలమున్నా, లేకున్నా తగ్గేదేలే' అని కమలం పార్టీ బలమైన సందేశం ఇవ్వడమే మంచిదని భావించింది. చూడాలి.. హిట్ అవుతుందో, లేదో?

జమిలి విధానంలో ఎన్నో సంక్లిష్టతలున్నాయి. లోతుగా ఆలోచించాల్సిన విషయాలున్నాయి. మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ నివేదిక ఈ విధానానికి అనుకూలంగా ఉంది. అనుకూల వాదనల్లో ముఖ్యమైంది తక్కువ ఖర్చు. రెండోది మాటిమాటికీ ఎక్కడో ఒకచోట జరుగుతున్న ఎన్నికల వల్ల పాలనకు పడుతున్న బ్రేకులు. అయితే తక్కువ ఖర్చు అన్నదానికి బలమైన ఆధారాలు లేవు. మొదలైతేనే కదా అసలు లెక్కలు పైకి వస్తాయి. ప్రస్తుతానికి అంచనాలే. ఎన్నికల కమిషన్ 2029లో ఈ జమిలి విధానం పాటిస్తే అందుకు ఏడువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు సమాచారం. అలాగే మాటిమాటికీ ఏదోచోట ఎన్నికల వల్ల ప్రభుత్వం పాలనపై ఫోకస్ పెట్టలేకపోవడం కూడా అధిగమించలేని అవరోధం కాకపోవచ్చు. కేంద్రంలో పాలక పక్షం ప్రతీ ఎన్నికా తమ ప్రతిష్ఠకు సవాలుగా భావించకుండా ఆయా ప్రాంతాల నాయకత్వానికి వదిలేస్తే సమస్యే కాదు. మిగతా పక్షాలకు పాలనతో ఎటూ సంబంధం ఉండదు.

ఇక ప్రతికూల వాదనలో ముఖ్యమైనది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని. ఖచ్చితంగా కాకపోయినా జమిలి విధానంలో రాష్ట్రాల కన్నా, కేంద్రం బలంగా మారే అవకాశాలు ఉన్నాయి. జాతీయ అంశాలు ప్రాధాన్యత పొంది, ప్రాంతీయ అంశాలు వెనక్కుపోతాయి. అది జాతీయ పార్టీలకు మేలు చేస్తుంది. భిన్న సంస్కృతుల, ప్రాంతాల నేపథ్యంలో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అధికారాల విభజన చక్కగా చెయ్యడం ద్వారా రాజ్యాంగం సమాఖ్య స్ఫూర్తిని చూపింది. అటు కేంద్రం మిథ్య అన్న భావం రాకుండా, ఇటు రాష్ట్రాలు కేవలం విడిభాగాలు అన్నట్టు కాకుండా... రెంటికీ ప్రాధాన్యత ఇస్తూ బ్యాలెన్స్ చేసింది. జమిలి ఎన్నికల విధానం వల్ల త్రాసు కేంద్రం వైపే మొగ్గుతుంది. ఇంకో భయం ఏమిటంటే రాష్ట్రంలో ఎవరికీ మెజారిటీ లేనప్పుడు స్థిరమైన గడువు వల్ల ప్రభుత్వాన్ని నిలుపుకోడానికి లేదా లాక్కోడానికి పార్టీల్లో అనైతికత పెరగొచ్చు అన్నది.

ఏది ఏమైనా ఈ అంశంపై పార్లమెంటులోనే కాకుండా పౌర సమాజంలో, వీధుల్లో విస్తృతంగా చర్చ జరగాలి. అన్ని కోణాల్ని స్పృశించాలి. ఒకే దేశం—ఒకే ఎన్నిక విధానం (టైమ్) కన్నా, ఎన్నికల విధానమే (క్వాలిటీ) సంస్కరింపబడాలి. డబ్బు, మద్యం సహా అడ్డదారులన్నీ మూసుకుపోయినప్పుడే నిజమైన ప్రజాభిప్రాయం వ్యక్తమౌతుంది. సరైన ఎన్నిక ద్వారానే ప్రజాస్వామ్యం శోభిల్లుతుంది.

– డి.వి.జి. శంకరరావు

మన రాజ్యాంగంలో భారతీయత...!

భారత రాజ్యాంగంలోని భారతీయత ఏమిటి? భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభలలో మన సంవిధానంపై జరిగిన చర్చ ఆ ఆసక్తికరమైన ప్రశ్నను పూర్తిగా ఉపేక్షించింది. పాలక పక్షానికే కాకుండా ప్రతిపక్షానికీ అది ఒక ఇబ్బందికరమైన ప్రశ్నే. లోక్‌సభ ఎన్నికలలో సొంత మెజారిటీని సాధించుకోలేకపోయిన నేపథ్యంలో ప్రస్తుత దశలో ఆ ప్రశ్నను లేవనెత్తడం అంత వివేకవంతమైన పనికాదని పాలక పక్షం తప్పక భావించి ఉంటుంది. ఈ కారణంగా భారతీయ జనతా పార్టీ తన భావజాల పరమైన ఉత్సాహాన్ని నియంత్రించుకుని రాజ్యాంగాన్ని ప్రశ్నించే పనిని పార్లమెంటు వెలుపల తన మేధో మద్దతుదారులు, సహ ప్రయాణీకులకు వదిలివేసింది; పార్లమెంటులో ప్రధానమంత్రి భారత రాజ్యాంగ పరిరక్షణకు తన నిబద్ధతను నొక్కి చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాటించడంలో తమ ప్రభుత్వం అద్వితీయంగా వ్యవహరిస్తోందని ఆయన వివరించిన తీరు ఒక నిరర్థక హాస్య సన్నివేశంగా పరిగణించాలి. ప్రతిపక్షాలకు ఆ ప్రశ్న సైద్ధాంతికంగా ఒక జటిల సమస్యగా, సాంస్కృతికంగా చమత్కారపూరితమైనదిగా అనిపించి ఉండవచ్చు. కనుకనే అవి ఆ ప్రశ్నను నిర్లక్ష్యం చేశాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో సావర్కార్ గురించి ప్రస్తావించినప్పుడు ఆ ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఉద్యుక్తుడు అయినట్టు కనిపించాడు కానీ ఆయన దానిపై మనసు పెట్టలేదు. అలా ప్రస్తావించి ఇలా వదిలివేశారు. ఆ చర్చ యథావిధిగా రాజకీయ వాదోపవాదాలుగా, పరస్పరం బురదజల్లుకోవడంగా దిగజారింది.

పాలక ప్రతిపక్షాలు పట్టించుకోనంత మాత్రాన ఆ ప్రశ్న ప్రాధాన్యం కోల్పోతుందా? రాజ్యాంగం పట్ల భారతీయ జనతా పార్టీ కొత్త శ్రద్ధాసక్తులు, ప్రేమానురాగాలను చూసి మనం మోసపోకూడదు సుమా! మన రాజ్యాంగబద్ధ గణతంత్ర రాజ్యంపై కనిపించీ కనిపించకుండా జరుగుతున్న ఒక దాడి మధ్యలో మనం ఉన్నాం. మరి ఈ దాడికి రాజ్యాంగం న్యాయబద్ధతను ప్రశ్నించడం ఒక అనివార్యత. ఆ సంవిధాన భారతీయతను ప్రశ్నించడమనేది రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారి బలమైన ప్రధాన భావజాల అస్త్రం. సందేహం లేదు, అదొక ఆలోచనాత్మకమైన ప్రశ్న. నిబద్ధతతో దానిని తర్కించవలసి ఉంది. మన రాజ్యాంగాన్ని చాలవరకు మన వలసపాలకుల భాషలో ఆలోచించి రాయడం జరిగింది. ఆధునిక పాశ్చాత్య రాజ్యాంగవాద ఆలోచనాస్రవంతి నుంచి గ్రహించిన అంశాలతో భారత రాజ్యాంగ రచనా నిర్మాణం జరిగింది. ఆ రాజ్యాంగం 'భారతీయ సంప్రదాయానికి 'విరుద్ధమైనది'., 'విదేశీయమైనది' అని రాజ్యాంగ సభలోనే పలువురు సభ్యులు ఆక్షేపించారు. దాని 'భారతీయత' గురించి పలు ప్రశ్నలు అప్పుడే లేవనెత్తడం జరిగిందనే విషయాన్ని మనం మరువ కూడదు.

ఆధునికతావాద, విశ్వజనీన దృక్కోణం ఈ ప్రశ్నకు సబబైన సమాధానం కాబోదనే వాస్తవాన్ని కూడా అంగీకరిద్దాం. 'ఆధునిక భారత రాజ్యాంగం విధిగా భారతీయమైనదిగా ఎందుకు ఉండాలి?' అని ప్రశ్నించవచ్చు. అయితే ఇది ఆ ప్రశ్నకు మాటకు మాటమాత్రమే అవుతుంది. ఇటువంటి అనుచిత ప్రతినిందతో ప్రయోజనముండదు. ప్రతి రాజ్యాంగమూ తన సొంత సందర్భంలో సాంస్కృతిక వాస్తవికత అనే పరీక్షలో నిలబడాలి. ఈ ఆధునికతా ప్రతిస్పందన కూడా ప్రతికూలంగా పరిణమించవచ్చనే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఆధునిక రాజ్యాంగ నిర్మాతలు గతం నుంచి పూర్తిగా వేరుపడడానికి తీవ్ర ఆసక్తి చూపారు. ఈ కారణంగానే అది భారతీయత నుంచి వేరుపడిందని, మన నాగరికతా విలువలకు పరాయిదిగా ఉన్నదనే భావన చాలా మందిలో ఏర్పడేందుకు దారితీసింది.

అసలు భారతీయత అంటే ఏమి కాదో మొదట చూద్దాం. భారత రాజ్యాంగం భారతదేశ గతం నుంచి ప్రభవించింది-కాదు. రాజ్యాంగ నిర్మాతలు దానిని అలా ఉద్దేశించలేదు. 'విదేశీ'మైనది ఏదీ అంటకూడదు, సోకకూడదు అని కూడా వారు భావించలేదు దానితో ప్రభవించింది కానేకాదు. ఒక లిఖిత రాజ్యాంగం అవసరమైన ఆధునిక రాజ్య వ్యవస్థ సందర్భాన్ని వారు విస్మరించలేదు. ఈ రీత్యా భారత రాజ్యాంగం అనేది ఒక విరోధాభాస. అనూచానంగా వస్తున్న మన జీవనస్రవంతికి సంబంధించిన ఏదో ఒక లక్షణం ఉన్నంత మాత్రాన అది భారతీయమైనదని చెప్పడానికి వీలులేదు. రాజ్యాంగ లిఖిత ప్రతిపై భారతీయ ఇతిహాసాలు, పురాణ గాథలను చిత్రించిన బొమ్మలు దాన్ని భారతీయమైనది చేయలేదు. భారత శిక్షా స్మృతికి భారతీయ న్యాయసంహితగా పునః నామకరణం దాన్ని భారతీయమైనది చేయలేదు.

భారత రాజ్యాంగంలో భారతీయతకు అన్వేషణ రెండు రూపాలను తీసుకుంటుంది. ఒకటి మరో దానికంటే మరింత ఎక్కువగా మౌలికమైనది. అభ్యుదయ ఆకాంక్షాభరిత అవతారంలో ప్రామాణికతకు ఒక కొత్త నవీనత అవసరం.

భారతీయ తరహా రాజ్యాంగం అంటే పాశ్చాత్య దేశాల నుంచి స్వీకరించిన రాజనీతి చింతనను పూర్తిగా వదిలివేయవలసి ఉంటుంది. మన నాగరికతా వారసత్వం ప్రాతిపదికన రాజ్యాంగ సంస్థలను పూర్తిగా సరికొత్త రీతుల్లో నిర్మించుకోవలసి ఉంటుంది. గాంధీ తన 'హింద్ స్వరాజ్'లో కోరింది ఇదే. కనుకనే శ్రీమన్ నారాయణ్ లాంటి గాంధేయవాదులు భారత రాజ్యాంగం భారతీయ మేధాశక్తికి న్యాయం చేయలేదని వాపోవడానికి కారణమయింది. గత శతాబ్దిలో అమలులోకివచ్చిన ఏ కొత్త రాజ్యాంగమూ (ఇరాన్, బొలీవియాని మినహాయిస్తే) ఈ ప్రామాణికత పరీక్షకు నిలబడలేవు. ప్రత్యామ్నాయ రాజ్యాంగం కోసం అన్వేషణ సహేతుకమైన ఆకాంక్షే కావచ్చుగానీ, అటువంటి రాజ్యాంగానికి సుసంబంధమైన ముసాయిదా అనేది ఏదీ ఎవరి వద్దా లేదు. ఈ దృష్ట్యా సంవిధానపరమైన భారతీయత అనేది ఇంకా రూపుదిద్దుకుంటున్న గుణమే.


మరింత సాధ్యమైన వివరణ రచనాపరమైన మౌలికత. స్వీకరించి అంశాల పునర్ రూపకల్పనలో నవ్యదనం. భారత రాజ్యాంగ భారతీయతను ఈ దృష్ట్యా వివిధ గీటురాళ్లతో పరీక్షించవచ్చు: పాశ్చాత్య రాజ్యాంగ నిర్మాణ సంప్రదాయం నుంచి గ్రహించిన అనేక అంశాలను భారతీయ సందర్భానికి అనుగుణంగా ఎలా పునర్ సర్దుబాటు చేసి మార్చివేశారు? ఈ కొత్త ఏర్పాటు భారత నాగరికతా ప్రస్థాన ప్రశస్తతను ప్రతిబింబిస్తున్నదా? రాజ్యాంగానికి ప్రాతిపదికగా ఉన్న తాత్త్వికత మన మేధో సంప్రదాయాలతో ఏకీభవించేదిగా ఉన్నదా? ఈ రాజ్యాంగం పనిచేస్తున్న తీరు ఈ భావనలను ధ్రువీకరిస్తున్నదా?

ఈ సమంజసమైన, ఉపయుక్తమైన ప్రశ్నలను అడిగినప్పుడు భారత రాజ్యాంగంలోని భారతీయతను మనం చూడగలుగుతాము. మూడు సంవత్సరాల కంటే తక్కువ వ్యవధిలోనే రాజ్యాంగాన్ని రాసి ఉండవచ్చు. అయితే ఒక శతాబ్దికి పైగా సాగుతున్న ఆలోచనల ద్వారా అది రూపుదిద్దుకున్నది. సారాంశంలో రాజ్యాంగం 'ఆధునిక భారతీయ రాజకీయ చింతన' నుంచి రూపుదిద్దుకున్న మౌలిక శాసనం. ఆ సమున్నత ఆలోచనా స్రవంతి ఏ ఒక్క వాదం లేదా దృక్పథానికి పరిమితమైనది కానందున, భారత్ గురించిన విభిన్న పోటీదాయక దార్శనికతల మధ్య సమతుల్యతను మన రాజ్యాంగం ప్రతిబింబించింది. మన మేధో సంప్రదాయాల విభిన్న, బహుళ రీతుల పట్ల ప్రగాఢ అవగాహనతో అది పరిపుష్టమయింది. వలస పాలన అందించిన ఆధునికత ప్రభావంతో మన రాజ్యాంగం ఒక నవ్య సొంత భారతీయ ఆధునికతను రూపొందించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. రాజ్యాంగ నిర్మాణాన్ని ప్రభావితం చేసిన సత్ సంకల్పమది. గత 75 సంవత్సరాలుగా న్యాయశాస్త్ర మీమాంస, న్యాయవివాదాల పరిష్కార అనుభవాలు భారత ప్రజలు— రాజ్యాంగం గురించి వినని వారితో సహా — ఈ భారతీయ రాజ్యాంగ నైతికతా స్పృహను కలిగి ఉన్నారని, దానికి నిబద్ధులయి ఉన్నారని చూపుతున్నాయి.

భారత రాజ్యాంగ భారతీయతా గుణం మీకు కనిపించదు. సుపరిచితాలు అయిన వివిధ లక్ష్యాలు, రీతి రివాజులను ఒక కొత్త విశిష్ట మౌలిక శాసనపత్రాన్ని రూపొందించేందుకు కలిపివేయబడ్డాయి. ప్రామాణిక సమాఖ్య రాజ్యానికి బదులుగా 'యూనియన్ ఆఫ్ ఇండియా'గా రూపకల్పన చేయడం ఆధునిక యుగ పూర్వపు రాజ్య వ్యవస్థ బహుళ అంతస్థులకు అనుగుణంగా ఉంది. యూరోపియన్ శైలిలో 'జాతి—రాజ్యం'గా కాకుండా 'రాజ్య—జాతి' (స్టేట్—నేషన్)గా జరిగిన నిర్మాణం సాంస్కృతిక, సామాజిక వైవిద్యాన్ని సంపూర్ణంగా గౌరవించిన మన ప్రాచీన సంప్రదాయాన్ని ప్రతిబింబించింది. భారత రాజ్యాంగ లౌకికవాద లక్షణాలు అమెరికన్ లేదా ఫ్రెంచ్ తరహా లౌకికవాదానికి ప్రతిరూపాలు కావు; 'సూత్రబద్ధ దూరం'ను పాటించే భారతీయ తరహా లౌకికవాదం మైత్రీ సంప్రదాయం నుంచి స్ఫూర్తి పొందింది. సర్వ ధర్మ సంభవ అనే భావం ఆదర్శానికి అది సన్నిహితంగా ఉన్నది. భారత రాజ్యాంగ 'సామ్యవాద లక్షణాలు కరుణ లేదా క్రియాశీల దయ అనే సూత్రానికి కొనసాగింపు. అవును, కుల వ్యవస్థ, అస్పృశ్యత దురాచారాల తిరస్కృతి సుదీర్ఘ సామాజిక, మత సంస్కరణల సంప్రదాయాల ప్రాతిపదికన జరిగింది.

భారత్‌లో పరంపర అనేది గతాన్ని పరిరక్షించుకోవడం గురించి కాదు, అది మన వర్తమానాన్ని పునర్ చైతన్యపరచుకుని, పునశ్శక్తిమంతం చేసుకోవడం గురించి. ముందటి తరాల నుంచి గ్రహించిన వివేకంలోని మంచిని స్వీకరించి, దానికి కొత్త గుణాత్మక రూపమివ్వడం, చెడు లేదా కాలం చెల్లిన దాన్ని త్యజించడం ఆధారంగా జరిగడమే పరంపర పరమార్థం. ఇదే మన రాజ్యాంగం చేసింది. భారత రాజ్యాంగ భారతీయత బ్రెడ్ పకోడా లాంటిదని చెప్పవచ్చు. విదేశీ తెల్ల రొట్టెను ప్రామాణికమైన భారతీయ ఆహారంగా మార్చివేసింది. లేదా, గ్రహించిన సాంకేతికతను భారతీయ స్ఫూర్తి, విలువలను ప్రతిబింబించే ఒక కళారూపాన్ని నిర్మించేందుకు ఉపయోగించే భారతీయ సినిమా లాంటిది. బ్రెడ్ పకోడా లేదా భారతీయ సినిమాలా భారత రాజ్యాంగమూ మన దేశీయ ప్రతిభకు ఒక నిదర్శనం— అది చాలా ఆధునికమైనది, విలక్షణంగా భారతీయమైనది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)



వలసపాలన అందించిన ఆధునికత ప్రభావంతో మన రాజ్యాంగం ఒక నవ్య సొంత భారతీయ ఆధునికతను నిర్మించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. వివిధ లక్ష్యాల ఏకీకరణతో రూపొందిన ఒక కొత్త విశిష్ట మౌలిక శాసనమైన భారత రాజ్యాంగం మన దేశీయ ప్రతిభకు ఒక నిదర్శనం– అది చాలా ఆధునికమైనది, విలక్షణంగా భారతీయమైనది.



■ యోగేంద్ర యాదవ్

రైతాంగ సమస్యలకు పరిష్కారాలు కనుగొందాం

1964లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, పశువైద్య కళాశాల; బాపట్లలోని వ్యవసాయ కళాశాల; తిరుపతిలోని వ్యవసాయ, పశువైద్య కళాశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. 1990 దశకంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. ఆ తరువాత కాలంలో ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గృహ విజ్ఞాన, ఉద్యాన కళాశాలలు ఏర్పడ్డాయి. మరికొంత కాలం తరువాత మరికొన్ని వ్యవసాయ, పశువైద్య కళాశాలలు వచ్చి చేరాయి. ఆ తరువాత కాలంలో పెరుగుతున్న అవసరాలు, ఆకాంక్షల మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలుగా, వేటికవిగా మూడుగా విభజించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఈ మూడు ఆరు అయ్యాయి.

విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు దేశ పరిపాలన రంగం మొదలుకుని బ్యాంకింగ్, వ్యవసాయం అనుబంధ రంగాల్లో విద్య పరిశోధన, విస్తరణ రంగాల్లో తమదైన ముద్ర వేశారు. పలు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలు మొదలుకుని అన్ని సివిల్ సర్వీస్ విభాగాల్లో తామేంటో నిరూపించుకున్నారు. ఇక బ్యాంకింగ్ రంగంలో నాబార్డ్ చైర్మన్ నుంచి ఎస్‌బిఐ చైర్మన్ వరకు అత్యున్నత పదవుల్లో చరిత్ర సృష్టించారు. అంతర్జాతీయంగా శాస్త్ర, పరిశోధన రంగాల్లో ఆకాశమే హద్దుగా ఎదిగారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలో ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు తిరుగే లేదు. ఇంకా ఎంతో మంది విద్యార్థులు వారి జీవన గమనంలో రాజకీయాల్లో ప్రవేశించి శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులయ్యారు. మంత్రి పదవులు నిర్వహించారు.

అంతులేని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, విస్తరణవాదం కారణంగా ప్రపంచ భూసారం తగ్గి కనీస పోషకాలు లేని పంటలతో ప్రపంచ దేశాల ప్రజలు రోగనిరోధక శక్తిని కోల్పోతున్నారు. గత మూడు దశాబ్దాలలో ఐదు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. సమాజంలో అనేక జీవన రంగాలలో అసహజ మరణాల పాలవుతున్నారు. వారిలో విద్యార్థులు, నిరుద్యోగులు కూడా గణనీయంగా ఉన్నారు. ఈ సమాజం మన అందరం జీవించడానికి, అసహజ మరణాల పాలు కాకుండా ఉండడానికి ఏమిచేయాలో మనందరం కలిసి ఆలోచించాలి. ఒక్క వాయు కాలుష్యం కారణంగా ఏటా 16 లక్షల మంది చనిపోతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విషాదాల నివారణకు నడుం బిగించాల్సింది మనమే.

చదువు లక్ష్యం ప్రజలకు సేవ చేయడంగా ఉండాలి. సమాజానికి బాధ్యత వహించడం, మెరుగైన సమాజం నిర్మాణానికి కృషి చేయడం లక్ష్యం కావాలి. క్షీణిస్తున్న పర్యావరణం, మారుతున్న వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని మన రాష్ట్ర, దేశ రైతాంగానికి ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు సేవలు అందించాలి.

– పూర్వ విద్యార్థులు

అందుకో దండాలు అంబేడ్కరా!

'ట్రైనాట్ టు స్పిట్ ఆన్ సె[illegible]అంటూ ఈ రోజు ఉదయం మా ఇంటి ముందు ఒక పదేళ్ల అమ్మాయి, అబ్బాయి ఒకరి తరువాత ఒకరు బిగ్గరగా ఉచ్చరిస్తూ కనిపించారు. పిల్లలకు దాని అర్థం తెలుసో తెలియదో.. కానీ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను దేశ ప్రజలు పదే పదే ప్రస్తావిస్తూ, ఆయన రచనలు, ఆలోచనలు, ఉద్యమాలు, ఆచరణ గురించి కొన్ని సంవత్సరాలుగా ఎక్కువగా మాట్లాడుతున్నారు. బాబాసాహెబ్ అంతరాల నిచ్చెనమెట్ల వ్యవస్థ దౌర్జన్యాలపై అవిశ్రాంత పోరాటం చేసిన యోధ. కరుణ! ప్రజ్ఞ! సమతలను సమాజం అవలంబించాలన్న నవ బౌద్ధుడు. బాబాసాహెబ్ అనుభవించిన అంటరానితనం, వివక్ష, తిరస్కారం, సంఘజీవన బహిష్కారం వందేళ్ల నుంచీ మారలేదు. వివిధ రూపాల్లో కరుడుగట్టుకుపోయింది. పాలనా రంగం మతం ఊబిలో దిగబడి క్రూరంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చి తమ ధర్మం, మతం అంటూ దేశ ప్రజలను ఒత్తిడికీ, అలజడికీ గురిచేస్తున్నది. ఓట్ల కోసమైతే సమతా రాగం.. ఏరు దాటిన తరవాత వికృతమైన పరిహాసాలతో ప్రజలను పదే పదే అవమానించడం. ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత జన సమూహాలు ఇస్తున్నాయో ఆ వ్యక్తులపై అసూయతో పాలకులు రగిలిపోతున్నారు. లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తితో నడవలసిన రాజకీయ జనజీవన స్రవంతిని సమూలంగా కలుషితం చేసి, దారి మళ్ళించాలని కుట్రలు పన్నుతున్నారు.

అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రచించిన మేధావి, అధ్యయనశీలి, ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రచయిత బాబాసాహెబ్ అంబేడ్కర్. ఆయన పట్లా అక్కసేనా? అంత వెరుపా? దేశ ప్రజల మనోభావాలు ఎంతగా దెబ్బతింటున్నాయో పట్టించుకోరా.. నీచమైన మీ వికారాలు ఎంత రోత పుట్టిస్తాయో పట్టించుకోరా? అధికార బలం ఉందికదా అని తప్పుడు మాటలు మాట్లాడినా, ఆకాశాన్ని చూసి అంత ఎత్తా అని పైకి రాయి విసిరినా, ఏం జరుగుతుందో వివేకంతో ఆలోచించండి! మహాత్మా పూలేను తన గురువుగా భావించిన భారతరత్నపై మీ లోపల ఏ భావాలు ఉన్న నోరు పారేసుకుంటూ కన్నెత్తి చూసే దుస్సాహసానికి పూనుకొని మీ తలకు మీరే కొరివి పెట్టుకోకండి.

అందుకో దండాలు బాబాసాహెబ్ అంబేడ్కరా!

– అనిశెట్టి రజిత

కులగణన జరగాలి, వివరాలు తెలియాలి!

మాజీ డీజీపీ అరవిందరావు ఆంధ్రజ్యోతిలో కులగణనను వ్యతిరేకిస్తూ ఒక వ్యాసం రాశారు ('ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?' నవంబర్ 23, 2024). కులగణన చేయడం భారతీయ సమాజాన్ని విడగొట్టే కుట్రగా ఆయన అభివర్ణించారు. ఇది బ్రిటిష్ పాలకులు భారతీయ సమాజాన్ని విభజించటానికి వాడిన ఎజెండా లాంటిదని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కులగణన జరిగితే సమాజంలో అల్లకల్లోలం ఏర్పడుతుందని అక్కసు వెళ్లగక్కారు. తన వాదనను సమర్థించుకోవడానికి అబద్ధాలు వల్లె వేశారు.

అరవిందరావు వర్ణవ్యవస్థ అనాదిగా ఉందని, అదేమీ భారతదేశ ప్రత్యేకత కాదని, ఇలాంటి వ్యవస్థలు ప్రపంచమంతా ఉన్నాయనీ అన్నారు. ఆయన చెప్పింది పాక్షిక సత్యమే. బ్రిటీషువారు వచ్చాకే భారత దేశంలో వర్ణవ్యవస్థ ఉనికిలోకి వచ్చిందనడం, బ్రిటిష్ వారు రాకముందు అస్పృశ్యత లేదనడం, చరిత్రను వక్రీకరించడమే.

బ్రిటీషు వారికి నల్ల జాతీయులంటే చులకన భావన ఉండొచ్చు. దేశ సంపద కొల్లగొట్టి ఉండొచ్చు, ఉద్యమాలను అణిచివేసి ఉండొచ్చు; కాని వారు తమ అవసరార్థం ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే సంస్కరణలు అనేకం చేశారన్నదీ వాస్తవమే. వేల ఏండ్లుగా సాగుతున్న బ్రాహ్మణిజాన్ని, దాని ఆధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా మూఢాచారాలను నిషేధించారు. 'సతీసహగమనం' రద్దు చేశారు. వర్ణాశ్రమ ధర్మానికి భిన్నంగా విద్యను ప్రజలందరికీ అందించే ప్రయత్నం చేశారు. విద్య అంటే మత గ్రంథాలు, పురాణాలు వల్లె వేయడం కాదని; లోకజ్ఞానాన్ని పెంచే లెక్కలు, సైన్సు, చరిత్ర, భూగోళం, సామాజిక శాస్త్రం వంటి వాటిని బోధనాంశాలుగా చేశారు. ఫలితంగానే పూలే, పెరియార్, అంబేడ్కర్ లాంటి మహనీయులు నాటి భారతీయ సమాజం నుంచి అంకురించిన విషయం అరవిందరావుకు తెలియనట్లు ఉంది.

కులవ్యవస్థ ఇస్లాం వచ్చాకో, క్రైస్తవం వచ్చాకో ప్రారంభమయినట్లు చెప్పడం మోసకారితనం. ఈ విషయంపై స్వామి వివేకానంద ఏమి చెప్పారో వినండి: "అస్పృశ్యులు అనబడే ప్రజలను ఈనాటి అధ్వాన్న స్థితికి దిగజార్చింది ఎవరు? ఎవరు దీనికి బాధ్యులు? దీనికి ఆంగ్లేయులు మాత్రం కారణం కాదు. అనేక పారమార్థిక, వ్యవహారిక సిద్ధాంతాలను కనిపెట్టిన హిందూమతంలోని కుటిలులే ఇందుకు కారణం". రామకృష్ణ మఠం ప్రచురించిన 'స్వామి వివేకానంద' పుస్తకంలోని 16వ పేజీలో ఈ విషయం స్పష్టంగా ఉంది.

వర్ణవ్యవస్థగా చెప్పబడేది కేవలం సమాజ అవసరాల కోసం, సౌలభ్యం కోసం ఏర్పడ్డ వృత్తుల విభజన మాత్రమేననీ; ఆ వృత్తులు వంశ పారంపర్యం కాదనీ; అక్కడ ఉచ్చం నీచం అంటరానితనం అంటూ తారతమ్యాలు లేవనీ; ఒక వృత్తి నుండి మరే వృత్తికైనా మారే స్వేచ్ఛ వుండేదనీ; ఎలాంటి వివక్షలు లేవనీ అరవిందరావు వాదన. ఆయన నిజంగానే ఆ వాదనను నమ్మేవారయితే మనుస్మృతినీ; రామాయణ మహాభారతాల్లో వర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉన్న అంశాలను విమర్శించేవారు. మన సమాజంలోని వర్ణకుల వ్యవస్థకూ గ్రీస్ ఇంకా మరికొన్ని ప్రాచీన నాగరిక దేశాలకు చెందిన బానిస వ్యవస్థలకూ మౌలిక తేడాలున్నవి. ప్రధాన తేడా ఏమిటంటే అక్కడ దోపిడీ బానిసల పేరిట జరిగేది. ఇక్కడ వర్ణం, కులం ముసుగులో దోపిడీ జరిగింది. ఈ వ్యవస్థలను నిలబెట్టడానికి, దీర్ఘకాలిక ప్రయోజనాలను బలపర్చుకోవడానికి ఒక సైద్ధాంతిక, తాత్విక మత చట్రం నిర్మితమైంది. బయటి ప్రపంచ దేశాలలో కుల వివక్ష, అంటరానితనం, మైల సిద్ధాంతం వగైరాల్లేవు. అవి ఆర్థిక అవసరాల కొరకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నిర్బంధ చట్టాలు మాత్రమే.

దేవుడి నోటి నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని హిందువులు పవిత్రంగా భావించే గ్రంథాలన్నీ చెపుతాయి. శూద్రుల పట్ల వివక్ష పాటించాలని, దళితులను అంటరాని వారిగా చూడాలని, మహిళలను అణిచిపెట్టాలని చెపుతాయి. ఇతర వ్యవస్థలలో ఇది మనకు కనపడదు. కాని అరవిందరావు రెంటినీ ఒకే గాట కట్టి మాటల మాయ చేస్తున్నారు. యూరప్‌లో కూడా కులవ్యవస్థ ఉన్నట్లు, అది పారిశ్రామిక విప్లవం ద్వారా అంతమైనట్లు ఆధారం లేని వాదనలు చేస్తున్నారు.


కులగణన ద్వారా ప్రస్తుత ఆధిపత్య వర్ణాలకు ప్రయోజనకారిగా ఉన్న వర్ణ, కుల వ్యవస్థలు నిర్వీర్యమవుతాయన్నది అరవిందరావు ఆందోళన. ప్రస్తుత నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియులకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. చదువు, సంపదలు కింది కులాలకు నిషేధించి తాము సమాజంపై పెత్తనం చేస్తూ సుఖ సౌఖ్యాలు అనుభవించారు, ఇప్పటికీ అనుభవిస్తున్నారు. వారు ఈ సౌకర్యాలు కొనసాగాలనుకోవడం సహజం. మన సమాజంలో కులం కొందరికి వరమైతే, కోట్లాను కోట్ల మందికి అది శాపం! సంపన్నులంతా దాదాపు అగ్రకులాల నుండే ఉన్నారు. పేదలంతా దాదాపు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల నుండే ఉన్నారు. కులం ప్రభావితం చేయని రంగమంటూ లేదు. ఒక ఉదాహరణ చూస్తే ఇదెంత వాస్తవమో గమనించవచ్చు. ఈ సంవత్సరం విడుదలైన ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం— భారతదేశంలోని వందమంది కోటీశ్వరులలో 88శాతం అగ్రకులస్థులే. జనాభాలో 15శాతం కూడా లేని అగ్రకులాలకు చెందినవారే సంపన్నుల్లో 88శాతం ఉన్నారు. మిగతా కులాలన్నింటి నుండి ఉన్న సంపన్నులు కేవలం 12శాతం మాత్రమే.

గత మూడు, నాలుగు తరాల నుండే బహుజన కులాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారు చదువుకొని విజ్ఞానవంతులవుతున్నారు. ఆర్థికంగా మధ్య తరగతి వర్గాలలోకి చేరగలుగుతున్నారు. చైతన్యవంతులు కాగలుగుతున్నారు. తరతరాలుగా తమ పూర్వీకులకు జరిగిన అన్యాయాలను గుర్తిస్తున్నారు. ఇప్పటికీ తాము అన్ని రంగాల్లో వెనుకబడిన విషయాన్ని గమనించగలుగుతున్నారు. జనాభాలో తాము ఎంత శాతం ఉన్నామో అంత మేరకు అన్ని రంగాలలో వాటా కావాలంటున్నారు. అనేక రూపాల్లో ఆ ఉద్యమాలు సాగుతున్నాయి. కులగణన జరిగితే వాస్తవాలు బయటికొస్తాయి.

సామాజిక న్యాయం కావాలని, కులగణన జరగాలని జరుగుతున్న ఉద్యమాలు అరవిందరావు లాంటి వారిని కలవరపెడుతున్నాయి. కాబట్టే అబద్ధాలను అక్షరీకరిస్తున్నారు. ఎవరూ కోరకున్నా పాలకులే ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేపడుతున్నారని ఆక్రోశిస్తున్నారు. ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల అందరూ సంతృప్తికరంగా ఉన్నారని అవాస్తవాలు చెపుతున్నారు. ఎంత చదివినా, ఎంత పెద్ద పదవులు నిర్వహించినా తాము పుట్టిన సామాజిక, ఆర్థిక పునాదులు వదులుకోవడం ఎంతో కష్టమని అరవిందరావు గారి వ్యాసం చూశాక అర్థమవుతుంది.

వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లను కొనసాగించవద్దని, తీసివేయాలని అగ్రకుల సంపన్న వర్గాలవారు ఎప్పటి నుండో తమకున్న ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కులగణనను ఆపడం ద్వారా ఆయా కులాలవారీ వివరాలు, వారి పరిస్థితీ తెలియకుండా చేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తించాలి. ఈ కుట్రలను తిప్పికొట్టి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి.

సామాజిక న్యాయం కావాలని, కులగణన జరగాలని జరుగుతున్న ఉద్యమాలు అరవిందరావు లాంటి వారిని కలవరపెడుతున్నాయి. కాబట్టే అబద్ధాలను అక్షరీకరిస్తున్నారు. కులగణనను ఆపడం ద్వారా ఆయా కులాలవారీ వివరాలు, వారి పరిస్థితీ తెలియకుండా చేయాలని అగ్రకుల సంపన్న వర్గాలవారు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తించాలి.



• జి. రాములు
గౌరవాధ్యక్షులు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

అంబేడ్కర్‌పై 21 వారాల ప్రసంగాలు

సామాజిక చలనాలను గుర్తించడం, వాటిని అవగాహనలోకి తెచ్చుకోవడం, సమాజ సాహిత్యాల పరస్పర ప్రమేయాలను విశ్లేషించుకోవడం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ఆచరణలో ముఖ్యమైన అంశం. గత పదహారేళ్లుగా వివిధ మార్గాలలో ఆ పని జరిగింది. ఇప్పుడు అంబేడ్కర్ ఆలోచనల అధ్యయనం కోసం ప్రరవే సంకల్పించింది. అంబేడ్కర్ ఆలోచనల ప్రతిఫలంగా మనకి మిగిలిన వేల పేజీల రచనలు, వందల గంటల ఉపన్యాసాల నుంచి, వర్తమాన ప్రాసంగికతను కూడా దృష్టిలో పెట్టుకుని, 38 ప్రసంగ అంశాలను రూపొందించాం. ప్రారంభ, ముగింపు సభల్లో నేపథ్య, సారాంశ ప్రసంగాలు పది. ఇలా మొత్తంగా 48 ఉపన్యాసాలను 21 వారాల్లో వినబోతున్నాం. ఆలోచనాపరులు, అధ్యయనశీలురు అయిన 48 మంది వక్తలు అంబేడ్కర్ ఆలోచనల మీద సమగ్ర అవగాహనని కలిగించి, కొత్త చూపుని ప్రసరించడానికి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 22, 2024 నుంచి మే 18, 2025 వరకూ ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచీ మధ్యాహ్నం 1 గంట దాకా అంతర్జాల మాధ్యమం ద్వారా ఈ అంబేడ్కర్ ఉపన్యాసాల సిరీస్ జరగనున్నది. మిత్రులందరినీ ఈ పరంపరలో భాగం కమ్మని కోరుతున్నాము. ఈ ప్రసంగాల సిరీస్‌లో భాగంగా— అంబేడ్కర్ ప్రాసంగికత, అంబేడ్కర్ జీవితం — వ్యక్తిత్వం, ఆచరణశీలి అంబేడ్కర్, జాతీయోద్యమ ఘట్టాల్లో అంబేడ్కర్ ఆలోచనలు, పూనా ఒడంబడిక, రాజ్యాంగం — రాజ్యాంగ సంస్కరణలు- అంబేడ్కర్, అంబేడ్కర్ చిన్న రాష్ట్రాలు, ముస్లిం మైనార్టీల గురించి అంబేడ్కర్... తదితర అంశాలపై ప్రసంగాలు ఉంటాయి.



పరాయివారికే కిరాయి

8లో

జిల్లాలో పెరుగుతున్న యూపీ, ఎంపీ, ఒడిశా, బిహారీ కూలీలు

- చాలా పనుల్లో ఇతర రాష్ట్రాల వారిదే హవా
- ఆంధ్ర కూలీలతో పోలిస్తే అధిక లాభాలు
- పనిగంటలు, వేతనాలు, సెలవుల్లో వ్యత్యాసం

పరాయి వారికే ప్రాధాన్యమంటున్న వ్యాపారులు, బిల్డర్లు

అయ్యో చిరుత

ఉచ్చులో చిక్కిన చిరుత.. ఉలిక్కిపడిన ఉమ్మడి కృష్ణాజిల్లా



- రాజమండ్రిలో తప్పించుకున్న చిరుత మెట్లపల్లిలో ప్రత్యక్షమా...
- ఇప్పటివరకు కొండపల్లి అభయారణ్యంలోనే చిరుతల గుర్తింపు

గన్నవరం మండలం మెట్లపల్లిలోని ఓ మామిడి తోట వద్ద ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని చిరుత మృతిచెందిన ఘటనతో ఉమ్మడి కృష్ణాజిల్లా ఉలిక్కిపడింది. రెండు నెలల కిందట పక్క తోటలో పులి పాదముద్రలు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ పాదముద్రల విషయం ఇప్పటి వరకు బయటకు పొక్కలేదు. కాగా, ఈ చిరుత ఎక్కడి నుంచి వచ్చిందన్నది మిస్టరీగా మారింది. ఈ ఒక్క చిరుతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా? అన్న సందేహాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలో మాత్రమే అదీ.. కొండపల్లి అభయారణ్యంలోనే చిరుతల సంచారం ఉంది. కొండపల్లి అభయారణ్యంలో చిరుతల సంచారం ఉన్నట్టు పదేళ్ల కిందటే అటవీశాఖ అధికారులు గుర్తించారు. పాదముద్రల ఆధారంగా చిరుతలు ఉన్నాయని గ్రహించి వాటి సంరక్షణ కోసం.. నీటి తొట్టిలు వంటివి ఏర్పాటు చేశారు. కొండపల్లి అభయారణ్యం దాటి జనాల్లోకి ఎప్పుడూ చిరుతలు వచ్చింది లేదు. పోనీ కొండపల్లి ఫారెస్ట్ నుంచి వచ్చాయా అనుకోవటానికి కూడా వీల్లేకుండా ఉంది. కాగా, గురువారం మెట్లపల్లి తోటల్లో ఉచ్చులో చిరుత చిక్కడం కలకలం రేపింది. 2015-16లో ఇబ్రహీంపట్నం-నందిగామ మార్గంలో హైవేను ఓ చిరుత దాటిన ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. ఫొటోలు తీయకపోవడం, దాని జాడ తెలియకపోవడంతో కేవలం ప్రచారమై ఉంటుందని అందరూ అనుకున్నారు. కొంతకాలం కిందట జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడులో పాదముద్రలను చూసి పులి అనుకుని భయాందోళనకు గురయ్యారు. ఆ తర్వాత అది పులి పాదముద్రలు కావని, అలుగు పాదముద్రలుగా అధికారులు గుర్తించటంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



మెట్లపల్లికి ఎక్కడి నుంచి వచ్చింది?

మెట్లపల్లిలోని మామిడి తోటల్లోకి చిరుత ఎలా వచ్చింది.. ఎక్కడి నుంచి వచ్చింది.. అనే అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి. గతంలో రాజమండ్రిలో చిరుత కనిపించటం కలకలం సృష్టించింది. అప్పట్లో దానిని గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేసినా.. అటవీశాఖాధికారులకు చిక్కలేదు. అదే చిరుత మెట్లపల్లి వచ్చిందా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల కిందటే పాద ముద్రలు కనిపించాయని స్థానికులు చెబుతున్న నేపథ్యంలో, రాజమండ్రి ప్రాంతం నుంచి వచ్చిన చిరుత మెట్లపల్లి అటవీ ప్రాంతంలోకి చేరిందని భావిస్తున్నారు. మెట్లపల్లి అటవీ ప్రాంతంలో అడవి పందుల సంచారం ఎక్కువ. వీటిని పట్టుకోవటానికి వేటగాళ్లు ఉచ్చులు పన్నుతుంటారు. అలా ఓ మామిడితోట ఫెన్సింగ్ సమీపంలో వేటగాళ్లు ఉచ్చు వేశారు. ఈ ఉచ్చులో చిక్కుకుని చిరుత మృతి చెందింది. ఎప్పుడూ చిరుతల సంచారం గురించి వి నని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు తాజా ఉదంతంతో రాత్రిపూట బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

పోటాపోటీ

- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ప్రయత్నాలు
- సాగర్ ప్రాజెక్టు కమిటీ రేసులో ఇద్దరు
- కృష్ణాడెల్టా కమిటీ రేసులో ముగ్గురు
- ఎన్ఎస్పీ పీఠం కోసం కోట వీరబాబు, ఆళ్ల గోపాలకృష్ణ పట్టు
- కృష్ణాడెల్టా పీఠంపై నిడమానూరి దిలీప్, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, గణేశ్ ఆశలు
- సీఎంను కలిసిన గోపాలకృష్ణ, దిలీప్
- లేఖలు ఇచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- చైర్మన్లు ఎవరో తేలేది రేపు.. ఎన్నిక బాధ్యత ఇన్‌చార్జి మంత్రులకు..

సాగు నీటి సంఘాల ఎన్నికల్లో ఏకపక్ష విజయం సొంతం చేసుకున్న కూటమి నేతలు ప్రస్తుతం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రధానంగా రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ఒకటి నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ కాగా, రెండోది కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ పరిధిలో 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరంతా కలిసి రేపు ప్రాజెక్టు కమిటీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. చైర్మన్ ఎన్నిక బాధ్యతను టీడీపీ అధిష్ఠానం జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించింది. రేసులో ఉన్న అన్ని వర్గాలతో మాట్లాడి ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా చూసేందుకు ఇన్‌చార్జి మంత్రులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కోసం తొలుత నందిగామ నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు ఒక్కరే రేసులో ఉండగా, ప్రస్తుతం సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ కూడా పోటీ పడుతున్నారు. ఎన్ఎస్పీ కమిటీ పరిధిలో మూడొంతుల ఆయకట్టు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటుందని, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఎన్టీఆర్ జిల్లాకు ఇవ్వడమే సముచితమని కోట వీరబాబు వర్గం వాదిస్తోంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా 13 కమిటీలు ఎన్టీఆర్ జిల్లాలో, కృష్ణాలో రెండు, ఏలూరులో రెండు ఉన్నాయి. ఎక్కువ డీసీలు ఉన్న వారికి అవకాశం కల్పించాలన్నది కోట వీరబాబు వర్గం వాదనగా ఉంది. 2015లో ప్రాజెక్టు కమిటీ మిగతా 6లో..

నేనే రాజు.. నేనే కలెక్టర్..



రాజాది రాజ.. రాజ మార్తాండ.. రాజ గంభీర.. బహుపరాక్.. బహుపరాక్.. అని అనుకోకండి ఈ చిత్రాన్ని చూసి.. గురువారం కొండపల్లి ఖిల్లా సందర్శన కోసం వెళ్లిన కలెక్టర్ లక్ష్మీశ అక్కడ ఉన్న రాజావారి బొమ్మ వద్ద ఇలా.. తల పెట్టి కాసేపు సందడి చేశారు.

ఆర్-5 జోన్‌కు గృహయోగం

రాజధానిలో ఆర్-5 జోన్ రద్దు



జక్కంపూడి టిడ్కో ఇళ్ల వద్ద జరుగుతున్న పనులు

లబ్ధిదారులకు విజయవాడ రూరల్ మండలంలో టిడ్కో ఇళ్లు

- ఆ 25 వేల మందికి మంజూరు చేయాలని నిర్ణయం
- 265 ఎకరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు
- విజయవాడ రూరల్, జి.కొండూరు మండలాల్లో అన్వేషణ

రాజధాని అమరావతి ఆర్-5 జోన్‌లో నగరానికి చెందిన పేదలకు గత ప్రభుత్వం కేటాయించిన నివేశనా స్థలాల స్థానంలో టిడ్కో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 25 వేల మంది పేదలకు టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు 265 ఎకరాల భూములను సేకరించాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి అధికారులు విజయవాడ రూరల్ మండలంలో భూ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలాలైన కొత్తూరు తాడేపల్లితో పాటు వెలగలేరులో భూములు సేకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. కొత్తూరు తాడేపల్లిలో రైతులే స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తొలుత పోలవరం కాల్వ దగ్గర భూములను అధికారులు పరిశీలించారు. బుడమేరు వరద ముంపునకు గురైన ప్రాంతం కాబట్టి.. అక్కడ టిడ్కో ఇళ్లు నిర్మిస్తే సమస్యలు వస్తాయన్న వాదనలు వచ్చాయి. అలాగే, పోలవరం అవతల ఎగువ ప్రాంత రైతులు కూడా తాము తక్కువ ధరకే భూములిస్తామని, మెరక కూడా చేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వంపై ఖర్చు తగ్గుతుందని ప్రతిపాదనలు తీసుకొచ్చారు. రైతుల మధ్య నెలకొన్న పోటీ కారణంగా స్థానిక రెవెన్యూ యంత్రాంగం గందరగోళంలో పడింది. పేదల కోసం నిర్మించే టిడ్కో ఇళ్ల వరద ప్రభావిత ప్రాంతంలో కట్టించకూడదని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఇటీవల డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మెరకగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయాలని జిల్లా రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ అంశంపై విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య దృష్టిపెట్టారు. రూరల్ మండల తహసీల్దార్ సుగుణ కూడా అవసరమైన భూముల కోసం రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

గతంలో.. టీడీపీ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడిలో జెట్‌సిటీ నిర్మాణం మొదలైంది. ఇందులో భాగంగా టిడ్కో ఇళ్ల పనులు పనులు చేపట్టారు. దాదాపు 6 వేల ఇళ్ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. జెట్‌సిటీని విస్తరించి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి వీలుగా గతంలో షాబాదలో భూములు సేకరించాలని నిర్ణయించారు. జక్కంపూడి, వేమవరం, షాబాదలో 100 ఎకరాలు సేకరించాలనుకున్నారు. ఎకరాకు రూ.కోటి పరిహారం చొప్పున ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ భూములను తీసుకోలేదు. జక్కంపూడి, షాబాద, వేమవరానికి దగ్గరగా ఉండేలా కొత్తూరు తాడేపల్లిలో వీలైనంత ఎక్కువగా భూములు సేకరించాలని ప్రస్తుతం విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

ప్రధాన మార్గం అవసరం


టిడ్కో ఇళ్లకు చేరుకోవటానికి వీలుగా గ్రాండ్ రోడ్డుగా పోలవరం కట్టరోడ్డును అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నుంచి నున్న వరకు పోలవరం కాల్వకట్ట వెంబడి రోడ్డును అభివృద్ధి చేశారు. అయితే, ఈ రోడ్డు మధ్యలో కల్వర్టులను నిర్మించకపోవటం వల్ల పూర్తిస్థాయిలో వి నియోగంలోకి రాలేదు. కల్వర్టులను ఏర్పాటు చేయటంతో పాటు గన్నవరం నుంచి ఏలూరు జిల్లాకు అనుసంధానం చేస్తే.. టిడ్కో ఇళ్లకు గ్రాండ్ ఎంట్రన్స్ రోడ్డు ఏర్పడుతుంది. ఇదే కనుక చేస్తే జక్కంపూడిలోని జెట్‌సిటీకి, కొత్తూరు తాడేపల్లిలో నిర్మించే టిడ్కో ఇళ్లకు ప్రధాన రోడ్డుగా మారుతుంది. ఇక్కడివారు తాము పనులు చేసుకునే ప్రాంతాలకు సులువుగా వెళ్లేలా రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే నున్న, అంబాపురం, నైనవరం, పాతపాడు, జక్కంపూడి, షాబాద, వేమవరం తదితర అనేక గ్రామాలకు ప్రధాన రాజమార్గం అవుతుంది. పోలవరం కాల్వకట్ట రోడ్డును కూడా దృష్టిలో ఉంచుకుని ఈ కాల్వకు ఎగువన భూములపై దృష్టి సారించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది.



విరమణ వెలుగులు

ఈనెల 21 నుంచి భవానీ దీక్షల విరమణ మహోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి అందంగా ముస్తాబైంది. దుర్గమ్మ ఆలయం, కొండపైన పరిసరాలతో పాటు కనకదుర్గానగర్ ప్రాంతం వి ద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి.

నేడు గంగూరుకు సీఎం



మచిలీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎస్.చంద్రబాబు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.40 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు పెనమలూరు మండలం గంగూరులోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి 11.05 గంటలకు గంగూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బంది, రైతులతో మాట్లాడతారు. అక్కడే ఉన్న వెంకటాద్రి రైస్ వి ల్లును పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.50 గంటలకు మళ్లీ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటారు. 1.40 గంటలకు కంకిపాడు మండలం ఈడుపుగల్లు వెళ్తారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు అక్కడ జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. 3.45 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి గన్నవరం వి మానాశ్రయానికి 3.55 గంటలకు వెళ్తారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు.

బియ్యం కేసులో తప్పుల జల్లెడ

పేర్ని నాని బియ్యం మాయం కేసులో రికార్డుల పరిశీలన

- పూర్తిస్థాయిలో పరిశీలించాకే తదుపరి చర్యలు
- సమాచారం చెప్పేందుకు అధికారుల విముఖత
- పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా



పేర్ని నానికి చెందిన గోడౌన్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి పీడీఎస్ బియ్యం మాయం కేసులో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు దర్యాప్తును కొంతమేర వేగవంతం చేశారు. బుధవారం రాత్రి గోడౌన్, వెయింగ్ వి షన్‌ల రికార్డులను మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రికార్డులన్నీ ఆర్డీవో పర్యవేక్షణలో ఉండగా, గురువారం పౌరసరఫరాలశాఖ జిల్లామేనేజర్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది, పోలీసులు పరిశీలించే పనిని చేపట్టారు. పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఇంకా పూర్తిస్థాయి వివరాలను తమకు అందించలేదని, కావాల్సిన వాటిని అడిగి తీసుకుంటున్నామని ఆర్‌పేట సీఐ ఏసుబాబు తెలిపారు.

2021 నుంచి లెక్కలు తీసే పనిలో అధికారులు

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని భార్య పేర్ని జయసుధ పేరుతో 2021 నుంచి గోడౌన్‌లను పౌరసరఫరాల శాఖ అద్దె ప్రాతిపదికన నడుపుతోంది. గత నెల 26వ తేదీన తనకు చెందిన గోడౌన్‌లో 3,708 బస్తాల పీడీఎస్ బియ్యం తరుగు ఉన్నాయని, ఈ మొత్తానికి ఎంతమేర నగదు చెల్లించాలో సూచిస్తే, అంతమేర నగదును చెల్లిస్తామని జేసీ గీతాంజలిశర్మకు పేర్ని జయసుధ లేఖ రాశారు. ఈ లేఖను ఆధారంగా చేసుకుని అధికారులు గత నెల 28, 29, 30 తేదీల్లో జేసీ ప్రత్యేకంగా నియమించిన పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి నివేదికను అందించారు. మాయమైన బియ్యం మొత్తానికి రెట్టింపుధరను నిర్ణయించి రూ.1,70,56,800 గోడౌన్ యజమాని నుంచి కట్టించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బియ్యం మాయం ఘటనలో పౌరసరఫరాలశాఖ అధికారులు మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఇంత జరిగినా గోడౌన్ తాళాలు, రికార్డులు సకాలంలో ఇవ్వకుండా పేర్ని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లి అధికారులను ముప్పతిప్పలు పెట్టింది.

కరగ్రహారంలో ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లను పక్కనపెట్టి

మచిలీపట్నం మండలం కరగ్రహారంలో ప్రభుత్వానికి చెందిన ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లు అందుబాటులో ఉన్నా, వాటిలో బియ్యం నిల్వ ఉంచకుండా పేర్ని నానికి చెందిన గోడౌన్‌లలోనే అధికారులు గత మూడు సంవత్సరాలుగా అధికంగా బియ్యం నిల్వలు ఉంచారు. పేర్ని నాని భార్య జయసుధ పేరుతో మిగతా 6లో..

అక్రమ క్వారీయింగ్‌కు చెక్

- కొత్తూరు తాడేపల్లిలో రెవెన్యూ మెరుపుదాడి
- 2 ఎక్స్‌కవేటర్లు, 6 టిప్పర్ల స్వాధీనం

6లో



కొండపల్లి ఖిల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

ఖిల్లా చూసొద్దాం రండి..

- పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక వసతులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండపల్లి ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా సాంస్కృతిక, పురావస్తు మ్యూజియం, టూరిజంశాఖల సమన్వయంతో ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొండపల్లి ఖిల్లాను ఆయన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి జి.వాణిమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు తలమానికం అయిన కొండపల్లి ఖిల్లాను అభివృద్ధి చేసి పర్యాటకులను మరింతగా అకట్టుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. ఖిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 2019లో కొండపల్లి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించారన్నారు. కొండపల్లి కోట చరిత్ర సజీవంగా నిలిపే విధంగా మరమ్మతులు చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఖిల్లా ప్రదర్శనలో ఉన్న ఫోటోలను యాప్ ద్వారా అండ్రాయిడ్ ఫోన్‌లో స్కాన్ చేసి దాని విశిష్టతను తెలుసుకునేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఏపీ ప్రభుత్వం 2047 విజన్ డాక్యుమెంట్‌లో పర్యాటకరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతీరోజు ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణిమోహన్ మాట్లాడుతూ, 10 శతాబ్ది కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు అనేకమంది రాజులు కొండపల్లి కోట నుంచి పరిపాలన సాగించారన్నారు. 2019లో కొండపల్లి కోట అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో టూరిజంశాఖ రీజనల్ జేడీ వైవీ ప్రసన్నలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, సహాయ టూరిజం అధికారి డి.గోపాల్, పురావస్తుశాఖ ఉపసంచాలకులు ఓ.రామసుబ్బారెడ్డి, పి.సురేష్, స్వామినాయక్, నరసింహనాయుడు, ఎస్.వెంకట్రావ్, డీపీఎం చైతన్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవానీలకు మెరుగైన సౌకర్యాలు

- 21 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేత
- అన్ని క్యూలలో భక్తులకు ఉచిత దర్శనం
- దీక్షల విరమణ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణల సందర్భంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మహామండపంలో గురువారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా సమా



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

వేశం నిర్వహించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఈఈలు, దేవస్థాన స్థానాచార్యులు, ముఖ్య అర్చకులు, ఏఈవోలు, డీఈలు, ఇంజనీరింగ్, ఐటీ విభాగం, సెక్యూరిటీ, శానిటేషన్ తదితర విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, బుధవారం కలెక్టరేట్‌లో అధికారుల సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. క్యూలు, షెడ్లు, విద్యుదీకరణ, మైక్, సౌండ్ సిస్టమ్, ఇరుముడి విరమణ పాయింట్లు, నగరం వెలుపల భక్తులు వేచి ఉండే పాయింట్లు, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం, హోమ గుండాల నిర్వహణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. 21 ఉదయం 6.30 గంటల నుంచి అమ్మవారి దర్శనం లభిస్తుందని, 22 నుంచి 25వ తేదీ వరకు వేకువజామున 3 నుంచి తిరిగి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం ఉంటుందని తెలిపారు. అన్ని క్యూలలో భక్తులు ఉచిత దర్శనం చేసుకోవచ్చునని, అంతరాలయ ప్రవేశం లేదని, టిక్కెట్టు కౌంటర్లు ఉండవని



భవానీ దీక్షల విమరణ సందర్భంగా చురుగ్గా ఏర్పాట్లు



దీక్షల విమరణ కోసం హోమగుండం ఏర్పాటు

తెలిపారు. అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు తెలిపారు. కనకదుర్గానగర్‌లోని ప్రసాదం కౌంటర్లతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై మూడు షిఫ్టుల్లో ప్రసాదం కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు. సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, శానిటేషన్, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ కీలకమని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ చేసే భవానీల సౌకర్యం నిమిత్తం కొండచుట్టూ టెంట్లు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, వాటర్ ప్యాకెట్ల పంపిణీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. క్యూలైన్లలో మజ్జిగ, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణి చేయనున్నట్టు తెలిపారు. సీతమ్మవారి పాదాల ఘాట్‌లో 500 షవర్లు, భవానీ ఘాట్‌లో 100 షవర్లు, పున్నమీఘాట్‌లో 100 షవర్లు ఏర్పాటు చేశారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో అన్ని శాఖల అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తారని వివరించారు.

భవానీలు, భక్తులకు ఉచిత అన్నప్రసాదం

ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానానికి వచ్చే భవానీలు, భక్తులకు ఉచిత అన్న ప్రసాదం అందజేయనున్నట్టు ఈవో రామారావు తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు పులిహోర, పొంగలి ప్రసాదం పంపిణీ, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అన్నవితరణ కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం నుంచి రాత్రి వరకు పులిహోర, ప్రసాదం పంపిణీ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. సుమారు 25 లక్షల లడ్డూలు తయారీకి ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు.



దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చనలు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దక్షిణామూర్తికి గురువారం సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అర్చనలు, షోడశోపచార పూజలను నిర్వహించి, మంత్రపుష్పం, హారతులు ఇచ్చారు.



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దాతల విరాళాలు..

విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన దాతలు యర్రం హరీష్ గురువారం అన్నవితరణ నిమిత్తం డిప్యూటీ ఈవో రత్నరాజుకు రూ.1,00,000లు చెక్కు రూపంలో అందజేశారు. యర్రం తిరుమలరావు రూ.1,00,000లు ఆలయ స్వర్ణ తాపడం పనుల నిమిత్తం చెక్కు రూపంలో అందజేశారు. విజయవాడ వెటర్నరీ కాలనీకి చెందిన దాత బి.జానకి కుటుంబసభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుకుని అన్న వితరణ నిమిత్తం రూ.1,01,116 చెక్కును బి.పాపయ్య రెడ్డి పేరిట అందజేశారు.

ఏర్పాట్ల పరిశీలన

భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను గురువారం డిప్యూటీ ఈవో రత్నరాజు పరిశీలించారు. కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం క్యూలను పరిశీలించారు. భవానీ దీక్షలు 2024 యాప్‌ను భక్తులు వినియోగించుకోవాలని కోరారు.



హైకోర్టు న్యాయమూర్తి ఎన్.హరినాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి డిప్యూటీ ఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

పోటాపోటీ

(5వ పేజీ తరువాయి)

చైర్మన్‌గా ఎగువప్రాంతానికి చెందినవారికి అవకాశం ఇచ్చారని, ఈసారి దిగువప్రాంతంలో ఉన్న తమకు అవకాశం ఇవ్వాలని ఆళ్ల గోపాలకృష్ణ వర్గం కోరుతోంది. 2015లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన యనమద్ది పుల్లయ్య చౌదరికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. అప్పట్లో చైర్మన్ రేసులో ఉన్న గోపాలకృష్ణ అధిష్ఠానం ఆదేశాల మేరకు తప్పుకొని వైస్‌చైర్మన్ పదవితో సరిపెట్టుకున్నారు. ఈసారైనా తనకు చైర్మన్ అవకాశం కల్పించాలని కోరుతూ గోపాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబును కలిశారు. కోట వీరబాబు మంగళవారమే చంద్రబాబును కలిసి తన పేరును పరిశీలించాల్సిందిగా కోరారు.

తూర్పు కృష్ణాలో ముగ్గురి మధ్య పోటీ

తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీకి మరింత ఎక్కువగా పోటీ నెలకొంది. గుడివాడ నియోజకవర్గం నుంచి మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పామర్రు నియోజకవర్గం నుంచి వల్లూరుపల్లి గణేశ్, అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నిడమానూరి దిలీప్ కుమార్ రేసులో ఉన్నారు.

- చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన దిలీప్ సీనియర్ టీడీపీ నేత. పార్టీ అధిష్ఠానం ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ పార్టీకి విధేయుడిగా పేరుపొందారు. గతంలో చల్లపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యే సమయంలో పార్టీ అధిష్ఠానం వేరొకరి పేరును సూచించడంతో దాన్ని వదులుకున్నారు. 2015లో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఈయనకు అవకాశం కల్పిస్తామని టీడీపీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. తొలుత గుడివాడకు చెందిన గుత్తా చంటికి రెండున్నర సంవత్సరాలు ఆ తర్వాత దిలీప్‌కు రెండున్నర సంవత్సరాలు అవకాశం కల్పిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ గుత్తా చంటి పూర్తికాలం చైర్మన్‌గా కొనసాగారు. అయినా దిలీప్ అవనిగడ్డ నియోజకవర్గంలో టీడీపీ పటిష్ఠానికి పనిచేస్తూ వచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే పదవి జనసేనకు కేటాయించడంతోపాటు ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులకు ఎలాంటి నామినేటెడ్ పదవులూ కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ పదవిని తనకు ఇవ్వాలని దిలీప్ పార్టీపెద్దలకు విజ్ఞప్తి చేసుకుంటున్నారు. గురువారం ఆయన సీఎం చంద్రబాబు, కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు.

-వల్లూరుపల్లి గణేశ్ జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2014లో పామర్రు మార్కెట్ యార్డు చైర్మన్‌గా పనిచేశారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆశీస్సులతో ఈయన ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు.

-గుడివాడ నియోజకవర్గం నుంచి రేసులో ఉన్న మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంకు గుడివాడ ఎమ్మెల్యే రాము ఆశీస్సులు ఉన్నాయి. గుడ్లవల్లేరు మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం ఎన్నికల ముందు వరకు టీడీపీలో అంత చురుగ్గా లేరు. ఈ కారణంగా ఈయన అభ్యర్థిత్వంపై పార్టీ సీనియర్లలో అంత సానుకూలత లేదు. కొసమెరుపు ఏమిటంటే.. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రేసులో ఉన్న వారంతా తమ తమ పరిధిలో ఉన్న ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి మద్దతు తెలపాలని కోరడమే తరువాయి అడిగిన వారందరికీ వారి పేరును సిఫారసు చేస్తూ ఎంపీలు, ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడం గమనార్హం.

వైస్ చైర్మన్ పీఠం కోసం జనసేన

కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ పీఠం కోసం జనసేన పార్టీ పోటీ పడుతోంది. కూటమిలో భాగస్వాములుగా ఉన్నందున వైస్ చైర్మన్ పీఠం తమకు ఇవ్వాలని జనసేన నాయకులు కోరుతున్నారు. పెడన నియోజకవర్గం నుంచి కమలాపురం డీసీ చైర్మన్‌గా ఎన్నికైన నలమోతు చంద్రమోహన్‌రావుకు ఇవ్వాలని జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆత్మీయత, మానవత్వం చూపండి

- వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల స్నేహశీల జిల్లా లక్ష్యంగా పనిచేయాలి
- సామాజిక భద్రతకు భరోసా కల్పించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల స్నేహశీల జిల్లాగా గుర్తింపు తీసుకొచ్చేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని, వారి సంక్షేమానికి సంబంధించిన చట్టాల అమల్లో ఆత్మీయత వెల్లివిరియాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించి జిల్లాస్థాయి కమిటీల సమావేశాలు జరిగాయి. గత నిర్ణయాల అమలును సమీక్షించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపయోగపడేలా ర్యాంపుల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ ఆఫీసర్ (జీఆర్ఓ)లను నియమించుకోవాలని స్పష్టం చేశారు.

వయోవృద్ధులకు చేయి అందించాలి

వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు మానవతతో చేయి అందించాలని కలెక్టర్ సూచించారు. వారి ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమాజంలో వృద్ధులు గౌరవప్రదంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందని కలెక్టర్ స్పష్టం చేశారు.



కలెక్టర్ సమక్షంలో అవగాహన కార్యక్రమం

కిశోరి వికాసం ద్వారా ఉజ్వల భవిత

కృష్ణలంక : కిశోరి వికాసం ద్వారా బాలికలకు ఉజ్వల భవిష్యత్తు అందించడంలో సమష్టి కృషి అవసరమని విద్య, మానసిక ఆరోగ్యం, ఋతు పరిశుభ్రత, పోషకాహారం, అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, యోగ, జీవనోపాధి వంటి అంశాలపై బాలికలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, మహిళా శిశు సంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థినులతో కిశోరి వికాసం కార్యక్రమ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోరి వికాసం ఒక మంచి అవకాశమన్నారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం కార్యక్రమ లక్ష్యమన్నారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి వున్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం వుండాలన్నారు. మహిళా శిశు సంక్షేమ జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి, మార్పు ట్రస్ట్ డైరక్టర్ ఆర్.సూయజ్, ప్రముఖ సైకాలజిస్ట్ శివజ్యోతి, చేయూత సంస్థ ప్రతినిధి టి.కృష్ణకుమారి, లక్ష్మీ సామ్రాజ్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం

కృష్ణలంక : 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాల సాధన దిశగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు ప్రాధాన్యమివ్వాలని, పారిశ్రామిక సత్వర అనుమతుల జారీకి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ ఏడాది జూలై 26 నుంచి డిసెంబరు 19 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 151 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటికే 133 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

ఎంఎస్ఎంఈ రంగానికి అందించే ప్రోత్సాహకాలపై గత ఆగస్టు 22న స్క్రూటినీ కమిటీ సమావేశం 48 క్లెయిమ్‌లకు రూ.2.21 కోట్లు, డిసెంబరు 18న జరిగిన స్క్రూటినీ కమిటీ సమావేశం 31 క్లెయిమ్‌లకు రూ.3.82 కోట్లు మేర ప్రతిపాదనలు పంపగా, వీటిపై తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది.

జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలు విజయవంతం చేద్దాం

- శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్ : నరసరావుపేటలో కె.రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే 18వ జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు విజయవంతం కావాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. రాష్ట్ర ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ సీఈవో జోసెఫ్, ఆత్యాపాత్యా సీఈవో రంభాప్రసాద్, ముత్యంల ఆధ్వర్యంలో పోటీల పోస్టర్లను శాప్ చైర్మన్ తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు.

జాతీయ వాలీబాల్‌కు బాలికల జట్టు

విజయవాడ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్రం కొసిగి నారాయణపేటలో ఈ నెల 22నుంచి జరిగే 68వ స్కూల్ గేమ్స్ జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ అండర్-19 బాలికల టీమ్ గురువారం పయనమైంది. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ఏపీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.భానుమూర్తిరాజు, ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి వి.రవికాంతలు అభినందించారు.

నాయీబ్రాహ్మణ సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడిగా కొలిపాక

పెనుగంచిప్రోలు : రాష్ట్ర దేవదాయ ఆలయాల నాయీ బ్రాహ్మణ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ గౌరవాధ్యక్షుడిగా పెనుగంచిప్రోలుకు చెందిన బీసీ సెల్ నేత టీడీపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు కొలిపాక బ్రహ్మంను విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అక్రమ క్వారీయింగ్‌కు చెక్

- కొత్తూరు తాడేపల్లిలో రెవెన్యూ మెరుపుదాడి
- 2 ఎక్స్‌కవేటర్లు, 6 టిప్పర్ల స్వాధీనం
- స్థానికుల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

విజయవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్ 34లో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌పై గురువారం మెరుపుదాడి జరిగింది. ఒక్కసారిగా దాడిచేసిన రెవెన్యూ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని టూ టౌన్ అవుట్‌పోస్టుకు తరలించారు. తెల్ల చట్టును గుట్టుచప్పుడు కాకుండా తరలించటాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన లైజనింగ్ మేనేజర్ ఒకరు సూత్రధారిగా రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.



కొత్తూరు తాడేపల్లిలో అక్రమ క్వారీయింగ్

అనుమతులు లేకున్నా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ క్వారీయింగ్ వ్యవహారాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అప్పటి వరకు తవ్వకాలకు అనుమతి లేదు. కానీ, పశ్చిమ బైపాస్ బ్యాలెన్స్ పనుల నిమిత్తం గ్రావెల్ కోసం జిల్లా యంత్రాంగం నుంచి అనుమతులు తెచ్చుకున్న లైజనింగ్ మేనేజర్ ఈ తరహా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసి తాము ప్రశ్నిస్తే కలెక్టర్ అనుమతి ఉందని మభ్యపెడుతున్నారని, కాగితాలు మాత్రం చూపట్లేదని పేర్కొన్నారు. అనుమతులపై అటు మైనింగ్, ఇటు రెవెన్యూ అధికారులను సంప్రదించినా సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు దాడులుచేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది జరిగి నాలుగు రోజులు కూడా కాకముందే అదే నిర్వాహకులు కొత్తూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 34లోని తెల్లచట్టు తవ్వకాలకు పూనుకున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే.. దౌర్జన్యంగా మాట్లాడటంతో రెవెన్యూ అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం దాడులు జరిగాయి.

మౌలిక వసతుల కల్పనకు 878 గిరిజన గ్రామాల ఎంపిక

- పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనకు 'ధరితి ఆబాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్' కింద ఏపీలో 878 గ్రామాలు ఎంపిక చేసినట్టు కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే వెల్లడించారు. పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన మేరకు మంత్రి సమాధానం ఇచ్చారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్య, అంగన్వాడీ సౌకర్యాలు, జీవనోపాధి అవకాశాలను మెరుగు పరచటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించినట్టు తెలిపారు. దేశంలో 63,843 గ్రామాల్లో ఈ పథకం అమలవుతోందని, ఏపీలో 878 గ్రామాలు ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో 17 గ్రామాలు మాత్రమే ఎంపికైనట్టు మంత్రి వివరించారు. 500మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలు, కనీసం 50శాతం గిరిజన జనాభా ఉంటే ఈ పథకం కింద ఎంపిక చేస్తామని చెప్పారు. ఏపీలో ఈ పథకం కింద 25 రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. పీఎం అవాస్ యోజన పథకం కింద 20 లక్షల పక్కా ఇళ్లు, గ్రామీణ సడక్ యోజన ద్వారా 25 వేల కిలోమీటర్ల మేరకు కనెక్టింగ్ రోడ్లు జల జీవన్‌మిషన్‌ద్వారా ప్రతి అర్హతగల గ్రామానికి మంచినీటి సరఫరా, విద్యుత్ లేని కుటుంబానికి కనెక్షన్ ఇవ్వటం వంటివి ఇందులో ఉన్నాయన్నారు.

ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రికి ఎంపీ శివనాథ్ వినతి

వన్‌టౌన్ : విజయవాడలో ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయ మంత్రి జయంతి చౌదరికి గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ వినతిపత్రం అందజేశారు. విజయవాడలో 'ప్రధాన మంత్రి కేవీవై' పథకం కింద అధునాతన ఆటోమొబైల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. విజయవాడలో ఆటోమొబైల్ రంగం అసంఘటిత కార్మికులుగా సుమారు లక్షమంది పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయించి శిక్షణ ఇప్పించాలన్నారు. మంత్రి స్పందించి నాలుగురోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు

- సామినేని ఉదయభాను

పటమట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లాలో వేగంగా బలపడుతుంటే కొంతమంది ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మండిపడ్డారు. గురువారం విజయవాడ జనసేన క్యాంపుకార్యాలయంలో అంబాపురానికి చెందిన పలువురు వైసీపీ నేతలు ఉదయభాను సమక్షంలో జనసేనలో చేరారు. తప్పుడు ప్రచారాలను జనం పట్టించుకునే పరిస్థితి లేదని గమనించి కొన్ని పేపర్ల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులను కూడా కావాలని వారి ఆరోపణలకు బలి చేయాలని చూడటం దారుణమన్నారు. ఇటువంటి స్వార్థ ఆలోచనలను వీడకపోతే భవిష్యత్తులో వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

తప్పుల జల్లెడ

(5వ పేజీ తరువాయి)

ఉన్న గోడౌన్‌లలో 2021 నుంచి పెద్దమొత్తంలో బియ్యం నిల్వలు ఉంచి, అక్కడి నుంచి జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించారు. ఇక్కడి గోడౌన్‌లలోని ఒక్కోబ్యాగులో 50.300 కేజీల చొప్పున బియ్యం ఉండాలి. కానీ ఒక్కోబ్యాగులో 47, 48 కిలోల బియ్యం మాత్రమే ఉండటం, తదితర కారణాలతో బియ్యం మాయం లెక్కలపై తుది నిర్ణయానికి అధికారులు రాలేకపోతున్నారనే వాదన ఉంది. గతంలో పేర్ని నాని మంత్రిగా ఉండటంతో ఈ గోడౌన్‌లలో ఏం జరుగుతుందో తనిఖీ చేసేందుకు అధికారులు సాహసించలేదు. పీడీఎస్ బియ్యం ఇటీవల కాలంలోనే మాయమయ్యాయా, లేక గోడౌన్లు అద్దెకు తీసుకున్న నాటినుంచి మయామవుతూ వచ్చాయా, అనే అంశంపై లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు పేర్ని నాని గోడౌన్‌లకు సంబంధించిన రికార్డులను, వెయింగ్‌మిషన్ వద్ద కంప్యూటర్‌లను స్వాధీనం చేసుకుని లెక్కలుచూసే పనిలో ఉన్నారు. ఈ పని పూర్తయితే, ఈ గోడౌన్‌ల నుంచి ఎంతమేర బియ్యం మాయమయ్యాయనే అంశంపై తుది నివేదిక వచ్చే అవకాశం ఉందని, అప్పటివరకు తాము ఎలాంటి సమాచారం ఇవ్వలేమని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది ఎవరికి వారు రికార్డుల తనిఖీ ప్రక్రియను తాము చేయడం లేదని చెప్పడం గమనార్హం. పౌరసరఫరాలశాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేసే సిబ్బంది ఈ పనిలో ఉన్నారని కొందరు సిబ్బంది చెబుతుండగా... క్వాలిటీకంట్రోల్ విభాగం సిబ్బంది వద్దకు వెళ్లి వివరాలు కావాలని అడిగితే, ఈపని మేము చేయడలేదని, పొట్లపాలెం గోడౌన్‌లోని బియ్యంను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించే పనిని చేశామని, అప్పటితో మా పనిపూర్తయిందని చెప్పి తప్పించుకుంటున్నారు. పేర్ని నాని గోడౌన్‌లలో వెయింగ్ మిషన్‌లో లోపం ఉందనే కొత్త వాదనను పేర్ని తరపు న్యాయవాదులు తెరపైకి తెచ్చారు. వెయింగ్ విఎషన్ ఎప్పటినుంచి సక్రమంగా పనిచేయడం లేదనే అంశంపైనా అధికారులు రికార్డులను బట్టి పరిశీలిస్తామని మాత్రం చెబుతున్నారు. పౌరసరఫరాలు, పోలీస్, రెవెన్యూ విభాగాల అధికారులు విచారణ జరుగుతోందని, ఇంకా చాలా రోజుల సమయం పడుతుందని చెప్పి తప్పించుకుంటున్నారు.

ముందస్తుబెయిల్ పిటీషన్‌పై విచారణ నేటికి వాయిదా

మచిలీపట్నంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో విచారణ నిమిత్తం విజయవాడకు చెందిన స్పెషల్ పీపీ, జాయింట్ డైరెక్టర్ విజయను ప్రాసిక్యూషన్ తరపున వాదించేందుకు ప్రభుత్వం నియమించింది. ఈ కేసు గురువారం విచారణకు వచ్చింది. స్పెషల్ పీపీ ఈ కేసులో విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. అయితే 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.సుజాత శుక్రవారం) ఈ కేసు విచారణను వాయిదా వేశారు. ఈ కేసులో నిందితురాలిగా పేర్కొన్న పేర్ని జయసుధ తరపు న్యాయవాదులు పేర్ని జయసుధను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా న్యాయాధికారి తిరస్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103,111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారనడం సిగ్గుచేటు

బీజేపీ ఓబీసీ మోర్చా నగర మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు

పటమట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అనడం సిగ్గుచేటని బీజేపీ ఓబీసీ మోర్చా నగర మాజీ అధ్యక్షుడు దార్న చంద్రశేఖర్‌రావు విమర్శించారు. అమిత్‌షా అంబేడ్కర్ పేరుని పలుమార్లు పలకడంలో ఉద్దేశ్యం అంబేడ్కర్ చరిత్రను రాబోయే తరాలకు తెలియకుండా చేసేందుకు కాంగ్రెస్ కుట్ర రాజకీయాలను తెలియచెప్పటానికేనన్నారు. ఈ మాటలను వక్రీకరించి కాంగ్రెస్‌తనకు అనుకూలంగా మలచుకోవాలని చూసి బొక్కబోర్లా పడిందని దార్న విమర్శించారు.

కంటైనర్..ఆకతాయిల అడ్డా

- మూడేళ్లుగా గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట పార్క్ చేసి వదిలేశారు
- గంజాయి బాబులకు షెల్టర్‌గా మారిన వైనం
- శ్మశానానికి వచ్చేవారికి అడ్డు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు, మాచవరం పోలీసులు



(గుణదల, ఆంధ్రజ్యోతి)

కంటైనర్‌ను కేంద్రంగా చేసుకుని కొంతమంది ఆగంతకులు ఆగడాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి గేటు ఎదురుగా రోడ్డు పక్కన మూడేళ్లుగా కంటైనర్ పార్క్ చేసి వదిలేశారు. ఈ కంటైనర్ ఎవరిదో తెలియదు. తాజాగా కొద్ది కాలం క్రితం కంటైనర్ సైడ్ డోర్‌ను ఆగంతకులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. ఎంచక్కా ఎండా...వాన సంబంధం లేకుండా షెల్టర్ దొరికినట్టయింది. దీంతో రాత్రి వేళల్లో గంజాయి బ్యాచ్ కొంతమంది అక్కడకు చేరుకుని కంటైనర్‌లో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ అధికారులు, మాచవరం పోలీసులు కంటైనర్‌ను అక్కడ నుంచి తొలగించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. లేదా సదరు వాహన యజమానికి నోటీసులు ఇచ్చి వాహనం తొలగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కంటైనర్ అక్కడ పార్క్‌చేసి వదిలేయడం వల్ల శ్మశానానికి వచ్చేవారు వారి వాహనాలను పార్క్ చేసుకోవడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై అటు పోలీసులు ఇటు వీఎంసీ అధికారులు దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోగుల హక్కులు కాపాడాలి

ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.వి సత్యనారాయణ హితవు



ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల హక్కులు కాపాడాలని, వారి భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్ల కూడదని, వైద్యులు నీతి నియమాలను పాటించాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.వి సత్యనారాయణ హితవు పలికారు. క్లినికల్ రీసెర్చ్‌లో పాటించాలన్సి అంశాలను ఆయన వివరించారు. సిద్ధార్థ వైద్య కళాశాలలో నెక్సస్ క్లినికల్ సర్వీసెస్ భాగస్వామ్యంతో ఇన్‌స్టిట్యూషనల్ ఎథిక్స్, క్లినికల్ రీసెర్చ్ రివ్యూ కమిటీలను స్థాపించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మెరుగైన క్లినికల్ రీసెర్చ్ సేవలందించేందుకు సిద్ధార్థ వైద్య కళాశాల, నోవా నార్డిస్క్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మధ్య ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావు, డాక్టర్ వి.రాధికారెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శివశంకర్, డాక్టర్ రాంబాబు, ఎథిక్స్ కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎం.రజని, కె.యుగంధర్ పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్

కృష్ణలంక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో,



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కళాశాలల్లో పనిచేస్తునన శానిటేషన్ (ఆయా) వర్కర్లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో వున్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం డీఈవో ఎం.సుబ్బారావుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు దాదాపుగా ఐదు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో వున్నాయన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.


లయోలా యాజమాన్య వైఖరి మారాలి

- కళాశాల గేటు వద్ద లయోలా, అమరావతి వాకర్స్ ధర్నా



లయోలా కళాశాల గేటు వద్ద నిరసన తెలుపుతున్న అమరావతి , లయోలా వాకర్స్

భారతీనగర్ / మొగల్రాజపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాకర్స్‌ను మైదానంలోకి ప్రవేశం లేకుండా అడ్డుకుంటున్న లయోలా కళాశాల యాజమాన్యం వైఖరి మారాలని లయోలా, అమరావతి వాకర్స్ సభ్యులు గురువారం కళాశాల గేటు ముందు శాంతియుతంగా ధర్నా చేశారు. ఉదయాన్నే కళాశాల గేటు వద్దకు చేరుకున్న సభ్యుల తరుపున రావి రమేష్ మాట్లాడుతూ గతంలో అనుమతించిన కళాశాల యాజమాన్యం ఇపుడు ఎందుకు అనుమతిండం లేదని ప్రశ్నించారు. 30 ఏళ్లుగా కళాశాల మైదానంలో వాకింగ్‌కు వస్తున్న తమకు ప్రవేశం ఆపడం మంచి పద్ధతి కాదన్నారు. కరోనా సమయం నుంచి వాకర్స్‌ను అనుమతించడం లేదన్నారు. తమకు అనుమతి ఇప్పించాలని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. శాంతియుతంగా తాము నెల రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10న జీవో నెంబరు 18 ద్వారా నూతన స్పోర్ట్స్ విధానం ప్రకటించారని, ఆ జీవోలో క్లాజు 1.6 ప్రకారం అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా ఆట స్థలాలను అభివృద్ధి చేయాలని, ఆ సౌకర్యాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారని ఆ జీవో కాపీని కళాశాల యాజమాన్యానికి ఇచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయోలా, అమరావతి వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసం, మానసిక ఉల్లాసానికి క్రీడలు

- నలందలో క్రీడా దినోత్సవం



క్రీడా జ్యోతి వెలిగించి క్రీడా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ తరుణ్ కాకాని

గవర్నర్‌పేట, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): క్రీడలు వ్యక్తిత్వాన్ని మెరుగుపర్చడమే కాకుండా విద్యార్థుల్లో శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని స్కల్లింగ్ అండ్ రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ఖేల్ ఇండియా సభ్యుడు డాక్టర్ తరుణ్ కాకాని అన్నారు. గురువారం నలంద విద్యానికేతన్‌లో 27వ వార్షిక క్రీడా దినోత్సవంను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలంద విద్యా సంస్థలు జాతీయ స్థాయిలో పోటీ పడే క్రీడాకారుల్ని అందించడం అభినందనీయ మన్నారు. ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఇంటర్ స్కూల్ పోటీలు జరిగాయని, అందులో భాగంగా లాంగ్ జంప్, షాట్‌పుట్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, యోగ్యతాపత్రాలు అందజేస్తామన్నారు. విజయవాడలోని 13 పాఠశాలల నుంచి 155 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కుసుమ, హెడ్‌మిస్ట్రెస్ సిహెచ్ ఉషారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెగిపడిన కేబుల్ వైర్లతో ప్రమాదం

భయాందోళనలో వాహనదారులు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ప్రధాన, అంతర్గత రోడ్లో తెగిపడి ఉన్న కేబుల్ వైర్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాల్గవ డివిజన్ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, గురునానక్‌కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్డు మార్జిన్‌లో ఉన్న స్తంభాలకు కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కేబుల్ వైర్లు పలు చోట్ల తెగిపోయాయి. ఈ వైర్లు రోడ్డు మార్జిన్ కిందకు వేలాడడంతో ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్లో రాత్రి సమయంలో రాకపోకలు సాగిస్తుంటే ఈ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని పాదచారులకు, ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎల్ఐసీ కాలనీ మెయిన్‌రోడ్లో తెగి పడిఉన్న వైర్లు.. →



బాధితులకు ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం పొందిన బాధితులతో గద్దె క్రాంతికుమార్

పటమట, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : తూర్పు ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అండగా ఉంటున్నారని, ప్రభుత్వ పథకాలు అందని వారికి తన సొంత నిధులతో ఆయన ఆర్థిక సహాయం చేస్తున్నారని, తాను కూడా ఆయన అడుగు జాడల్లో సేవా కార్యక్రమాలు నిర్వహి స్తానని యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని పలు డివిజన్ల వారికి గద్దె క్రాంతికుమార్ రూ.55వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, తాడి బాబూరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, బండి కోమలిలు పాల్గొన్నారు.

యూజీడీ, వాటర్ పైపులైన్ పనులకు అంచనాలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



రిటైనింగ్ వాల్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లబ్బీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంట 70అడుగుల వెడల్పుతో పాటు భూగర్భ డ్రెయినేజీ, మురుగునీటి కాలువ, నీటి సరఫరా పైపులను అమర్చే పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం 16వ డివిజన్ గీతానగర్ కరకట్ట డీబీ ప్లాంట్ నుంచి యనమలకుదురు కొండ వరకు రిటైనింగ్ వాల్ పక్కన నిర్మాణ పనుల విషయమై కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ వెంట 70అడుగుల రోడ్డుతో పాటు యూజీడీ, మురుగునీరు కాలువలు నిర్మాణం చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్డు, డ్రెయినేజీ, మురుగు కాలువలు, మంచినీటి పైపులైన్లు అమర్చడానికి అంచనాలు రూపొందించాలని, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ పనులకు శంకుస్థాపన చేయిస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో యూజీడీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, గాదిరెడ్డి అమ్ములు, పటాన్ హయాత్‌ఖాన్, కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం సీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, ఏసీపీ మోహనబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ వెస్ట్‌జోన్ క్రికెట్ విజేత పీబీ సిద్ధార్థ



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 18వరకు జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వెస్ట్‌జోన్ క్రికెట్ విజేతగా మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు నిలిచింది. ఆతిథ్య నలంద జట్టుపై సిద్ధార్థ జట్టు 71 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. విజయంలో కీలక పాత్ర పోషించిన సిద్ధార్థ జట్టు కెప్టెన్ హర్ష, సభ్యులను కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారావు అభినందించారు.

నాయీ బ్రాహ్మణులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

దుర్గగుడి ఈవో రామారావుకు వినతి

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని అప్పనపల్లి దేవస్థానం కేశఖండనశాలలో పనిచేస్తున్న పలువురు నాయీ బ్రాహ్మణులను పర్మినెంట్ చేయిస్తామని డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావును ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ అనుబంధ సంఘం నాయకులు కోరారు. గురువారం దుర్గగుడి ఈవోను సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నాయీ బ్రాహ్మణులను పర్మినెంట్ చేయిస్తామని డబ్బులు వసూలు చేసిన దుర్గగుడి కేశఖండనశాలలో పనిచేస్తున్న వారిలో కొందరు గుంటుపల్లి రామదాస్, ర్యాలీ వెంకటరమణ, అమలాపురపు గౌరీ లక్ష్మీనారాయణ, పెనుకుదురు సంతోష్‌లపై తగు శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈవోను కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీడీపీపొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి తమ సమస్యలను వివరించి సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరినట్టు తెలిపారు. దీనిపై స్పందించిన ఈవో పూర్తి విచారణ చేపట్టి వారిపై తగు చర్యలు తీసుకుంటానని సంఘం నాయకులకు హామీ ఇచ్చారు.



ట్రైనీలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న చలువాది మల్లిఖార్జునరావు

డ్రైవింగ్ స్కూల్ ట్రైనీలకు సర్టిఫికెట్ల పంపిణీ

పటమట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ విజయవాడ వారి అంపాపురం మోడల్ డ్రైవింగ్ స్కూల్లో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 1078 బ్యాచ్ ట్రైనీలకు విద్యావేత్త చలువాది మల్లిఖార్జునరావు సర్టిఫికెట్లను అందజేశారు. గురువారం అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారించాలంటే వాహన నియంత్రణ అవసరమని, డ్రైవర్లు తగిన శిక్షణ తీసుకోవాలన్నారు. లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నాగమోతు రాజు మాట్లాడుతూ ఉత్తమైన డ్రైవర్లను సమాజానికి అందించడానికి రూ.6వేల నామమాత్రపు రుసుముకే 32 రోజుల పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జునరావును సంఘం ఉపాధ్యక్షుడు కె సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు,కోశాధికారి పొట్లూరి చంద్రశేఖర్‌రావులు సత్కరించారు.











పరాయివారిదే కిరాయి

చేతివృత్తుల్లో యూపీ, ఎంపీ, ఒడిశా, బిహారీలదే రాజ్యం

- కూలీపనుల్లోనూ ఇతర రాష్ట్రాల వారే
- పని గంటలు, వేతనాలు, సెలవుల్లో తీవ్ర వ్యత్యాసం
- మనవాళ్లతో పోలిస్తే ఇతర రాష్ట్రాల కూలీలతోనే అధిక లాభాలు
- వృత్తి నైపుణ్యం కూడా వాళ్లకే ఎక్కువ
- అందుకే వాళ్ల వైపే మొగ్గు చూపుతున్న వ్యాపారులు, బిల్డర్లు

వడ్రంగి, చెప్పుల తయారీ, కుమ్మరి, కమ్మరి, సెలూన్, తాపీ పని, మట్టిమోత పని ఏదైనా అనాదిగా మన తెలుగు రాష్ట్రాల్లో కులవృత్తులుగా చెలామణి అవుతున్నాయి. ఒక్కోపనిని ఒక్కో కులం చేతి వృత్తిగా భావించి ఆయా పనులను చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఇక బీరువాలు, మంచాల తయారీ పనులు కూడా చాలామందికి చేతి వృత్తులుగా ఉన్నాయి. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు మన తెలుగు వాళ్లు నెమ్మదిగా చేతివృత్తులు, కులవృత్తులకు దూరమవుతున్నారు. ఆయా కుటుంబాల్లో యువత చదువుకుని ఉండటం, నూతన పోకడల కారణంగా చేతి వృత్తులపై మొగ్గుచూపడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల కూలీలు ఆ లోటును భర్తీ చేస్తున్నారు. నేడు తెలుగు రాష్ట్రాల్లో ఏ చేతి వృత్తి, ఏ కుల వృత్తిని చూసుకున్నా మన వాళ్లకన్నా పరాయి రాష్ట్రాల వారి సంఖ్య ఎక్కువ. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బిహారీలు ఆయా పనుల్లో నైపుణ్యం ప్రదర్శిస్తూ మన వాళ్లకు పోటీ ఇస్తున్నారు అనడం కన్నా పక్కన పెట్టేశారని చెప్పవచ్చు.- అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రజ్యోతి

మనవాళ్లు కుల వృత్తులకు, చేతి వృత్తులకు దూరం కావడంతో ఇతర రాష్ట్రాల కార్మికులు ఆయా వృత్తుల్లో స్థిరపడుతున్నారా లేక వాళ్లు రావడం వలన మనవాళ్లకు పని లేకుండా పోతోందా అనే విషయం పక్కన పెడితే మన తెలుగు వాళ్లకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలకు అనేక విషయాల్లో తీవ్ర వ్యత్యాసం ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలు చేసే పని గంటలు ఎక్కువ, సెలవుదినాలు తక్కువ. వేతనాల్లోనూ తక్కువకే పనిచేస్తున్నారు. దీంతో అనేక మంది చిన్నా, పెద్ద పరిశ్రమలు నిర్వహించే వ్యాపారులు, బిల్డర్లు ఇతర రాష్ట్రాల కూలీలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఉదాహరణకు తాపీ పని, మట్టి మోత పనులు తీసుకుంటే మన వాళ్లు ఉదయం 8.30కి పనికి ఎక్కితే మధ్యాహ్నం గంట విరామం తీసుకుని సాయంత్రం 6.00 గంటలకు దిగిపోతారు. ఇక వేతనం విషయానికి వస్తే రోజుకు మగవారికి రూ. 800 కూలీ ఉండగా ఆడవాళ్లకు రూ. 600 ఉంటుంది. ఇక సెలవు దినాల విషయానికి వస్తే వారంలో మనవాళ్లు పనిచేసేది 4 లేదా 5 రోజులు మాత్రమే. బిల్డర్ లేదా తాపీ మేస్త్రీ ఏదైనా పెద్ద పని ఒప్పుకుంటే మనవాళ్లతో ఆ పని సకాలంలో పూర్తి చేయలేమనే ఆపనమ్మకం ఏర్పడింది. అదే ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు బిల్డర్‌కు ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉంటారు. ఉదయం 6 గంటలకు పని ఎక్కితే మధ్యాహ్నం భోజన విరామం మినహాయిస్తే రాత్రి 8గంటల వరకు పని చేస్తున్నారు. పైగా సెలవు అనే మాట వినపడదు. ఇక కూలీ విషయానికి వస్తే రోజుకు మగవారికి రూ.600 ఆడవారికి రూ.500 ఉంటుంది. అందుకే బిల్డర్లు, పరిశ్రమల నిర్వాహకులు పరాయి కూలీలపైనే ఆధారపడుతున్నారు.



కూలీల నుంచి సబ్ కాంట్రాక్టర్లుగా..

నిన్న మొన్నటి వరకు కూలీలుగా పనిచేసిన ఇతర రాష్ట్రాల కార్మికులు ఇప్పుడిప్పుడే సబ్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని పరిశ్రమల్లో యజమాని నుంచి రోజువారీ వేతనం కాకుండా ఆర్డర్లు వచ్చిన పనుల్లో సబ్ కాంట్రాక్టులు తీసుకుని ఆయా రాష్ట్రాల నుంచి కార్మికులను మన రాష్ట్రానికి రప్పించుకుంటున్నారు. సెలవులు లేకుండా తక్కువ వేతనాలకు ఎక్కువ పనిదినాలు చేస్తూ యజమానికి లాభాలు తెచ్చిపెడుతుండటంతో చాలా మంది ఇతర రాష్ట్రాల కార్మికులవైపే మొగ్గుచూపుతున్నారు.

పేదరికం కూడా కారణమే: సీహెచ్ బాబూరావు

మన రాష్ట్రంతో పోలిస్తే యూపీ, బిహార్, ఒడిశా అభివృద్ధిలో కాస్త వెనుకపడి ఉన్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఉపాధి లేక కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది రాష్ట్రంలో తక్కువ జీతాలకు పనిచేస్తూ ఎక్కువ శ్రమ చేస్తున్నారు. వీరికి కూడా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి.

ప్రశ్నించే గుణం మనవాళ్లలో ఎక్కువ: దోనేపూడి శంకర్

తెలుగు రాష్ట్రాల్లో కార్మికులకు ప్రశ్నించే గుణం ఎక్కువ, అందుకే మన వాళ్లు వెనుకబడిపోతున్నారు. ఇతర రాష్ట్రాల కూలీలు చెప్పిన పని ప్రశ్నించకుండా పూర్తి చేస్తున్నారు. అందుకే చాలాచోట్ల వారే ఎక్కువ. ప్రమాదవశాత్తు ఎవరైనా ఇతర రాష్ట్ర కూలీ చనిపోతే చిన్నమొత్తంలో ఇచ్చి సరిపెట్టేస్తున్నారు. అదే మనవాళ్ల విషయంలో కుదరదు. అందుకే అందరూ ఇతర రాష్ట్రాల కూలీలపై ఆధారపడుతున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నకిలీలు పోలీసులు

- బంగారం షాపు గుమస్తాను బెదిరించి రూ.26లక్షల దోపిడీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేటలోని ఓ బంగారు ఆభరణాల షాపులో పనిచేస్తున్న గుమస్తాను పోలీసులమని చెప్పి ముగ్గురు అతడిని బెదిరించి కారులో కిడ్నాప్ చేసి రూ.26లక్షలు దోచుకున్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నకిలీ పోలీసులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. జగ్గయ్యపేటలోని బంగారు ఆభరణాల షాపు నిర్వహిస్తున్న సాయి వద్ద రామకృష్ణ గుమస్తాగా పనిచేస్తున్నాడు. యజమాని సాయి ఇతర ప్రాంతాల్లో బంగారం కొనుగోలు చేయటానికి గుమస్తా రామకృష్ణకు డబ్బులిచ్చి పంపిస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారి సాయి బుధవారం రామకృష్ణకు సుమారు రూ.26లక్షల నగదు ఇచ్చి చెన్నైలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయించటానికి విజయవాడకు పంపించారు. అయితే రామకృష్ణ జగ్గయ్యపేట నుంచి విజయవాడకు ఓ కారులో ప్రయాణించాడు. ఖుద్దూస్ నగర్ ఎర్రకట్ట వద్ద రాత్రి 11 గంటలకు ముగ్గురు వచ్చి తాము పోలీసులమంటూ రామకృష్ణ ప్రయాణిస్తున్న కారును ఆపారు. కారు నుంచి బయటకు దిగిన రామకృష్ణను వేరే కారులో ఎక్కించుకుని కేదారేశ్వరపేటలోని ప్రభాస్ కాలేజీ సమీపంలోకి తీసుకువచ్చి కారును ఆపి రామకృష్ణను కారులో కూర్చోపెట్టి సీఐతో మాట్లాడి వస్తామని బయటకు వెళ్లారు. కొద్దిసేపటి తరువాత రామకృష్ణ వద్దకు వచ్చి బెదిరించి, కొట్టి అతడి వద్ద ఉన్న రూ.26లక్షలు నగదు తీసుకుని పరారయ్యారు. బాధితుడు అక్కడ నుంచి వెళ్లి సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించాడు. సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఆ ముగ్గురిని తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈ ముగ్గురు నకిలీ పోలీసులు ఇంకా ఎక్కడెక్కడ నేరాలు చేశారన్నదానిపై సీసీఎస్ సీఐ పెద్ది శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

ఇంటి వద్దకే పార్శిల్ డెలివరీ

బస్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాజిస్టిక్స్ ద్వారా ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ఇంటి వద్దకే పార్శిల్ డెలివరీ ఇవ్వబడునని ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2017లో ప్రారంభమైన ఏపీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ దినదినాభివృద్ధి చెందుతూ వినియోగదారుల మన్ననలను పొందిందన్నారు. ప్రతి ఏడాది డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందుకే ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు 80 ప్రధాన నగరాలు, ముఖ్య పట్టణాల్లో 50 కేజీల వరకున్న పార్శిళ్లను ఇంటి వద్దకే డెలివరీ చేయబడుతుందని తెలిపారు. 5 కిలోమీటర్ల లోపున్న కేజీ పార్శిల్‌కు రూ.17.70, 6 కేజీల వరకు ఉన్న పార్శిల్‌కు రూ.35.40, 10 నుంచి 25 కేజీల వరకు పార్శిల్‌కు రూ.47.20, 25 నుంచి 50 కేజీల వరకున్న పార్శిల్‌కు రూ.50ల చార్జీలు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. 10 కిలోమీటర్ల లోపున్న కేజీ పార్శిల్‌కు రూ.21.24, కేజీ నుంచి 6 కేజీల వరకున్న పార్శిల్‌కు రూ.42.48, 10 నుంచి 25 కేజీలున్న పార్శిల్‌కు రూ.61.36, 25 నుంచి 50 కేజీలున్న పార్శిల్‌కు రూ.76.70 వసూలు చేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని ఆ ప్రకటనలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయుడు

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర లారీ యజమానుల సంఘం

లబ్బీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో పన్నులు అధికంగా ఉండటంతో ఏటా లారీ యజమాని ఒక్కో వాహనానికి రూ.2లక్షల వరకు నష్టపోతున్నాడని రాష్ట్ర లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం బెంజి సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ యజమానులు పక్కరాష్ట్రాల్లో డీజిల్ కొనుగోలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్న అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలన్నారు. అనంతరం ఏపీ లారీ ఓనర్స్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గ్రీన్‌టాక్స్ తగ్గిస్తామని, కాంపౌండింగ్, చలానా సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ఇచ్చిన హామీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పోర్టల్ ఈ-ప్రగతిని కేంద్ర వాహన్‌లో కలిపినందున అప్ లోడింగ్ పరంగా తీవ్ర జాప్యం జరిగి లారీ యజమానులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టోల్ గేట్ రేట్లు ఏటా 7శాతం పెంచడంలో హేతుబద్దత లేదన్నారు. వాహన్‌లో వస్తున్న కేసులన్నింటినీ మార్చి 31వరకు వాయిదా వేసి ఆర్టీవో ఆఫీసులోని పనులకు ఆటంకం కలగకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ జిల్లాల నుంచి లారీ యజమానుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ ఇవ్వాల్సిందే..!

- ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్

బస్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన, చేయనున్న ప్రజా రవాణ సంస్థ ఉద్యోగులకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాల్సిందని, దీని అమలుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజా రవాణ సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం ఎండీ ద్వారకా తిరుమలరావు, పరిపాలనా విభాగం ఈడీ రవివర్మకు లేఖలు ఇచ్చారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య గురువారం ఒక ప్రకటన చేశారు. చిన్న చిన్న కారణాలపై పెన్షన్ దరఖాస్తులను తిరస్కరించకుండా ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెప్పించుకుని పెన్షన్ మంజూరు ప్రాసెస్‌ను ఆలస్యం లేకుండా చేయాలన్నారు. హయ్యర్ పెన్షన్ డిమాండ్ నోటీస్‌లను డౌన్‌లోడ్ చేసుకోవటం తెలియని వారికి తిరిగి అవకాశం కల్పించాలని, వారికి మళ్లీ రిమాండ్ నోటీసులివ్వాలని కోరారు. హయ్యర్ ఎక్కువ వేతనాలపై రికవరీ ఆప్షన్ ఇచ్చి, ఆ మేరకు రికవరీలు చేయించుకుని పెన్షన్ ఫండ్‌కు రికవరీలు పంపినా సరే, ఆమోదం పత్రం లేదని దాదాపు 150 మంది ఉద్యోగులకు పెన్షన్ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉందని, దీనికి పీఎఫ్ ట్రస్ట్ బాధ్యత తీసుకుని పరిష్కరించాలని కోరారు. 2013, 2017, 202లో బకాయిల చెల్లింపులు ఇతర లబ్ధి ఆలస్యంగా జరిగిందని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పెన్షన్‌ను లెక్కించినందున సుమారు రూ.500 నుంచి రూ.1000 వరకు నష్టపోతున్నారని దీన్ని సవరించి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్‌లో నిత్యం వస్తున్న సమస్యల పరిష్కారానికి, పెరిగిన పని భారానికి అనుగుణంగా గుమస్తాలను నియమించాలన్నారు. అన్ని యూనియన్‌లకు, అసోసియేషన్‌లకు డిమాండ్ నోటీసుల వివరాలు వాట్సాప్‌లో పంపించేలా ఏర్పాటు చేయాలన్నారు.

మినుము నూర్పిడి మిషన్ బోల్తా, కూలీ మృతి

- మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

తోట్లవల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మినుము నూర్పిడి మిషన్ బోల్తా పడి మహిళా కూలీ యాదనాల లక్ష్మీ (46) మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చాగంటిపాడు శివారు పిల్లివానిలంకలో జరిగింది. చాగంటిపాడుకు చెందిన లక్ష్మీ, నిమ్మకూరి నాగమ్మ, నందేటి శిరీష మొత్తం 10 మంది కూలీలు మినుము నూర్పిడి పనులకు ముఠాగా ఏర్పడి భీమవరపు భగవాన్‌రెడ్డి మిషన్ వెంట వెళుతున్నారు. గురువారం ఉదయం నుంచి మినుము నూర్పిడి పనులు చేసి సాయంత్రం 6.30 గంటల సమయంలో మరో రైతు పొలంలోకి మిషన్‌పై వెళుతున్నారు. కోతకు గురైన రోడ్డు మార్జిన్‌లో మినుము మిషన్ పడి అదుపుతప్పి బోల్తా కొట్టింది. మిషన్ కింద యాదనాల లక్ష్మీ, నిమ్మకూరి నాగమ్మ, నందేటి శిరీష పడిపోగా మిగతావారు చెల్లాచెదురుగా పడిపోయారు. పరిసర రైతులు, ప్రజలు వచ్చి మిషన్ కింద పడిన వారిని బయటకు తీయగా యాదనాల లక్ష్మీ ప్రాణాలు కోల్పోగా నాగమ్మ, శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ వై చిట్టిబాబు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి భర్త లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పాతికేళ్ల శ్రమ నూరేండ్ల నా ఊరు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పల్లె తెల్లారేది పాటతోనే... - ఆర్డినరీ బస్సులు, పాసింజర్ రైళ్లు నా పాటకు పునాదులు
- ఆంధ్రజ్యోతితో జానపద గాయకుడు, గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్

పోలీసు కుటుంబంలో జన్మించిన ఆయన ఫోక్‌రైటర్ అయ్యారు. తర్వాత జానపద గాయకుడిగా మారారు. తెలుగు భాషలోనే కాకుండా అస్సామీ మీమీ, ఒడియా, మరాఠీ భాషల్లో జానపదులను జత వేసే స్థాయికి ఎదిగారు. ఆయనే సినీ గేయ రచయిత, జానపద గాయకుడు వరంగల్ శ్రీనివాస్. తెలంగాణ సమాచార పౌర సంబంధ శాఖలో ఉద్యోగం చేస్తూ జానపదాన్ని, పల్లె సాహిత్యాన్ని పెంచుతున్నారు. ఆయన రచించిన గేయ కావ్యం 'నూరేండ్ల నా ఊరు' ఆడిషన్స్ కోసం విజయవాడకు వచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.
- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

ఏమిటీ గేయకావ్యం నేపథ్యం..?

ఒకప్పుడు పల్లెలు, అక్కడి మనుషులు, వారి మనస్సులు, పల్లెలకున్న పేర్లు, అక్కడ ఇప్పుడున్న పరిస్థితులను ఊశాక నూరెండ్ల నా ఊరు గేయకావ్యం ప్రాణం పోసుకుంది. దీని రచన 25 ఏళ్లపాటు సాగింది. నేను ఉమ్మడి వరంగల్ జిల్లా దామెర మండలం తక్కెళ్లపాడు గ్రామంలో జన్మించాను. నాన్న నరసయ్య పోలీసు కానిస్టేబుల్. బయన బదిలీ అయినప్పుడు వరంగల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉండేవాళ్లం. దీంతో మేం ఉంటున్న ప్రాంతానికి చుట్టూ అక్కడున్న పల్లెలు, వాతావరణం బాల్యం నుంచి చూశాను. ఒక రోజు నా కుటుంబంతో కలిసి ఏటూరునాగారం వెళ్తున్నప్పుడు చినబోయినపల్లె గ్రామం పేరు బోర్డుపై కనిపించింది. అసలు పల్లె చినబోవడం ఏమిటన్న ప్రశ్న అప్పుడే నాలో మొదలైంది. మేము వరంగల్ నుంచి ఊరు వెళ్తున్నప్పుడు మా అబ్బాయి పొలంలోకి వెళ్లి మొక్కజొన్న కండె తీసుకున్నాడు. దాని యజయాని తిట్టాడు. నా చిన్నప్పుడు రైతులు పిలిచి మరీ కండి కాల్చి ఇచ్చేవారు. గ్రామాల్లో అప్పటికీ, ఇప్పటికీ వచ్చిన మార్పులతో 'నూరెండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని రాశాను. ఓయమ్మ నా పల్లెసీమ ఎందుకింత చిన్నబాయె... ఎనకటికల తప్పినాదో నాపల్లె ఎటుగానీ తీరయినాదో...' పల్లవితో పాటను రాశాను. ఇందులో మొత్తం 243 చరణాలుంటాయి.

243 మంది గాయకులు ఎందుకు..?

పాటకు ప్రాణం అమ్మ పాడే జోలపాట. పాటతోనే పల్లెలకు తెల్లవారు పొద్దు వస్తుంది. బాలసంతు పాటతో పల్లెలు నిద్రలేస్తాయి. ఇలా మొదలయ్యే పల్లెకు పొద్దుపోవడం పాటతోనే జరుగుతుంది. బాలసంతు పాటల తర్వాత ఇళ్లలో అమ్మలు పనులు చేసుకుంటూ పాటలు పాడతారు. చివరికి సాయంత్రం సూర్యాస్తమయమూ పాటతోనే జరుగుతుంది. పల్లెల్లో కలుపు తీసినా, నాట్లు వేసినా, కోతలు కోసినా, బండి కట్టినా, బంతి కొట్టినా పాటే. వీటన్నింటిని చూసి అప్పటి, ఇప్పటి పరిస్థితులను పోల్చుతూ 243 చరణాలు రాశా. ఒక్కో చరణాన్ని ఒక్కో గాయకునితో పాడిస్తే బాగుంటుందని స్నేహితులు గూడూరు మహేష్, గాయకుడు జూపాల్ శివ సలహా ఇచ్చారు. అందుకే తెలంగాణ మొత్తం ఆడిషన్స్ నిర్వహించాం. ఆంధ్రప్రదేశ్‌లోను నిర్వహించాలని భావించా. రాయలసీమ, ఉత్తరాంధ్రలో పూర్తి చేశాం. 72 మంది గాయనీమణులు, 171 మంది గాయకులతో పాడించాలన్నది ఆలోచన.

జానపద గేయ రచయితగా ఎలా..!

నేను పాడడం కోసమే రాయడం మొదలుపెట్టా. పాడే అవకాశం రాకపోయినా రాయడం ఆపలేదు. వరంగల్‌లో ఏడో తరగతి చదువుతున్నప్పుడు ఇంటర్వెల్‌లో స్కూల్ నుంచి బయటకు వచ్చా. ఎదురుగా ఉన్న మొగిలయ్య ఆడిటోరియంలో పాటల పోటీల బ్యానర్ కనిపించింది. లోపలకు వెళ్లి 5 నిమిషాల్లో పాట రాశా. అదే నా మొదటి పోటీ, ప్రథమ బహుమతి వచ్చింది. అప్పటి నుంచి గేయరచనపై మరింత ఆసక్తి పెరిగింది. బాల్యంలో హమాలీలు, కార్మికులుండే ప్రదేశాలకు వెళ్లేవాడిని. వాళ్లు చెప్పుకునే కష్టాలు, వేసుకునే జోకులు వినేవాడిని. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు ప్యాసింజర్ రైళ్లలో వెళ్తున్నప్పుడు, ఆర్డినరీ బస్సులో ఊరు వెళ్తున్నప్పుడు ప్రయాణికులతో మమేకమయ్యేవాడిని. వారిలో వివిధ రాష్ట్రాల వారుండేవారు. అక్కడి జానపదాల గురించి మాట్లాడేవాడ్ని. అలా అస్సామీ, ఒరియా, మరాఠీ, లంబాడీ, గోండు, కోయ, ఎరుక భాషల్లో జానపదాలపై పట్టు సాధించా.

తొలి పాట రాసిన చిత్రం..?

దాసరి నారాయణరావు నాకు మొదటిసారిగా సినిమాల్లో పాటలు రాసే అవకాశం ఇచ్చారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన అడవి చుక్క చిత్రంలో 'ఎవరన్నారమ్మ మీరు గరీబోళ్లని...' , 'తయ్యాందత్తయ్...' గీతాలు రాశాను. తర్వాత ఆర్.నారాయణమూర్తి దర్శకత్వం వహించి, నటించిన చలో అసెంబ్లీ చిత్రంలో 'వవవ... విద్యార్థి వీధిన పడిపోతావన్న...' పాటను రాశాను. ఇవి కాకుండా ఆయుధం, అమ్మ మీద ఒట్టు, వీర తెలంగాణ, పోరు తెలంగాణ, వేగుచుక్కలు, ఊరు మనదిరా రెండేళ్ల తర్వాత సినిమాలకు పాటలు రాశాను. మొత్తంగా 50 చిత్రాలకు పాటలు రాసే అవకాశం వచ్చింది.

మీ జీవిత లక్ష్యం..?

నేను జానపద పాటలు రాయడం, పాడడం మొదలుపెట్టిన తర్వాత ఏదైనా ఒక సినిమాకు సంగీత దర్శకత్వం వహించాలన్నది లక్ష్యం. చనిపోయే లోపు ఒక సినిమాకు అయినా సంగీత దర్శకత్వం చేయాలనుకున్నా. ఆ కోరికను దర్శకుడు వి.సముద్ర తీర్చుతున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న మూడు చిత్రాలకు సంగీతం సమకూర్చే అవకాశం ఇచ్చారు. ఇందులో రెండు చిత్రాలకు పాటలు నేను రాస్తున్నా. తెలుగు చిత్రసీమలో ఇటువంటి అవకాశం ఎవరికీ రాలేదు.

అమరావతి వేదికగా జాతీయ క్రీడలు

- యాప్ ఆవిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే క్రీడాతరానికి శాప్ అమలు చేయనున్న క్రీడా యాప్ దిక్సూచిలా ఉపయుక్తమవుతుందని రాష్ట్ర క్రీడా మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయడుతో కలిసి డిజిటల్ సేవలను పారదర్శకంగా అందుబాటులోకి తీసుకొచ్చే క్రీడా యాప్‌ను మంత్రి గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆర్నెల్లలోనే క్రీడాపాలసీని రూపొందించి తొలి అడుగేయగా, ఇప్పుడు డిజిటల్ యాప్‌తో రెండో ముందడగు వేశామన్నారు. అమరావతి వేదికగా జాతీయ క్రీడల నిర్వహణకు సన్నద్ధం అవుతామని మంత్రి చెప్పారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు డిజిటల్ సర్టిఫికెట్స్ ఇవ్వడంతో పాటు బోగస్ సర్టిఫికెట్ల జారీకి సమూలంగా చెక్ పడుతుందన్నారు. క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్, శాప్ వీసీ ఎండీ గిరిషా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా ప్రోత్సహకాలు, సర్టిఫికెట్లు, ఇతర సమస్యలను పారదర్శకంగా యాప్ ద్వారా పరిష్కారం కానుండటం క్రీడావర్గాలకు ఓ వరమన్నారు. ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు, వివిధ సంఘాల ప్రతినిధులు నామిశెట్టి వెంకట్, ఆకుల రాఘవేంద్రరావు, యలమంచిలి శ్రీకాంత్, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీలో సత్తా చాటిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి: శివారెడ్డి

ధర్నాచౌక్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సీహెచ్. పురుషోత్తమ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ రాష్ట్ర సంఘానికి నాయకత్వం వహించాలని కోరారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటుదని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి విద్యాసాగర్‌ను ఎన్నుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

చంద్రబాబును విమర్శించే స్థాయి శ్రావణ్‌కు లేదు

- పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

ధర్నాచౌక్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కు లేదని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మాలలకు అనేక రాజకీయ అవకాశాలు కల్పించిన చంద్రబాబును విమర్శించేందుకు సిగ్గుండాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తానన్న చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పిన మాదిగలను అసహ్యంగా మాట్లాడే నీవు న్యాయమూర్తిగా ఎలా పని చేశావని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై జనవరి 26న విజయవాడలో ఉభయ రాష్ట్రాల్లోని మాదిగ సంఘాల రౌండ్‌టేబుల్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పులిపాక ప్రవీణ్, కందుల విల్సన్, ఎర్రంశెట్టి ప్రసాద్ రెల్లి, పూనూరు జార్జీ పాల్గొన్నారు.

'వర్గీకరణ చేపడితే ప్రభుత్వంపై తిరుగుబాటు'

ఎస్సీ వర్గీకరణ చేపడితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342కు వ్యతిరేకంగా వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్.రాజు, ఏపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఎస్.శ్యామ్ ప్రసన్నకుమార్, బోడపాటి రమణబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు 'కంటి రక్షణ'

విజయవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరంతరం రహదారులపై ఉండే ట్రాఫిక్ పోలీసుల కంటి రక్షణ కోసం అగర్వాల్ ఐ ఆసుపత్రి కళ్లజోళ్లను పంపిణీ చేసింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ప్రొటెక్టింగ్ విజన్ - ప్రొటెక్టింగ్ హీరోస్ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. రాఘవయ్య పార్కు వద్ద ఉన్న ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి సీపీ రాజశేఖర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు డాక్టర్ అగర్వాల్ ఐ ఆసుపత్రి వంటి చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. నిత్యం రహదారులపై ఉండే ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యపరమైన అనేక ఇబ్బందులు పడతారన్నారు. వారి శ్రేయస్సు కోసం సన్‌గ్లాస్‌లను అందించిన యాజమాన్యాన్ని అభినందించారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కేకేఎస్ చక్రవర్తి మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే వారికి దృష్టి ప్రధానమన్నారు. వారి కళ్లకు రక్షణను కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్, అగర్వాల్ ఐ ఆసుపత్రి హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్, డాక్టర్ కేకేఎస్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ గణేష్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పర్వదినం

మీకోసం నేనున్నానని...

క్రిస్మస్ కథ... దేవుని పుత్రుడైన ఏసు క్రీస్తు మానవుడిగా మారిన కథ. తన ప్రియ సుతుడైన ఏసును ఈ లోకానికి దేవుడు రక్షకునిగా పంపాడు. ఆయన రాకను దేవదూత ముందుగానే ప్రకటిస్తూ... ఏసు జననం మానవాళి అందరికీ గొప్ప ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పాడు. ఆయన జననం ఈ లోకానికి ఒక శుభవార్త. ఒక శుభవార్తను వినడం ఒక వేడుకైన సందర్భం. ఆ సందర్భమే ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకొనే క్రిస్మస్ పర్వదినం అయ్యింది.

మానవులు దైవం నిర్దేశించిన మార్గాన్ని విడిచిపెట్టి జీవితాన్ని పాపభూయిష్టంగా, దుఃఖమయంగా మార్చుకున్నారు. తనను ధిక్కరించినప్పటికీ మానవుల మీద దేవుడు ఆగ్రహించలేదు. వారిని



ఉద్ధరించాలని, మంచిదోవ చూపాలని సంకల్పించాడు. 'దేవుడికి మనమంటే ఎందుకింత ప్రేమ?' అనే ప్రశ్నకు 'ఆయనే ప్రేమ' అనేది యోహాను ఇచ్చిన సమాధానం. అందుకే మనల్ని పాపాల నుంచి, కష్టాల నుంచి కాపాడడం కోసం స్వయంగా తన పుత్రుడినే భూమిపైకి పంపాడు. అలా రక్షకుడిగా ఏసు ప్రభువు ఇలపై అవతరించాడు.

పాపం నుంచి, మరణం నుంచి, దుఃఖం నుంచి మనకు విముక్తి కల్పించడానికి అవతరించిన ఏసుక్రీస్తు... మనలో ఒకడిగా మెలిగాడు. మానవాళితో విడదీయరాని, శాశ్వతమైన బంధాన్ని ఏర్పరచుకున్నాడు. మనకోసం ఒక సేవకుడి స్వభావాన్ని స్వీకరించాడు. అర్తులకు, దీనులకు 'మీకోసం నేనున్నా'నని ధైర్యం చెప్పాడు. దారితప్పిన మానవాళికి తన నడవడిక ద్వారా, తన బోధనల ద్వారా గమ్యాన్ని చూపించాడు. రెండువేల ఏళ్ల క్రితం బెత్లెహేములోని ఒక పశువుల పాకలో సామాన్యుడిగా జన్మించిన ఆయన లోకాన్ని శాంతిమయంగా, కరుణాపూరితంగా చేయాలని తపించాడు. ఈ లోకాన్ని పాపాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం స్వయంగా శిలువను ఎక్కి ప్రాణాలు అర్పించాడు. ఈ లోకంలో ఆయన జీవించినది కేవలం ముప్పై మూడేళ్ళే కానీ ఎన్ని యుగాలకైనా శాశ్వతంగా నిలిచే సందేశాన్ని అందించాడు.

'దేవుణ్ణి ప్రేమించండి, మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నట్టే పొరుగువారిని ప్రేమించండి...' ఈ మాటలను ఆయన బోధనలకు ప్రధాన సారంగా చెప్పుకోవచ్చు. ఏసు క్రీస్తు ఆవిర్భావం ఒక నవశకానికి నాంది. మానవ చరిత్రలో ఒక మహోన్నతమైన ఘట్టం. దాని విశిష్టతను, పవిత్రతను, ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ... ఆయన పుట్టినరోజుగా క్రిస్మస్‌ను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. ఈ పవిత్రమైన రోజున చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఏసు ప్రబోధించిన ప్రధాన సూత్రాలు... ప్రేమ, క్షమ, దయ. ప్రతి మనిషీ తనలో ఈ గుణాలను పెంచుకున్నప్పుడు ప్రపంచం ఆనందమయమవుతుంది. వాటిని పెంపొందించుకోవాలనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకుంటేనే క్రిస్మస్ పర్వదినం సార్థకమవుతుంది.

చింతన

అయినా మనిషి మారలేదు!

ప్రపంచ చరిత్ర అంతటా ఎందరో సంస్కర్తలు, మతప్రవక్తలు మానవుణ్ణి సంస్కారవంతుడిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించారు. సమాజంలో అన్యాయం వల్ల అలమటిస్తున్న ప్రజానీకం బతుకులను బాగుపరచడానికి పాటుపడ్డారు. కానీ రాతియుగంలో బతికిన మనిషికి, ఈనాటి మనిషికి మధ్య ఏమాత్రం భేదం లేదని అనడం అతిశయోక్తి కాదు. ఎన్నో వేల సంవత్సరాల పరిణామం తరువాత కూడా మనిషిలో అదే స్వార్థం, అసూయ, ద్వేషం, క్రౌర్యం, నిర్దయ. బుద్ధుడు, మహావీరుడు ప్రసాదించిన ప్రవచనాల ప్రభావం మనిషిమీద కాస్తయినా కనిపించదు. వారు బోధించిన సత్యం, అహింసల ప్రేరణతో... ప్రజలను కూడగట్టి, తెల్ల దొరలను మన దేశం నుంచి పారద్రోలారు మహాత్మా గాంధీ. కానీ 1947లో జరిగిన దారుణమైన మతకలహాలు, వాటి వల్ల లక్షలాది మంది ప్రజలు బలి కావడం మహాత్ముడికి ఎంత దుఃఖం కలిగించాయంటే... అలాంటి పరిస్థితుల్లో మరణమే మేలనుకున్నారు. విశ్వ మానవ స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆశయాలతో ప్రారంభమైన ఫ్రెంచి విప్లవం... దానికి భిన్నంగా మనిషిలో దాగి ఉండే హద్దులు లేని క్రౌర్యాన్ని బహిర్గతం చేసి, వేలాది ప్రజల ప్రాణాలను బలి తీసుకుంది. "ఆశయాలు ఉత్కృష్టమైనవి అయినా, అవి మనిషిలోని నీచత్వాన్ని, క్రౌర్యాన్ని, అవినీతిని తగ్గించవు. మనిషిని కొంచమైనా మార్చలేవు" అని జిడ్డు కృష్ణమూర్తి చాటిచెప్పే సత్యానికి రష్యన్ విప్లవం ఒక తిరుగులేని రుజువు.

సంపూర్ణ చర్య

సంస్కరణలు, విప్లవాలు ఎందువల్ల విఫలమవుతాయి? అన్ని ఉద్యమాల వెనుక ఆశయాలు, భావాలు, నిర్వచనాలు ఉంటాయి. ఇవన్నీ వర్తమానంలో ఉండే పరిస్థితులను బాగుపరచాలనుకొనే ఆలోచనలు. ప్రతి ఆలోచన గతంతో ముడిపడి ఉంటుంది. మనం ఏ ఆలోచనను విశ్లేషించి చూసినా ఆ విషయం అర్థమవుతుంది. గతంలో ఉద్భవించి, గతంలోనే పరిభ్రమించే ఆలోచనలకు, వాటిద్వారా ప్రేరేపితం అయ్యే చేతలకు వర్తమానాన్ని మార్చే దక్షత ఉండదు. సంస్కర్తల, విప్లవకారుల ఆశయాలు, వారి వ్యూహాలు... గతంలో చిక్కుకుపోయిన ఆలోచనలు. గతంలో పుట్టి, వర్తమానాన్ని మార్చాలని అనుకొనే చేతలను 'ఖండిత చర్యలు' అంటారు కృష్ణ



మూర్తి. అవి పరస్పరం ఖండించుకుంటూ, గతానికీ, వర్తమానానికీ మధ్య జరిగే ఘర్షణలో శక్తిని కోల్పోతాయి. సంపూర్ణ చర్య దీనికి భిన్నమైనది. అది వర్తమానంలో పుడుతుంది. మనిషిని క్షణంలో, సంపూర్ణంగా మారుస్తుంది. "అలాంటి అంతర్పరివర్తన జరిగిన వ్యక్తులు పదిమందైనా చాలు, ఈ ప్రపంచాన్ని ఆమూలాగ్రం మార్చడానికి"అన్నారు కృష్ణమూర్తి.

ఆలోచనా ప్రక్రియను అర్థం చేసుకోవాలి...

'సంస్కరణలు విప్లవాలు మనిషిని, సమాజాన్ని మార్చగలవా?' అనేది కాదు అసలు ప్రశ్న. మనిషి గతంలో పరిభ్రమిస్తున్న ఆలోచనలను వదిలించుకొని, వర్తమానాన్ని దర్శించగలడా? గతాన్ని సంపూర్ణంగా అధిగమించిన దృక్పథానికి ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి ఉంటుంది. అంటే 'గతం, వర్తమానం, భవిష్యత్తు... ఇలా కాలం అంటే ఏమిటి? అది ఎలా ఉద్భవిస్తుంది? ఆలోచన గతంతో ఎలా ముడిపడి ఉంది?' అనే విషయాలను మనిషి ప్రప్రథమంగా అర్థం చేసుకోవాలి. అలాగే 'ఆలోచించడం' అనే ప్రక్రియని కూడా పూర్తిగా అర్థం చేసుకోవాలి. గతం ప్రభావంలో ఉండే ఆలోచన తెలివిని అంటే ప్రజ్ఞను ఉపయోగించుకుంటుంది. అందువల్ల తెలివి పరిమితం అవుతుంది. ఆలోచన తనను తానే ఖండించుకుంటుంది. అలాకాకుండా, మనిషి గతాన్ని నిశ్శేషంగా అధిగమించినప్పుడు... చైతన్యంలో అఖండమైన ప్రజ్ఞ ఉదయించి, ఆలోచన స్వభావం పూర్తిగా మారిపోతుంది. అనంతమైన, నిత్యనూతనమైన ఒక శక్తి విడుదలై... ఆలోచనను వినియోగిస్తుంది. ఈ ప్రక్రియను 'ప్రజ్ఞ యొక్క జాగృతి' అంటారు కృష్ణమూర్తి. ఇక్కడ కృష్ణమూర్తి చేసిన చర్చ... పతంజలి యోగ సూత్రాలమీద తెలిసో తెలియకో ఆయన చెప్పే ఒక భాష్యం. ఇదొక గమ్మత్తు. కృష్ణమూర్తిని కూలంకషంగా అర్థం చేసుకుంటే... పతంజలి యోగ సూత్రాలు అర్థమవుతాయి. పతంజలి యోగసూత్రాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే... కృష్ణమూర్తి గొడవ ఏమిటో తెలుస్తుంది.

• గుంటూరు వనమాలి
www.gunturu.de

అలాగైతేనే జీవితం పరిపూర్ణం

ధ్యానం ఒక క్రియ కాదు, 'ఏదీ చేయకపోవడం' అనే కళనే ధ్యానం అంటారు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే మీకు ధ్యానం తాలూకు అనుభూతి కలుగుతుంది. ఏదైనా పనిలో మనం నిమగ్నమైనప్పుడు మనస్సు అలిసిపోతుంది. ఎందుకంటే ఏకాగ్రత, ఆలోచన లేదా ఎలాంటి మానసిక కార్యకలాపమైనా... మన శారీరక శక్తిని హరించి, అలసట కలిగిస్తాయి. ధ్యానం మిమ్మల్ని అలసిపోనివ్వదు. అంతేకాదు. గాఢమైన విశ్రాంతిని కూడా అందిస్తుంది. ధ్యానం చేసే సమయంలో...



ప్రత్యేకం

> మనం నడవడం, పని చేయడం, మాట్లాడడం, చూడడం, వినడం, వాసన చూడడం, రుచి చూడడం, ఆలోచించడం మానేసినప్పుడు మాత్రమే నిద్ర వస్తుంది. అయితే శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోవడం. ఆహారం జీర్ణం కావడం, రక్త ప్రసరణ తదితర కొన్ని అసంకల్పిత కార్యకలాపాలు నిద్రలో కూడా కొనసాగుతాయి. అందుకే నిద్రలో సైతం మనకు పూర్తి విశ్రాంతి కలగదు.

మనం పంచేంద్రియాల ప్రభావానికి దూరంగా ఉంటాం. అంటే చూడడం, వినడం, వాసన చూడడం, రుచి చూడడం లాంటి పనులు చేయం. ధ్యానం నుంచి మనకు లభించే విశ్రాంతి... గాఢ నిద్రలా ఉంటుంది. కానీ ధ్యానం అనేది నిద్ర కాదు. అన్ని పనులను విడిచిపెట్టి విశ్రాంతి తీసుకోవడమే ధ్యానం.

ఆ తత్త్వమే చైతన్యశక్తి...

మనిషి చైతన్య శక్తిలో నాలుగు స్థితులు ఉంటాయి. అవి: జాగ్రదావస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ, ధ్యానావస్థ. నిద్రలో ఉన్నప్పుడు మీరు మేలుకొనే ఉంటారు, కానీ గాఢమైన విశ్రాంతిలో ఉంటారు. మనస్సు స్థిరంగా ఉన్నప్పుడే మీరు ధ్యానం చేయగలరు. శబ్దం నుంచి మౌనం వరకు, కదలిక నుంచి నిశ్చలత వరకూ చేసే ప్రయాణమే ధ్యానం. పనులు, ధ్యానం... ఈ రెండూ ఒకదానికొకటి భిన్నంగా అనిపించినప్పటికీ, అవి ఒకదానికి ఒకటి పూరకాలు. ఈ ప్రపంచంలో అన్నీ మారుతున్నాయని మనం గమనిస్తూ ఉంటాం. మనలో మారనిది ఏదో ఉంది. మనలో స్థిరంగా ఉండే తత్త్వాన్నే 'ఆత్మ' లేదా 'చైతన్యశక్తి' ఉంటారు. మన చైతన్య శక్తిలో ఎప్పుడూ స్థిరంగా ఉండే ఆ తత్త్వం వైపు మనం చేసే ప్రయాణమే ధ్యానం.

దేన్నీ వ్యతిరేకించకండి...

మనసులో కోరికలు ఉంటే మనం ధ్యానం చెయ్యలేం. అందుకే "అన్ని రకాల సంకల్పాలను విడిచిపెట్టేవరకూ మనస్సు శాంతించదు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఉదాహరణకు... మీరు నిద్రపోయేముందు లైటు ఆపాలని అనుకున్నారు. కానీ ఆపలేదు. మీరు నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా... లైటు ఆపనిదే నిద్రపోలేరు. మీ మనస్సు లైటు ఆపడం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అలాగే ఇసుక రేణువు మీ కంటిలో పడితే మీరు పూర్తిగా కళ్ళు మూసుకోలేరు, అలాగని కళ్ళు పూర్తిగా తెరిచి ఉంచలేరు. అదే విధంగా మనసులో ఉండే ఆలోచన విమ్మల్ని బాధిస్తూ ఉంటుంది. అందుకే మనస్సును శాంతిపజేయడానికి వైరాగ్యం అవసరం. ఏదో ఒక రోజు మృత్యువు రావడం అనివార్యం. మృత్యువుపట్ల జ్ఞానం మనసును శాంతింపజేస్తుంది, వైరాగ్యాన్ని ప్రసాదిస్తుంది. వైరాగ్యం గాఢమైన ధ్యానంలోకి వెళ్ళడానికి సహాయపడుతుంది. యోగాసనాలు, ప్రాణాయామం, సమతుల్యమైన ఆహారం, వివేకం... ఇవన్నీ ధ్యానం చక్కగా జరగడానికి సాయపడతాయి. చాలామంది ధ్యానం చేసేటప్పుడు ఎలాంటి శబ్దాలు ఉండకూడదని అనుకుంటారు. ఇది సరైన అవగాహన కాదు. ధ్యానం చేసేటప్పుడు శబ్దాలు వినిపిస్తే... వాటిని జాగ్రత్తగా వినండి. మీరు దేనినైతే ఎక్కువగా వ్యతిరేకిస్తారో... అది మరింత ప్రబలమై విమ్మల్ని బాధపెడుతుంది. కాబట్టి ధ్యానం చేసే సమయంలో దేనినీ వ్యతిరేకించకండి.

ఆహారాల్లో మూడు రకాలు

ధ్యానం బాగా జరగాలంటే ప్రాణాయామం చెయ్యాలి. ప్రాణాయామం మనసును స్థిరంగా ఉంచుతుంది. ధ్యానాన్ని సులభతరం చేస్తుంది. మనం తీసుకొనే ఆహారం కూడా ధ్యానంపై ప్రభావం చూపిస్తుంది. ఆహారంలో మూడు రకాలు ఉంటాయి, అవి: సాత్త్విక, రాజసిక, తామసిక ఆహారం. తామసిక ఆహారం శరీరంలో అలసటను, మగతను, జడత్వాన్ని కలిగిస్తుంది. శరీరంలో తమస్సు ఎక్కువగా ఉంటే... మీకు ధ్యానం చేసేటప్పుడు నిద్ర వస్తుంది. శరీరంలో రజస్సు ఎక్కువగా ఉంటే మనసు స్థిరంగా ఉండదు. చిన్న విషయాలకే ఎక్కువ బాధ లేదా అతిగా సంతోషం కలుగుతాయి. రజస్సు అసమతుల్యంగా ఉన్నప్పుడు ఎక్కువ ఆలోచనలు వస్తాయి. మనసు శాంతంగా ఉండదు. శరీరం స్థిరంగా ఉండదు. అలా ఉంటే ధ్యానం సరిగ్గా జరగదు. దీని అర్థం మీరు రాజసిక ఆహారాన్ని పూర్తిగా విడిచిపెట్టాలని కాదు. మనం ఎల్లప్పుడూ ప్రశాంతంగా, ఒకే స్థితిలో ఉంటే జీవితాన్ని ఆస్వాదించలేం. కొంచెం రజస్సు ఉండే జీవితం ఆసక్తికరంగా ఉంటుంది. కానీ రజస్సు ఎక్కువైతే సాత్త్విక ఆహారం తీసుకోవాలి. సాత్త్విక ఆహారం తేలికగా ఉంటుంది, సులభంగా జీర్ణం అవుతుంది. త్రిదోషాల నుంచి శరీరానికి విముక్తి కలిగించి, ధ్యానం బాగా కొనసాగడానికి సహాయపడుతుంది. ధ్యానం వల్ల జీవితంలో... భౌతిక, ఆధ్యాత్మిక స్థాయిల్లో పరిపూర్ణత వస్తుంది. అంటే జీవితం పరిపూర్ణం అవుతుంది. యోగా, ప్రాణాయామం, ధ్యానాలకు సంబంధించిన జ్ఞానం భారతదేశంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం మన అదృష్టం. ధ్యానాన్ని మీ దినచర్యలో భాగం చేసుకోండి.

• గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్

రేపు ప్రపంచ ధ్యాన దినోత్సవం

సహజయోగ

ధ్యానం ఎందుకు చేయాలి?

మన దేశం యోగభూమి. ఇందులో ప్రతి అణువు దైవికమైన చైతన్యంతో నిండి ఉంటుంది. యోగ, ధ్యానం భారతీయ సంస్కృతిలో అంతర్భాగాలు. అటువంటి ధ్యానానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కొన్నేళ్ళ క్రితం ప్రకటించింది. ఈ సందర్భంగా ధ్యానం అంటే ఏమిటి? దాన్ని ఎలా చెయ్యాలి? దానివల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? అనే అంశాల గురించి సహజ యోగ ధ్యాన పద్ధతిని ఆవిష్కరించిన శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ద్వారా తెలుసుకుందాం.


అదే మానవ జన్మ పరమార్థం

ధ్యానం అంటే మీరు మీ ఆత్మతో ఒకటిగా ఉండే స్థితి. ఆ స్థితి నిర్విచార స్థితిలో లభిస్తుంది. అందులోనే ఆత్మతత్త్వం వృద్ధి చెందుతుంది. నిర్విచార స్థితి అంటే ఆలోచనారహిత స్థితి. ధ్యానం భగవంతుడితో ఎంత సుందరమైన అనుబంధాన్ని ఏర్పరుస్తుందంటే... మన సమస్యలన్నీ ఆ ధ్యానావస్థలో వాటంతట అవే పరిష్కారమవుతాయి. ఎందుకంటే ధ్యానం మనల్ని మనం అంతర్గతంగా భగవంతుడికి సమర్పించుకొనే పూజ. మనల్ని మనం తెలుసుకోవాలంటే మనం ఇంకా సూక్ష్మంగా మారాలి. మన లోపలికి చూసుకోగలగాలి. అప్పుడే 'మనం ఆత్మ స్వరూపులం' అని తెలుస్తుంది. మానవుడి ఆధ్యాత్మిక ఉత్థానం కోసం... కుడి పార్శ్వం, ఎడమ పార్శ్వం కాకుండా... మధ్యే మార్గం అయిన సుషుమ్నా నాడిపై ప్రయాణం చేయాలని గ్రహించిన గోరఖ్‌నాథ్, ఆదినాథ్, మత్స్యేంద్రనాథ్ లాంటి యోగిపుంగవులు మన దేశంలో ఉండేవారు. వారు మానవుల సమస్యలను కూలంకషంగా అధ్యయనం చేశారు. మానవునిలో ఆధ్యాత్మిక ఉన్నతిని ఏ విధంగా సుసాధ్యం ఎలా చేయాలో శోధించి, ఒక పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు. మానవుల వెన్నెముక చివరి భాగంలో త్రికోణాకారంలో ఉండే సాక్రమ్ ఎముకలో అవశిష్టమై ఉన్న ఒక దివ్యశక్తిని వారు గుర్తించారు. ఇది అందరిలో జన్మతః ఉంటుంది. మానవులు సాధించాల్సిన అత్యున్నత స్థితి లేదా అంతిమ లక్ష్యం... శాశ్వతమైన ఆ శక్తిని కనుక్కోవడమే. అదే మనలోని ఆత్మ. ఆత్మతో మనం ఏకీకరణ కావడమే మానవ జన్మ పరమార్థం. అదే సహజయోగ మూల సూత్రం. మనం బాల్యంలో బాహ్యపరంగా ఆ దైవశక్తితో పూర్తి అనుసంధానత కలిగి ఉంటాం. కాని పెరిగి పెద్దయ్యాక... మనలో అరిషడ్వర్గాలు, ఆలోచనలు లాంటి అవరోధాలు పెరుగుతాయి. భగవంతుడితో బాహ్యమైన ఆ సంబంధాన్ని కోల్పోతాం.

ఆ మూడూ ఏకీకరణ చెందితే...

మనలోని కుండలినీ శక్తి జాగృతమై, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సర్వవ్యాపిత దివ్యశక్తితో అనుసంధానం కావాలి. అదే ఆత్మసాక్షాత్కారం. ఈ శక్తి మనలోపలే అంతర్గతంగా నిక్షిప్తమై ఉంది. కుండలినీశక్తి జాగృతం అయినప్పుడు, ఆ శక్తి ఆరు కేంద్రాలద్వారా పయనించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, పరమ చైతన్యశక్తితో అనుసంధానమైనప్పుడు... ఆ స్థితి మన భౌతిక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని పరిపుష్టం చేస్తుంది. సహజయోగ ధ్యానంలో ఇది సునాయాసంగా జరుగుతుంది.

> అలజడితో ఉన్న సరస్సు ఆకాశంలోని సూర్యుణ్ణి సరిగ్గా ప్రతిబింబించలేదు. అదే విధంగా ఆలోచనల సుడులు తిరుగుతున్న మనసు... సర్వవ్యాపితమైన దైవశక్తిని సరిగ్గా ప్రతిబింబించలేదు. కాబట్టి ఆలోచనలన్నిటినీ నిశ్శబ్దం చెయ్యాలి. తద్వారా ప్రశాంతతను పొందిన మనస్సు మన మెదడులో వివేకం కలిగిస్తుంది. అప్పుడు హృదయం, మెదడు, చిత్తం... ఈ మూడు ఏకీకరణ చెందుతాయి. మనం ఏ పనినైనా సమర్థవంతంగా చేయగలుగుతాం.



అదొక్కటే మార్గం...


'ధ్యానం సర్వార్థ సాధనమ్...' అంటే ధ్యానం వల్ల ఆధ్యాత్మిక ప్రయోజనాలు మాత్రమే కాకుండా... అనేక రకాల ప్రయోజనాలు లభిస్తాయి. అంతర్గతమైన, బాహ్యపరమైన ఎదుగుదల కలుగుతుంది. మనలోని చక్రనాడులన్నీ శక్తిమంతం కావడం వల్ల సద్గుణాలు పెంపొందుతాయి. తద్వారా మీతోపాటు మీ చుట్టూ ఉన్న సమాజం కూడా ప్రయోజనం పొందుతుంది. మీలో నిక్షిప్తమైన ఈ నిధిని సాధించడం ద్వారా మీ దుఃఖాలకు, సమస్యలకు అతీతంగా ఉంటారు. ధ్యానంలో స్థిరపడాలంటే... పసిపిల్లల్లో ప్రతిబింబించే అమాయకత్వం, నిర్మలత్వం మీలో ప్రతిఫలించాలి. ధ్యానం ద్వారా చిత్తం అంతర్ముఖంగా వెళ్ళి... లోపాలు సరిదిద్దుకొనే స్థాయికి చేరుకోవాలి. ధ్యానంద్వారానే ధర్మిక శక్తిని, విచక్షణ శక్తిని, క్షమాగుణాన్ని పెంపొందించుకోగలుగుతాం. మనకు సంతృప్తిని, శాంతిని, ప్రశాంతతను ఇవ్వాలని, సమాజహితమైన, ప్రపంచ మానవాళికి శ్రేయస్సు కలిగించే వాటిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించడానికి, ఆ వినతిని ఆయన దృష్టికి తీసుకువెళ్ళడానికి వాస్తవికమైన మార్గం ధ్యానం ఒక్కటే. మనం ప్రార్థనలో కోరుకొనే కోరికలకు ఆయన సమాధానం కానీ, పరిష్కారం కానీ ధ్యానం ద్వారానే దొరుకుతుందనేది సహజయోగ సాధకులు అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



ఆత్మను ఎవరైనా చూశారా?

పాయాసి తన రెండో వాదాన్ని సమర్థించుకుంటూ "ఒకవేళ ఈ లోకంలో చేసిన సత్కర్మల ఫలితం స్వర్గలోకంలోనే దొరికితే... ఆ ఫలాన్ని స్వర్గలోకంలోనే అనుభవించాలి కదా! వాటిని అనుభవించడానికి మళ్ళీ ఈ లోకానికి ఎందుకు రావాలి? అలాగే... పుణ్యకర్మలను ఆచరించే మానవులు ఆత్మహత్య ఎందుకు చేసుకోరు? ఆత్మహత్య ద్వారా వారు త్వరగా స్వర్గలోకానికి చేరుకొని, అక్కడ సకల భోగాలు అనుభవించవచ్చు కదా?" అని ప్రశ్నించాడు. అప్పుడు కుమార కాశ్యపుడు "మునుపు ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉండేవారు. మొదటి భార్యకు ఒక కొడుకు ఉన్నాడు. రెండో భార్య గర్భవతిగానే ఉంది. ఆ పరిస్థితుల్లో ఆ వ్యక్తి మరణించాడు. ఆ తరువాత మొదటి భార్య కొడుకు తన సవతి తల్లితో "ఈ ఇంట్లో నీదంటూ కించిత్తు ఆస్తి కూడా లేదు" అన్నాడు. తనకు కొడుకు పుడితే వాడికి కూడా ఆస్తిలో సగభాగం ఉంటుందనీ, అమ్మాయి పుడితే ఆ బిడ్డను పోషించే బాధ్యత పెద్ద భార్య కొడుకుదేననీ ఆమె చెప్పింది. కానీ ఆ పిల్లవాడు "ఈ ఇంట్లో నీదంటూ కించిత్తు ఆస్తి లేదు" అనే మాటను పదేపదే



ధర్మపథం

వల్లిస్తూ ఉండేవాడు. అతడి ప్రవర్తనతో భీతిల్లిన ఆమె ప్రసవ సమయం రాకముందే బిడ్డను కనాలని తన పొట్టను కోసుకుంది. ఫలితంగా ఆమె మరణించడమే కాదు, ఆమె గర్భంలోని శిశువు కూడా మృతి చెందింది. అందుకే ఓ రాజా! పుణ్యాత్ములు స్వర్గప్రాప్తికోసం త్వరపడరు. కర్మ పరిపాకం కోసం ప్రతీక్షిస్తూ, ప్రజలకు మేలు చేస్తూనే ఉంటారు" అని చెప్పాడు.

దాన్ని చూడలేరు...

ఆ తరువాత తన మూడోవాదాన్ని పాయాసి వినిపిస్తూ "ఒకవేళ ఆత్మే గనుక ఉన్నట్టైతే, అది శరీరం నుంచి బయటకు వెళ్ళిపోవడం వల్లే మరణం సంభవిస్తుందని భావిస్తే... మరి మరణం తరువాత మనిషి నుంచి ఆత్మ ఎక్కడి నుంచి, ఎలా బయటకు వెళుతుంది? దీన్ని ఎవరైనా చూశారా? మరణించే మనిషిని గమనిస్తున్నప్పుడు... ఆత్మ ఎప్పుడు, ఎలా బయటకు వెళుతుంది? శరీరంలోని ఏ అంగం ద్వారా బహిర్గతం అవుతుంది? అనే విషయం అంతుపట్టదు. పైగా ఆత్మ శరీరాన్ని వదిలిన తరువాత... మరణించిన వ్యక్తి శరీరం తేలిక కావడానికి బదులు మరింత బరువవుతుంది" అన్నాడు. ఈ వాదాన్ని కుమార కాశ్యపుడు ఖండిస్తూ "మరణ సమయంలో ఆత్మ బయటకు వెళుతుంది. కానీ దాన్ని ఎవరూ చూడలేరు. అది ఎలా అంటే... స్వప్నంలో జీవుడు రకరకాల స్థలాలలో పరిభ్రమిస్తూ... తనకు ఇష్టం వచ్చినదాన్ని చూస్తాడు. తనకు ఇష్టం వచ్చిన దానిలోకి వెళ్తాడు. కానీ అతణ్ణి ద్వారపాలకుడు కానీ, తోటమాలి కానీ ఆపలేదు సరికదా... కనీసం చూడనైనా లేరు. అలాగే ప్రాణం, శ్వాస, జ్ఞానేంద్రియాలతో కూడి ఉన్నప్పుడు శరీరం తేలికగా ఉంటుంది. కానీ అవి లేనప్పుడు బరువెక్కిపోతుంది. ఇలా వీటి ఆధారంగా జీవుడు పరలోకానికి వెళ్ళడు, అసలు 'పరలోకం లేదు' అనడం మూర్ఖత్వం అన్నాడు. అయితే ఇక్కడ కుమార కాశ్యపుడు ఆత్మకు బదులు ఆయుర్విజ్ఞాన వాయువులను పేర్కొన్నాడు. వాటిని 'ఆత్మ' అని అనలేదు. ఆత్మ లేదని కూడా చెప్పలేదు. కానీ పరలోకాల గురించి చాలా దృఢంగా ప్రతిపాదించాడు. అతని మాటల్లో స్థవిరవాదుల సిద్ధాంతం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాచీన బౌద్ధులు శరీరాంతర్గతమైన చైతన్యాన్ని సూటిగా కాకుండా మరో విధంగా ఒప్పుకున్నారు. కాగా పాయాసి మళ్ళీ తన సిద్ధాంతాన్ని చైతన్యం ఆధారంగా సమర్థించుకోవాలని ప్రయత్నించాడు. "ఇంద్రియాలన్నీ ఉన్నా మరణం ఆసన్నమైన వ్యక్తి ఎందుకు చూడలేదు, వినలేదు, మాట్లాడలేదు?" అని ప్రశ్నించాడు.

> పాయాసి పునర్జన్మ సిద్ధాంతాన్ని ఎలాంటి సాధన లేకుండానే తెలుసుకోవాలనుకున్నాడు. కాబట్టి ఆ విషయం అతనికి అర్థం కాలేదు. అందుకే అతను పాలీ సాహిత్యంలో ఒక మిథ్యా వాదిగా, భౌతిక వాదిగా విఎగిలిపోయాడు. బుద్ధ భగవానుడి శిష్యులు నాస్తికతను, భౌతికతను ఖండించి, సమాజంలో ఆస్తికతను పెంపొందించారు. దానికి పాయాసి- కుమార కాశ్యపుల వృత్తాంతం బలమైన నిదర్శనం.

అప్పుడు కుమార కాశ్యపుడు "శంఖానికి ధ్వనించే శక్తి ఉన్నా... ఒక వ్యక్తి దాన్ని తీసుకొని ఊదేవరకూ ధ్వనించదు. అదే విధంగా శరీరంలో ఆయువు, శ్వాస, విజ్ఞానం ఉన్నప్పుడే దానిలో చలనం ఉంటుంది. ఇవన్నీ శరీరంలో ఉన్నప్పుడే ఇంద్రియాలు తమతమ విషయాలను గ్రహించగలుగుతాయి" అని చెప్పాడు.

పద్ధతి సరైనది కాకపోతే...

చివరిగా... జీవుడు శరీరం నుంచి వేరయ్యే దృశ్యాన్ని చూడాలని పాయాసి అనుకున్నాడు. మరణం దగ్గరపడిన ఒక వ్యక్తిని ఖండ ఖండాలుగా నరికి, ఆత్మ శరీరం నుంచి ఎలా బహిర్గతం అవుతుందో చూడడానికి ప్రయత్నించాడు. కానీ అతని ప్రయత్నం విఫలమైంది. జీవుడు కనిపించలేదు. దాంతో అతనిలోని నాస్తికత ఇంకా దృఢపడింది. పాయాసి నాస్తికతను పోగొట్టడానికి బుద్ధుడి శిష్యుడైన కుమార కాశ్యపుడు చాలా ప్రయత్నించాడు. అగ్ని ప్రజ్వలించే ప్రక్రియను ఉదాహరిస్తూ "అరణ్యంలో ఉండే ఒక అగ్ని ఉపాసకుడికి ఒక పిల్లవాడు లభించాడు. ఆ పిల్లవాణ్ణి అతను పెంచాడు. ఆ బాలుడు పెరిగి పన్నెండేళ్ళ వయసువాడయ్యాడు. ఒక రోజు ఆ అగ్ని ఉపాసకుడు దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్తూ, తన అగ్ని ప్రజ్వలన కార్యాన్ని పిల్లవాడికి అప్పగించాడు. అగ్ని ఒకవేళ ఆరిపోతే... ఈ కర్రలు సమిధులు తదితరాలను ఉపయోగించి మళ్ళీ ప్రజ్వరిల్లజేయమన్నాడు. అతను వెళ్ళాక ఆ పిల్లవాడు ఆటలలో మునిగి అగ్నిహోత్రాన్ని పట్టించుకోకపోవడంతో... అది చల్లారిపోయింది. దాన్ని రాజెయ్యడానికి అతను ప్రయత్నించినప్పటికీ, అతను అనుసరించిన పద్ధతి సరైనది కాకపోవడంతో ఫలితం లేకపోయింది. కొద్దిరోజుల తరువాత ఆ అగ్ని ఉపాసకుడు తిరిగి వచ్చాడు, అగ్ని చల్లారిన విషయం గ్రహించాడు. ఆ పిల్లవాడితో "నీకు అగ్ని పుట్టించే పద్ధతి తెలియదు. అందుకే నీవు చేయలేకపోయావు" అన్నాడు. తరువాత అరణులను ఉపయోగించి త్వరగా అగ్నిని వెలిగించాడు. కాబట్టి ఓ రాజా! నువ్వు కూడా అవివేకి అయిన బాలుడిలా... సరైన పద్ధతి లేకుండా పరలోకాన్ని అన్వేషిస్తున్నావు. ఈ వ్యర్థమైన పరలోక చింతనలో నీ జీవితం దుఃఖమయం అయిపోగలదు" అంటూ పాయాసి వాదనలన్నిటినీ ఖండించాడు. పరలోకం ఉందని, పాపపుణ్యాలు, వాటి ఫలితాలు ఉన్నాయని నిరూపించాడు.

(**ఆధారం:** 'సుత్తపిటకం'లోని ప్రథమ నికాయమైన 'దీఘనికాయం'లో భాగమైన పాయాసి రాజ సుత్తము)



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు, న్యూఢిల్లీ.
91 98189 69756

బిజినెస్

హ్యుండయ్ కార్లకు అమరాన్ ఏజీఎం బ్యాటరీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) కూడా ఆత్మనిర్భర భారత్ బాట పట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం నుంచి తన కార్లలో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) అభివృద్ధి చేసిన అబ్జార్బెంట్ గ్లాస్ మ్యాట్ (ఏజీఎం) బ్యాటరీ టెక్నాలజీని ఉపయోగించనుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ ఏజీఎం బ్యాటరీ టెక్నాలజీని దేశంలోని ఒక కార్ల కంపెనీ ఉపయోగించడం ఇదే మొదటిసారి. సంప్రదాయ కంప్లీట్ మెయింటెన్స్ ఫ్రీ (సీఎంఎఫ్) బ్యాటరీలతో పోలిస్తే ఏజీఎం బ్యాటరీల పనితీరు అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ 150 శాతం ఎక్కువగా ఉండడంతో హ్యుండయ్ మోటార్స్ ఈ నిర్ణయం తీసుకుంది. బీఎస్6 ఫేజ్ 2 ప్రామాణికాలకు అనుగుణంగా తమ ఏజీఎం బ్యాటరీలను అభివృద్ధి చేసినట్టు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఈడీ హర్షవర్ధన గౌరినేని తెలిపారు.

ఈవీలపై సుంకాలు పెంచితే కష్టమే



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాలపై సుంకాలు పెంచితే విద్యుదీకరణ ప్రయాణానికి అవరోధం ఏర్పడుతుందని కియా ఇండియా సీఈఓ గ్వాంగ్ లీ అన్నారు. కొత్త ఎస్‌యూవీ సిరోస్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది కార్ల అమ్మకాల్లో 17 శాతం వృద్ధిని తాము ఆశిస్తున్నట్టు చెప్పారు. దేశంలో ఈవీల ధరలు ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పన్ను ప్రోత్సాహకం లేకపోతే మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆవేదన ప్రకటించారు. ప్రస్తుతం దేశీయ విపణిలో రెండు ఈవీ మోడళ్లు విక్రయిస్తోంది. ఈవీ 6 ప్రారంభ ధర రూ.60.96 లక్షలు. అలాగే ఈవీ 9 ప్రారంభ ధర రూ.1.3 కోట్లుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,130 ▼	70,070 ▼	99,000 ▼
విజయవాడ	78,800 ▼	72,300 ▼	92,000 ▲
విశాఖపట్నం	76,190 ▼	69,840 ▼	88,120 ▼
రాజమండ్రి	77,127 ▼	71,700 ▲	91,800 ▼
ప్రొద్దుటూరు	78,250 ▼	72,460 ▼	89,600 ▼
ముంబై	76,013 ▼	69,628 ▼	87,035 ▼

ఫెడ్ షాక్‌కు మార్కెట్లు కుదేలు

తొలిసారి 85 కన్నా దిగజారిన రూపాయి

బులియన్‌దీ అదే దారి





80,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: వచ్చే ఏడాది వడ్డీ రేట్ల కోత కేవలం రెండు విడతల్లోనే ఉంటుందని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్ చేసిన వ్యాఖ్య ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపివేసింది. భారత ఈక్విటీ, బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా అదే ధోరణిలో స్పందించి తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తొలిసారిగా 85 కన్నా దిగజారి మరో రికార్డు కనిష్ఠానికి పడిపోయింది.

సెన్సెక్స్ 965 పాయింట్లు డౌన్

ఈక్విటీ మార్కెట్ ఫెడ్ ప్రభావానికి తీవ్రంగా లోనయింది. భారీ అమ్మకాల ఒత్తిడి, విదేశీ నిధుల తరలింపుతో కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, ఐటీ షేర్లు భారీ నష్టాలు నమోదు చేశాయి. వరుసగా నాలుగో రోజు కూడా నేలచూపులే చూసిన ఈక్విటీ సూచీలు మానసిక అవధులు 80,000 (సెన్సెక్స్), 24,000 (నిఫ్టీ) కన్నా దిగువనే ముగిశాయి. సెన్సెక్స్ 964.15 పాయింట్ల నష్టంతో 79,218.05 వద్ద, నిఫ్టీ 247.15 పాయింట్ల నష్టంతో 23,951.70 వద్ద క్లోజయ్యాయి. నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 2915.07 పాయింట్లు, నిఫ్టీ 816.60 పాయింట్లు నష్టపోయాయి.

రూ.9.65 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈక్విటీ మార్కెట్ల భారీ పతనంతో నాలుగు రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.9.65 లక్షల కోట్ల మేరకు ఆవిరైపోయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.9,65,935.96 కోట్ల మేరకు దిగజారి రూ.4,49,76,402.63 కోట్లకు (5.29 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్ మినహా మిగతా 27 కంపెనీలు భారీగా నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.30 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.28 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో కూడా ఒక్క హెల్త్‌కేర్ సూచీ మినహా మిగతా అన్ని సూచీలు నష్టాల్లోనే ట్రేడయ్యాయి.

జీవితకాల కనిష్ఠానికి రూపాయి

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి జీవితకాల కనిష్ఠానికి దిగజారింది. గురువారం ట్రేడింగ్‌లో అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి 19 పైసలు దిగజారి 85.13 వద్ద స్థిరపడింది. రూపాయి 85 స్థాయి కన్నా దిగజారడం ఇదే ప్రథమం. ట్రేడింగ్ ప్రారంభంలోనే 85 కన్నా దిగువన ప్రారంభమైన రూపాయి రోజంతా అదే ధోరణిని కొనసాగిస్తూ కనిష్ఠ స్థాయి 85.14ని తాకింది. అమెరికన్ ఫెడరల్ చైర్మన్ జెరోమ్ పోవెల్ వడ్డీ రేట్ల విషయంలో ప్రకటించిన కఠిన వైఖరితో డాలర్ విలువ పరుగు తీయడం వర్ధమాన మార్కెట్ల కరెన్సీలపై ఒత్తిడిని పెంచాయి. దీనికి తోడు ఈక్విటీ మార్కెట్ల నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్ రూపాయి క్షీణతకు ఆజ్యం పోశాయి.

నెల రోజుల్లోనే ఎన్ఎఫ్ఓల నిధుల పెట్టుబడి

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. న్యూ ఫండ్ ఆఫర్స్ (ఎన్ఎఫ్ఓ) ద్వారా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) సేకరించే నిధులను ఆ ఫండ్ నిబంధనలకు అనుగుణంగా నెల రోజుల్లో పెట్టుబడులు పూర్తి చేయాలని కోరింది. లేకపోతే ఎగ్జిట్ చార్జీలు లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ మదుపరులకు కల్పించింది. ఇటీవల మార్కెట్‌కు వస్తున్న ఎన్ఎఫ్ఓల ద్వారా ఎంఎఫ్‌లు పెద్ద మొత్తంలో నిధులు సమీకరిస్తున్నాయి. అయితే ఫండ్ మేనేజర్లు ఆ నిధులను నిర్దేశిత గడువులోగా, పథకం లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టలేక పోతున్నారు. దీని వల్ల మదుపరులు నష్టపోతున్నారు. దీంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

HDFC securities — వచ్చే ఏడాదిపై భారీ అంచనాలు వద్దు

కొన్ని సంవత్సరాలుగా అద్భుతమైన బుల్‌రన్ సాధిస్తూ వచ్చిన ఈక్విటీ మార్కెట్‌పై 2025 సంవత్సరానికి భారీ ఆశలు పెట్టుకోవద్దని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఇన్వెస్టర్లకు సూచించింది. ప్రస్తుతం 23,951.70 వద్ద నిఫ్టీ వచ్చే ఏడాది చివరికి 26,482 పాయింట్ల వద్ద స్థిరపడవచ్చని అంచనా వేసింది. అయితే ఇతర సాధనాలతో పోల్చితే ఈక్విటీ మార్కెట్ మెరుగైన ఫలితాలనే సాధిస్తుందని కంపెనీ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి అన్నారు. భారత దీర్ఘకాలిక వృద్ధిగాథ యథాతథంగానే ఉన్నదని అభిప్రాయపడ్డారు. "ఈక్విటీ మార్కెట్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన రాబడులు అందించింది. కాని 2025లో ఒక మోస్తరు రాబడులకే ఇన్వెస్టర్లు సిద్ధం కావాలి" అని ఆయన సూచించారు. 2024లో ఇప్పటివరకు నిఫ్టీ 10.22 శాతం లాభపడింది. 2020 తర్వాత మార్కెట్లో ప్రవేశించిన ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో భారీ కరెక్షన్ ఏదీ చవి చూడలేదన్నారు. ప్రస్తుత వాతావరణంలో మిడ్‌క్యాప్‌లు, స్మాల్‌క్యాప్‌ల కన్నా లార్జ్‌క్యాప్‌ల పైనే దృష్టి సారించాలని, పెట్టుబడిలో 67 శాతం పెద్ద కంపెనీల షేర్ల కొనుగోలుకే కేటాయించాలని సూచించారు. గత రెండు మూడేళ్లుగా 80 శాతం స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు ఇన్వెస్టర్లకు మెరుగైన లాభాలందించాయని, కొత్త సంవత్సరంలో అలాంటి కంపెనీల సంఖ్య 20 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల వృద్ధి 4 శాతం నుంచి 17 శాతానికి పెరగవచ్చని సూచించారు. వచ్చే ఏడాదికి తాము పెద్ద బ్యాంకులు, అగ్రశ్రేణి ఐటీ కంపెనీలు, యంత్రపరికరాలు, సిమెంట్, భవన నిర్మాణ సామగ్రి రంగాలపై సానుకూల వైఖరితో ఉన్నామని, ఆటో, కన్స్యూమర్ స్టేపుల్స్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాలపై నెగిటివ్ దృక్పథంతో ఉన్నామని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సంస్థాగత పరిశోధనా విభాగం హెడ్ వరుణ్ లోచాబ్ చెప్పారు.

దిగజారిన బంగారం, వెండి ధరలు

ఫెడ్ షాక్‌కు బులియన్ మార్కెట్ కూడా ప్రభావితం అయింది. ఢిల్లీ మార్కెట్లో మేలిమి బంగారం (99.9 స్వచ్ఛత) ధర 10 గ్రాములు రూ.800 దిగజారి రూ.78,300 పలికింది. ఆభరణాల బంగారం (99.5 శాతం స్వచ్ఛత) ధర సైతం అంతే మొత్తంలో తగ్గి రూ.77,900కి దిగజారింది. వెండి ధర కూడా కిలో రూ.2,000 దిగజారి రూ.90,000 పలికింది.

హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.710 దిగజారి రూ.77,130 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1280 దిగజారి రూ.70,070 వద్ద నిలిచాయి. కిలో వెండి ధర రూ.1,000 తగ్గి రూ.99,000 పలికింది.

2025లోనూ నియామకాల జోరు

ఫౌండిట్

ముంబై: వచ్చే ఏడాది (2025) మన దేశంలో నియామకాల జోరు కొనసాగనుంది. 2024తో పోలిస్తే నియామకాల వృద్ధి రేటు 9 శాతం వరకు ఉంటుందని కంపెనీలకు నియామకాల సేవలు అందించే ఫౌండిట్ అనే సంస్థ తెలిపింది. ఈ సంవత్సరం నమోదైన 10 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే ఇది ఒక శాతం తక్కువ. ఐటీ, రిటైల్, టెలికా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీలు కొత్త ఏడాదిలో కూడా నియామకాల్లో ముందుంటాయని అంచనా వేసింది. నవంబరులో భారత్‌లో నియామకాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మూడు శాతం పెరిగినట్టు ఫౌండిట్ తెలిపింది. సరికొత్త టెక్నాలజీలు, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలతో వచ్చే ఏడాది మన దేశంలో నియామకాల స్వరూపం మరింత మారనుందని పేర్కొంది.

ముఖం స్కాన్‌తో 25 రకాల ఆరోగ్య పరీక్షలు

ఏఐ ఆధారిత పరీక్షను ఆవిష్కరించిన ఏసియానా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ఏసియానా.. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆరోగ్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చింది. డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లకుండానే సాధారణ ఆరోగ్య ప్రొఫైల్‌ను కేవలం ముఖాన్ని స్కాన్ చేయటం ద్వారా పొందవచ్చని ఏసియానా సీఈఓ కిశోర్ కారుమంచి వెల్లడించారు. కంపెనీ రూపొందించిన సియానా హెల్త్ యాప్ ద్వారా ముఖాన్ని 30 సెకన్లు స్కాన్ చేసి 25 రకాల ఆరోగ్య సేవల నివేదిక అందుకోవచ్చన్నారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), కార్డియోవాస్క్యులర్ రిస్కులు, పని ఒత్తిడి, టైప్ 2 మధుమేహం రిస్క్, రక్తపోటు వంటి వివరాలను స్కాన్ చేసిన కొద్ది సెకన్లలోనే సియానా హెల్త్ యాప్ అందిస్తుందని తెలిపారు. ఈ ఏఐ ఆధారిత జెనీవా ఫేస్ స్కాన్ టెక్నాలజీని కెనడాకు చెందిన కంపెనీ నుంచి అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ టెక్నాలజీని ఇప్పటికే పలు హెల్త్‌కేర్ సంస్థలు వినియోగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా వైద్యులు, డయాగ్నోస్టిక్ లేబొరేటరీస్‌ను రోగులు సంప్రదించే విధంగా ప్రత్యేక ఫీచర్లను పొందుపరిచినట్లు కిశోర్ తెలిపారు. ఏఐ ఆధారిత అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ జన్యు సంబంధిత ఇన్‌సైట్స్‌తో సియానా హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానం చేసినట్లు చెప్పారు. జన్యు సంబంధిత పరీక్షల వివరాలను తమ ప్లాట్‌ఫామ్‌పై అప్‌లోడ్ చేయటం ద్వారా ముందు రాబోయే వ్యాధుల గురించి తెలుసుకునే వీలుండటమే కాకుండా ఆ రుగ్మతలను కట్టడి చేసే అవకాశం ఉంటుందన్నారు. కాగా జెనటిక్స్ ఆధారిత వెల్‌నెస్ కార్యక్రమాన్ని రూ.22,000-రూ.30,000 ధరతో కంపెనీ అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	600
వరంగల్	572	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	102
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	90
కర్నూలు	91	నెల్లూరు	90
విశాఖపట్నం	108	అనంతపురం	90
గోదావరి	99		

స్పోర్ట్స్

అశ్విన్ బాటలో రోహిత్, కోహ్లీ?



న్యూఢిల్లీ: సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అశ్విన్.. అంతర్జాతీయ కెరీర్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడం ఫ్యాన్స్‌ను షాక్‌కు గురి చేసింది. అయితే, ఇది ఆరంభం మాత్రమేనని.. మరికొన్ని రోజుల్లో ఇంకొందరు స్టార్ ప్లేయర్లు కూడా వీడ్కోలు పలుకుతారన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన వెంటనే రోహిత్, కోహ్లీ, జడేజా పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతోనే అది మొదలైంది. ఇప్పుడు ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిసేలోపు మరికొన్ని రిటైర్మెంట్లు ఉంటాయని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రోహిత్, కోహ్లీ ప్రదర్శన ఏమాత్రం ఆకట్టుకోవడం లేదు. వీరిద్దరూ జట్టుకు భారంగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు విరాట్ లండన్‌లో స్థిరపడతాడనే వార్తలు కూడా వినవస్తున్నాయి. ఈ పరిణామాలను గమనిస్తే అశ్విన్ బాటలోనే రోహిత్, కోహ్లీ కూడా నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఘోరపరాజయం తర్వాత బీసీసీఐ కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవాలనుకొంటోంది. ఈ నేపథ్యంలో భారంగా మారిన ఆటగాళ్ల భవితవ్యం తేల్చడానికి చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌ను ఏకంగా నెలరోజుల పాటు ఆస్ట్రేలియాలోనే ఉండి పని చక్కబెట్టాలని ఆదేశించడంలో మర్మం అర్థమవుతోంది. ఆసీస్‌తో మిగిలిన మరో రెండు టెస్ట్‌లు ముగిసే సరికి ఆయా ఆటగాళ్లు ఎవరో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. రోహిత్ అసహనం చూస్తుంటే .. కెప్టెన్‌గా ఇదే అతడి చివరి సిరీస్‌గా కనిపిస్తోంది. అనిల్ కుంబ్లే, గంగూలీ కూడా కెరీర్ ఉచ్ఛదశలో ఉన్నప్పుడే అశ్విన్ తరహాలో గౌరవంగా తప్పుకొన్నారు. ఎంతో కాలంగా భారత జట్టుకు మూలస్తంభాలైన రోహిత్, కోహ్లీ కూడా ఇదే బాటను అనుసరించే అవకాశాలున్నాయి. అయితే, ఏం జరగనుందో తెలియాలంటే మాత్రం మరికొన్ని రోజులు ఓపిక పట్టాల్సిందే.

భారత్‌కు విరాట్ బై..బై..!

లండన్‌లో స్థిరపడనున్న స్టార్ క్రికెటర్

కోహ్లీ కోచ్ వెల్లడి

న్యూఢిల్లీ: క్రికెట్ కెరీర్ చరమాంకంలో ఉన్న విరాట్ కోహ్లీ త్వరలో ఆటకు వీడ్కోలు పలకడం ఖాయం. అయితే విరాట్ భవిష్యత్‌లో భారత్‌లో నివసించబోవడం లేదట. తన భావి జీవితాన్ని లండన్‌లో గడపాలని కోహ్లీ నిర్ణయం తీసుకున్నాడు. ఈ విషయాన్ని అతడి కోచ్ రాజీవ్ శర్మ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 'విరాట్ తన పిల్లలు వామిక, అకాయ్, భార్య అనుష్క శర్మతో కలిసి లండన్ వెళ్లిపోవాలని ఇప్పటికే నిర్ణయించుకున్నాడు. త్వరలో అతడు దేశం వీడి అక్కడ స్థిరపడనున్నాడు' అని రాజీవ్ తెలిపాడు. విరాట్, అనుష్క కలిసి లండన్‌లో ఓ మేనేజ్‌మెంట్ సంస్థను నడుపుతున్నాడట.

ఆసీస్ మీడియాతో వాగ్వాదం..

ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్ట్‌లో తలపడేందుకు భారత జట్టు గురువారం మెల్‌బోర్న్ చేరుకుంది. భార్య కూతురు, కుమారుడితో కలిసి విరాట్ విమానాశ్రయంనుంచి బయటకి రావడాన్ని గమనించిన కెమెరామన్లు తమ కెమెరాలను అతడివైపు తిప్పారు. దాంతో ఆగ్రహించిన విరాట్ వారి వద్దకు వచ్చిన చానెల్ 9 టీవీ మహిళా ప్రతినిధితో వాగ్వాదానికి దిగాడు. 'నాకు, నా పిల్లలకు గోప్యత ఉండాలి. నా అనుమతి లేకుండా ఫొటోలు ఎలా తీస్తారు' అని ఆమెను కోహ్లీ నిలదీశాడు. అయితే తాము అతడి కుటుంబాన్ని ఫొటో తీయలేదని కెమెరామన్లు చెప్పడంతో..శాంతించిన విరాట్ వారితో కరచాలనం చేసి వెళ్లిపోయాడు.



హైబ్రిడ్ పద్ధతిలోనే..

తటస్థ వేదికపై భారత్ X పాక్ పోరు

చాంపియన్స్ ట్రోఫీపై ఐసీసీ



దుబాయ్: కొంతకాలంగా చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై నెలకొన్న ప్రతిష్ఠంభన తొలగింది. వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరిగే ఈ మెగా వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిన నిర్వహించనున్నట్టు ఐసీసీ ప్రకటించింది. దీంతో భారత్-పాక్ మధ్య మ్యాచ్‌లు తటస్థ వేదికపై జరుగనున్నాయి. అలాగే భారత్‌లో జరిగే 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్, 2026 పురుషుల టీ20 వరల్డ్‌కప్, 2027 చాంపియన్స్ ట్రోఫీతో పాటు పాక్ నిర్వహించే మహిళల టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. అప్పుడు కూడా ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లు తటస్థ వేదికలపైనే జరుగుతాయని తేల్చింది. 'ప్రస్తుత సీజన్ (2024-2027)లో భారత్-పాక్ జట్లు ఐసీసీ టోర్నీల్లో ఆడే అన్ని మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో జరిపేందుకు ఆమోదించాం. త్వరలోనే టోర్నీ షెడ్యూల్‌ను కూడా వెల్లడిస్తాం' అని ఐసీసీ ప్రకటించింది. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న భారత-పాక్‌ల మధ్య జరిగే మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమవుతుందని సమాచారం. భద్రతా కారణాల రీత్యా భారత క్రికెట్ జట్టు పాక్‌లో పర్యటించేందుకు బీసీసీఐ అంగీకరించని విషయం తెలిసిందే. అటు కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతినివ్వకపోవడంతో, టోర్నీని హైబ్రిడ్ పద్ధతిన నిర్వహించాలని భారత్ కోరింది. అటు పాక్ మాత్రం దీనికి అంగీకరించలేదు. దీంతో కొద్ది రోజులుగా ఈ టోర్నీ నిర్వహణపై సస్పెన్స్ కొనసాగుతోంది. చివరకు పాక్‌ను హైబ్రిడ్ పద్ధతికి ఒప్పించడంతో కథ సుఖాంతమైంది.

యూఏఈలో చాన్స్!

టోర్నీ ఆద్యంతం పాక్‌లోనే నిర్వహించాలని పట్టుబట్టినా ఎట్టకేలకు హైబ్రిడ్ పద్ధతికి ఆ దేశ క్రికెట్ బోర్డు పచ్చజెండా ఊపింది. అయితే ఇప్పుడు భారత్‌తో పాక్ మ్యాచ్‌లు ఎక్కడ జరుగుతాయనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తిరేపుతోంది. రేసులో శ్రీలంక, యూఏఈ ఉన్నప్పటికీ ఐసీసీ మాత్రం ఎడారి దేశం వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఎందుకంటే ఇప్పటికే ఇక్కడ ఐపీఎల్, టీ20 వరల్డ్‌కప్‌లాంటి మెగా టోర్నీలు విజయవంతంగా జరిగాయి. దీనికి తోడు దుబాయ్, షార్జా, అబుధాబిలలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలున్నాయి. అలాగే భారత్-పాక్ అభిమానులు కూడా సులువుగా ఇక్కడికి చేరుకోగలరు. అన్నింటికన్నా ముఖ్యంగా ఐసీసీ చైర్మన్ జైషాకు యూఏఈ నిర్వహణ సామర్థ్యంపై చక్కటి గురి ఉండడం కూడా ఓ కారణం కానుంది.

మంధాన, రిచా ధనాధన్!

మనదే సిరీస్

మూడో టీ20లో వెస్టిండీస్ చిత్తు



ముంబై: సిరీస్‌లో వరుసగా మూడో హాఫ్ సెంచరీతో తాత్కాలిక కెప్టెన్ స్మృతీ మంధాన (47 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 77) మెరవగా..యువ బ్యాటర్ రిచా ఘోష్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 54) పొట్టి ఫార్మాట్‌లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసింది. దాంతో వెస్టిండీస్‌పై ఆఖరి టీ20లో భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 60 పరుగులతో ఘన విజయం అందుకున్న భారత్ సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. గత ఐదేళ్ల కాలంలో భారత గడ్డపై టీమిండియాకిదే తొలి టీ20 సిరీస్ విజయం. తొలుత మన అమ్మాయిలు 20 ఓవర్లలో 217/4 స్కోరు సాధించారు. మంధాన, రిచాకు తోడు జెమీమా (39), రాఘవీ బిస్త్ (31 నాటౌట్) రాణించారు. భారీ ఛేదనలో వెస్టిండీస్ 20 ఓవర్లలో 157/9 స్కోరుకే పరిమితమైంది. హెన్రీ (43) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రిచా, 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా మంధాన నిలిచారు.

1 ఈ ఏడాది టీ20లలో అత్యధిక పరుగులు (23 మ్యాచ్‌లు, 763 రన్స్) చేసిన బ్యాటర్‌గా మంధాన.

217/4 టీ20లలో భారత్ అత్యధిక స్కోరు

రిచా వరల్డ్ రికార్డ్: కీపర్ రిచా ఘోష్ మహిళల టీ20లలో వరల్డ్ రికార్డును సమం చేసింది. 18 బంతుల్లో 50 పరుగులు చేసిన 21 ఏళ్ల రిచా.. అతి తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా సోఫీ డివైన్ (న్యూజిలాండ్), లిచ్‌ఫీల్డ్ (ఆస్ట్రేలియా)తో కలిసి అగ్రస్థానంలో నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్ 20 ఓవర్లలో 217/4 (మంధాన 77, రిచా ఘోష్ 54, జెమీమా 39); వెస్టిండీస్ 20 ఓవర్లలో 157/9 (హెన్రీ 43, రాధా యాదవ్ 4/29).

మా వాడిని అవమానించారు

అశ్విన్ తండ్రి



చెన్నై (ఆంధ్రజ్యోతి): మాజీ ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ రిటైర్మెంట్‌పై అతడి తండ్రి రవిచంద్రన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అవమానాలు భరించలేకే తన కుమారుడు ఇంత త్వరగా ఆటకు వీడ్కోలు పలికాడని చెప్పాడు. 'అశ్విన్ నిర్ణయం నాకు చివరి నిమిషంలోనే తెలిసింది. అయితే ఇలాంటిది జరుగుతుందని ముందే ఊహించా. ఎందుకంటే మా వాడిని వేధిస్తున్నారు. ఎంతకాలమని భరించగలడు? అందుకే రిటైర్మెంట్ ప్రకటించాడు' అని రవిచంద్రన్ తెలిపాడు. అయితే అశ్విన్‌ను అవమానించిన వారెవరో ఆయన చెప్పలేదు. మరోవైపు తన తండ్రికి మీడియాతో ఎలా మాట్లాడాలో తెలీదని, ఆయన కామెంట్స్‌ను పట్టించుకోవద్దని అశ్విన్ చెప్పాడు.

స్వదేశం చేరిన అశ్విన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్ గురువారం ఉదయం స్వదేశంలో అడుగుపెట్టాడు. చెన్నై విమానాశ్రయం నుంచి నేరుగా స్వగృహానికి చేరుకున్న అశ్విన్‌పై కుటుంబసభ్యులు, సన్నిహితులు పూలవర్షం కురిపిస్తూ.. బాజా భజంత్రీలతో సాదర స్వాగతం పలికారు.

ఘనంగా ఫేర్‌వెల్ దక్కాల్సింది: కపిల్

న్యూఢిల్లీ: అశ్విన్ రిటైర్మెంట్ షాక్‌కు గురి చేసిందని, అలాగే అతడికి ఘనంగా ఫేర్‌వెల్ ఇవ్వాల్సిన అవసరం ఉందని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు. అశ్విన్ ముఖంలోనూ అసంతృప్తి కనిపించిందని, తను భారత గడ్డపై వీడ్కోలు పలికితే బావుండేదని అన్నాడు. ఇందుకోసం ఇప్పటికైనా బీసీసీఐ ఏమైనా నిర్ణయం తీసుకుంటుందేమో చూడాలని చెప్పాడు.

బీసీసీఐ ఖజానా కళకళ

న్యూఢిల్లీ: బీసీసీఐ ఖజానా కాసులతో కళకళలాడుతోంది. గతేడాదితో పోల్చితే బోర్డు ఆదాయం రూ. 4200 కోట్లు పెరిగింది. మొత్తంగా 2024 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 20,686 కోట్లుగా తేలింది. అంతకు ముందు ఏడాది రూ. 16,493 కోట్లుగా పేర్కొన్నారు. బోర్డు ఆదాయంలో ఎక్కువగా భాగం ఐపీఎల్, ద్వైపాక్షిక సిరీస్‌ల ద్వారా వచ్చిందే.

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ అత్యవసర భేటీ నేడు: కార్యదర్శి, కోశాధికారి పదవులను భర్తీ చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. దీనికిగాను ఎన్నికల అధికారిగా అచల్ కుమార్ జ్యోతిని నియమించాలని భావిస్తోంది. ఆయన నియామకాన్ని ఖరారు చేసేందుకు బీసీసీ అపెక్స్ కమిటీ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేసింది. బీసీసీఐ కార్యదర్శి జై షా ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ పదవి ఖాళీ అయింది. అలాగే కోశాధికారి ఆషిష్ షెలార్ మహారాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేశారు.

త్రిష అర్ధ శతకం

బంగ్లాపై భారత్ గెలుపు

అండర్-19 ఆసియా కప్


త్రిష (58 నాటౌట్)

కౌలాలంపూర్: తెలుగమ్మాయి గొంగడి త్రిష (58 నాటౌట్) అర్ధ శతకంతో రాణించడంతో.. అండర్-19 టీ20 ఆసియా కప్ సూపర్-4లో భారత అమ్మాయిల జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత బంగ్లా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 80 పరుగులు చేసింది. మొసమ్మత్ ఇవా (14) టాప్ స్కోరర్. ఆయుషి శుక్లా 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 12.1 ఓవర్లలో 86/2 స్కోరు చేసి గెలిచింది. త్రిష, కెప్టెన్ నిక్కీ (22 నాటౌట్) మూడో వికెట్‌కు అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. భారత్ మరో 47 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. అనీశా రెండు వికెట్లు పడగొట్టింది.

యూపీ.. వరుసగా 8వ విజయం


పుణె: ప్రొ. కబడ్డీ తాజా సీజన్‌లో యూపీ యోధాస్ గెలుపు జోరును కొనసాగించింది. వరుసగా ఎనిమిదో విజయం అందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 59-23తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. గగన్ గౌడ 19 పాయింట్లతో చెలరేగగా, భవానీ రాజ్‌పుత్ సూపర్-10తో సత్తా చాటాడు. సుమిత్ హై-5 సాధించాడు. మరో మ్యాచ్‌లో యూ ముంబా 43-37తో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.











రామ్‌చరణ్ గొప్ప నటుడు

డైరెక్టర్ శంకర్

రామ్‌చరణ్, డైరెక్టర్ ఎస్.శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అడ్వానీ హీరోయిన్‌గా నటించారు. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ సినిమా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శంకర్ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. హీరోగా రామ్‌చరణ్‌ను ఎంపిక చేసుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ "ఇందులో రామ్‌చరణ్ నటిస్తే బాగుంటుందని దిల్ రాజు భావించారు. నాకు కూడా ఇదే కరెక్ట్ అనిపించింది. నా కథల్లో యూనివర్సల్ అప్పీల్ ఉంటుంది. కాబట్టి ఓ పెద్ద హీరో అయితే బాగుంటుందని రామ్‌చరణ్‌తో ప్రయాణం ప్రారంభించాం. ఆయన గొప్ప నటుడు. అద్భుతమైన స్ర్కీన్ ప్రెజన్స్ ఉన్న ఆయన ఎలాంటి సీన్ అయినా అద్భుతంగా, అందంగా హ్యాండిల్ చేస్తారు. అవినీతిలో కూరుకుపోయిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసే ఐఏఎస్ అధికారిగా రామ్‌చరణ్ కనిపించనున్నారు. రాజకీయ అంశాలతో, హైయాక్షన్‌తో సినిమా అద్భుతంగా ఉండబోతుంది' అని తెలిపారు.

అంకితభావానికి ఫిదా



కీర్తి సురేశ్ ఇటీవలే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, పెళ్లయి వారం తిరక్కుండానే కీర్తి తను నటించిన తొలి హిందీ చిత్రం 'బేబీ జాన్' ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. దీంతో అందరూ ఆమె అంకితభావానికి ఫిదా అయిపోతున్నారు. రెడ్ డ్రెస్‌లో ఆధునికంగా తయారై వచ్చినప్పటికీ, సంప్రదాయాన్ని వదలకుండా మెడలో పసుపుతాడుతో ముంబైలో చిత్రబృందం నిర్వహించిన ప్రమోషన్స్‌కి హాజరవటం అందరినీ ఆకట్టుకుంది. ఈ నెల 25న 'బేబీ జాన్' విడుదలవుతోంది. 2016లో విజయ్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వం వహించిన 'తెరీ' సినిమా ఆధారంగా రూపొందించారు. వరుణ్‌ధావణ్ కథానాయకుడిగా కలీస్ తెరకెక్కించారు. అట్లీ కథను అందించి, నిర్మించారు. తమన్ సంగీతం అందించారు. కాగా, ఈ నెల 12న కీర్తి తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌తో బంధు మిత్రుల సమక్షంలో గోవాలో తొలుత హిందూ సంప్రదాయం ప్రకారం ఏడడుగులు వేశారు. ఆ తర్వాత క్రిస్టియన్ పద్ధతిలోనూ వధూవరువులు ఉంగరాలు మార్చుకున్నారు.



పోలీస్ ప్రేమగీతం

వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలు. వెంకటేశ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. చిత్రం నుంచి రెండో గీతాన్ని యూనిట్ గురువారం విడుదల చేసింది. 'నా లైఫ్‌లో ఉన్న ఆ ప్రేమ పేజీ' అంటూ సాగే ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలందించడంతో పాటు, ప్రణవీ ఆచార్యతో కలసి ఆలపించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదలవుతుంది.

అంతా మంచే జరుగుతుంది



'ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. నా అభిమానులు, సహ నటీనటుల ప్రేమ, ఆదరాభిమానాలు పొందుతున్నందుకు సంతోషంగా ఉంది. నా అనారోగ్య విషయాన్ని గతంలోనే వెల్లడించాను. ఈ విషయంలో సంయమనం పాటించిన మీడియాకు ధన్యవాదాలు. సర్జరీ కోసం వెళ్తున్నప్పుడు ఎవరికైనా కాస్త ఆందోళనకరంగానే ఉంటుంది' అని అన్నారు కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న శివరాజ్‌కుమార్ శస్త్ర చికిత్స కోసం అమెరికా వెళ్లారు. ఈనెల 24న ఆయనకు సర్జరీ జరగనుంది. ఎయిర్‌పోర్టు వద్ద మీడియాతో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇలాంటి సమయంలో అభిమానులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులను చూసినప్పుడు కాస్త ఎమోషనల్‌గా ఫీల్ అవుతాం. అంతా మంచే జరుగుతుంది. ఎవరూ ఆందోళన చెందకండి. సర్జరీ పూర్తయ్యాక యూఐ, మ్యాక్స్ సినిమాలను తప్పకుండా చూస్తాను' అని అన్నారు.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్



'క'తో హిట్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'దిల్‌రూబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసి.. 'హిస్ లవ్.. హిస్ యాంగర్' అని పేర్కొన్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: డానియల్ విశ్వాస్, సంగీతం: సామ్.సీ.ఎస్.

బలగం మొగిలయ్య కన్నుమూత



'బలగం' సినిమాలో భావోద్వేగపూరిత పాటను ఆలపించి ప్రేక్షకులను కదిలించిన మొగిలియ్య(67) మృతి చెందారు. ఆయన కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మరణించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వచ్చిన కళ బుర్రకథను జీవనాధారంగా మార్చుకున్నారు. మొగిలయ్య టాలెంట్‌ను గుర్తించిన 'బలగం' చిత్ర దర్శకుడు వేణు తన సినిమాలో పాడే అవకాశం ఇచ్చారు. మొగిలయ్య, కొమురమ్మ కలసి పాడిన 'తోడుగా మా తోడుండి ...నీడలా మాతో నడిచి' అనే పాట సినిమాకే హైలెట్‌గా నిలిచింది. మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు కుమారుడు సుదర్శన్, దత్త కుమార్తె మోజేస్ ఉన్నారు. మొగిలయ్య అంత్యక్రియలు స్వగ్రామమైన దుగ్గొండిలో ముగిశాయి. మొగిలయ్య మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సంగీత, సాహిత్య రంగాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.



ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా ఆయన సినీ జీవితంపై వచ్చిన 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పుస్తకాన్ని దర్శకుడు వంశీ ఆవిష్కరించారు. తొలి కాపీని మరో దర్శకుడు హరీశ్‌శంకర్‌కు, రెండో కాపీని నటుడు నాజర్‌కు అందజేశారు. ఫిల్మ్ జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ, రవి పాడి కలసి ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన దర్శకుడు సుకుమార్



పుష్పా 2 సినిమా ప్రీవియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను గురువారం ఆ సినిమా దర్శకుడు సుకుమార్ పరామర్శించారు. డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఘటన జరిగిన 15 రోజుల తరువాత ఆ సినిమా దర్శకుడు సుకుమార్ బాలుడి యోగ క్షేమాలు తెలుసుకోవడానికి కిమ్స్ ఆసుపత్రికి వచ్చి శ్రీతేజ్ ఆరోగ్య స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

- రాంగోపాల్‌పేట్ (ఆంధ్రజ్యోతి)

కేరళ ఫిల్మ్ ఫెస్టివల్‌లో...



కేరళలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఒక మంచి ప్రేమకథ' చిత్రాన్ని ప్రదర్శించారు. అక్కినేని కుటుంబరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సముద్ర ఖని, రోహిణీ హట్టంగడి, రోహిణి కీలక పాత్రల్లో నటించారు. ఈ ఫెస్టివల్‌కు మధు అంబట్ రెట్రాస్పెక్టివ్‌లో 'ఒక మంచి ప్రేమకథ'తో పాటు ఆరు భారతీయ చిత్రాలు ఎంపికయ్యాయి. నిర్మాత హిమాంశు పోపూరి, రచయిత ఓల్గా, సినిమాటోగ్రాఫర్ మధు అంబట్ అతిథులుగా హాజరయ్యారు.

అన్ని వర్గాలను అలరిస్తుంది



వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. నిర్మాత వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించింది. వంశీ నందిపాటి మాట్లాడుతూ "శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రం ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఈ చిత్రం అలరిస్తుంది. ఈ సినిమాకు కథే హీరో. కథను నమ్మే ముందుకు వెళుతున్నాను. ఈ సినిమాతో మంచి విజయం వస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. అనన్య నాగళ్ల మాట్లాడుతూ 'నటిగా నాలోని ప్రతిభను వెలికితీసేలా ఈ చిత్రంలో నా పాత్ర ఉంటుంది. కథను మలచిన తీరు సరికొత్తగా ఉండి ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాతో మంచి విజయం వస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

‘వక్ఫ్ బోర్డు’తో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

» అబ్దుల్ అజీజ్‌కు సీఎం చంద్రబాబు సూచన


సీఎంను కలిసిన వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం పురపాలక మంత్రి నారాయణతో కలిసి సీఎం చంద్రబాబును అమరావతి సచివాలయంలో కలిశారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అజీజ్‌కు సీఎం ఈ సందర్భంగా సూచించారు. అనంతరం మంత్రులు నారాయణ, రామ నారాయణరెడ్డి, ఫరూక్‌తో అజీజ్ భేటీ అయ్యారు.

సీఎంఆర్ఎఫ్‌కు మెల్‌బోర్న్ టీడీపీ రూ.3లక్షల విరాళం

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3లక్షల విరాళాన్ని మెల్‌బోర్న్ టీడీపీ నేతలు అందజేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు, రామ్ ముప్పనేని, ప్రకాశ్ మారితి కలిసి విరాళం చెక్కు అందజేశారు.

రాహుల్ ప్రవర్తన అవమానకరం: ఎంపీ పురందేశ్వరి

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజ్యసభ సభ్యురాలు ఫంగ్నోన్ కొన్యాక్ పట్ల పార్లమెంటు సాక్షిగా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అసభ్యంగా ప్రవర్తించడం చాలా అవమానకరమని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘అనుచిత ప్రవర్తనతో మీరు... మీ అనుచరులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?’ అని ఎక్స్‌లో ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి కోళ్ల పెంపకందారులు మొక్కజొన్న కొరతతో ఇబ్బందిపడుతున్నారని, వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అక్కడ ప్రాథమికోన్నత పాఠశాలలే!

» 60 మంది విద్యార్థులు ఉండి, 3కి.మీ లోపు హైస్కూల్ లేకపోతే కొనసాగింపు

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవసరమైన చోట్ల ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. 31 నుంచి 60 మధ్య విద్యార్థులు ఉండి, 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల లేకపోతే అక్కడి ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించే యోచన చేస్తోంది. అదే 60 మంది విద్యార్థులు దాటితే ఆ ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. 75 మంది కంటే ఎక్కువ విద్యార్థులుంటే ఆ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు కేటాయిస్తారు. సమీపంలో ఉన్నత పాఠశాలలుంటే 6, 7, 8 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్‌లో 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ చొప్పున నియమిస్తారు. బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో 20 మంది విద్యార్థులకు ఒకరు, 60 మంది వరకు ఇద్దరు టీచర్లను ఇస్తారు. టీచర్ల బదిలీలు వేసవిలో చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. టీచర్ల వివరాలను అప్‌డేట్ చేస్తోంది.

ఏపీలో 226 ప్రాజెక్టులకు ‘అమృత్’ సాయం

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఏపీలో అమృత్ పథకం కింద 226 ప్రాజెక్టులకు కేంద్రం సాయమందిస్తోందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకెన్ సాహు తెలిపారు. గురువారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

డిప్యుటేషన్ ఐఏఎస్‌లకు హెచ్‌ఆర్‌ఏ పెంపు

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల కేడర్ల నుంచి ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులకు హెచ్‌ఆర్ఏ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాజధాని అమరావతి సచివాలయం, హెచ్‌ఓడీలు, ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్నవారికి 30శాతం, వై కేటగిరీ నగరాల్లోవారికి 20శాతం, జడ్ కేటగిరీ పట్టణాల్లో పనిచేస్తున్న వారికి 10శాతం పెంపు వర్తిస్తుందని పేర్కొంది.

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం కల నెరవేరేనా?



» కువైత్‌లో పెద్దసంఖ్యలో రాయలసీమ ప్రవాసీయులు

» విజయవాడ-గల్ఫ్ రోజువారీ సర్వీసులపైనా ఆశలు

» 21 నుంచి ప్రధాని మోదీ కువైత్ పర్యటనపై ఆసక్తి

» 4 దశాబ్దాల తర్వాత కువైత్‌కు భారత్ అధినాయకుడు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కొన్నాళ్లుగా ఇరు దేశాలు ఎదురు చూస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కువైత్ అధికారిక పర్యటన ఎట్టకేలకు ఖరారైంది. ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు ప్రధాని కువైత్‌లో పర్యటించనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధానికి స్వాగతం పలికేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా.. కువైత్‌లో శనివారం జరుగనున్న అరేబియన్ గల్ఫ్ కప్ ఫుట్ బాల్ కప్ పోటీలను తనతో పాటు కలిసి తిలకించాల్సిందిగా కువైత్ అమీర్ (రాజు) షేక్ విశాల్ అహ్మద్ అల్ సబా ప్రధాని మోదీని ఆహ్వానించారని, మోదీ కూడా హాజరవుతారని అంతా భావిస్తున్నారు. ప్రధాని ప్రసంగించనున్నట్లుగా భావిస్తున్న అల్ సబా స్టేడియంలో భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసీయులతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆయనకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, ఇందులో తమకు పెద్దగా భాగస్వామ్యం కల్పించడం లేదని, భద్రతా కారణాల సాకుతో మోదీని కలిసే అవకాశం కూడా దక్కేలా లేదని కొందరు తెలుగు ప్రవాసీ ప్రముఖులు వాపోతున్నారు.

ద్వైపాక్షిక చర్చలపైనే ప్రవాసాంధ్రుల ఆశలు

కొన్నాళ్ల క్రితమే ప్రధాని మోదీ కువైత్ పర్యటనకు రావాల్సి ఉన్నా వివిధ కారణాల వల్ల కుదరలేదు. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పర్యటన తర్వాత 43 సంవత్సరాల వ్యవధిలో భారత్ ప్రధానులెవ్వరూ కువైత్ పర్యటనకు రాలేదు. ఒక రకంగా చెప్పాలంటే గల్ఫ్‌లోని మిగిలిన దేశాలతో పోల్చితే కువైత్‌తో భారత్ సంబంధాలు అంతగా లేవని చెప్పవచ్చు. ఇరాక్ చేసిన కువైత్ దురాక్రమణను భారత్ ఖండించకపోవడం దీనికి కారణంగా చెబుతారు. కువైత్ జనాభాలో స్థానిక పౌరులకు మించి అధిక సంఖ్యలో విదేశీయులు.. ముఖ్యంగా భారతీయులు ఉన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాయలసీమ జిల్లాల ప్రవాసీయులు ప్రత్యేకించి ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన వారి సంఖ్య అధికం. ఈ నేపథ్యంలో కువైత్.. భారత్ మధ్య ఉన్న వారానికి 12 వేల విమాన సీట్లను 28 వేలకు పెంచాలని, కొత్త రూట్లలో ఎగిరేందుకు అనుమతించాలని కువైత్ చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నా, భారత్ అంగీకరించడం లేదు. ప్రధాని పర్యటనలో దీనిపై అంగీకారం కుదిరితే, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం కల నెరవేరుతుంది. అలాగే, విజయవాడకు కువైత్‌కు చెందిన అల్ జజీరా ఎయిర్ వేస్ ద్వారా మొత్తం గల్ఫ్ దేశాలకు రోజువారీగా విమాన సౌకర్యం కలుగుతుందని ప్రవాసీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు కేసు ఫైలులో మార్పులు?

» సందేహం వ్యక్తం చేసిన జీవీ రెడ్డి

» విజయసాయి సిఫారసు చేసిన మహిళా ఉద్యోగి చేతికి ఫైబర్‌నెట్ ఫైలు

» ఆనాడు అడ్డగోలు నియామకాలు

» సిఫారసులు, వాట్సాప్ మెసేజీలతో 1,200 మందికిపైగా కొలువులు

» వైసీపీ నేతల ఇళ్లలో పనిమనుషులు, కారు డ్రైవర్లుగా పనిచేయించుకున్నారు

» నెలకు రూ.4 కోట్ల వేతనాలు

» 1,863 వ్యూస్ వచ్చిన వర్మ వ్యూహం.. సినిమాకు ఏకంగా 2.15 కోట్ల చెల్లింపు

» సంస్థపై మొత్తం 1,262 కోట్ల భారం

» అన్నింటిపై విజిలెన్స్ విచారణ చేస్తాం

» ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై ఫైబర్‌నెట్ సంస్థ పెట్టిన కేసుకు సంబంధించిన ఫైలులో మార్పులు, చేర్పులు జరిగాయేమోనని ఆ సంస్థ (ఏపీఎస్ఎఫ్ఎల్) చైర్మన్ జీవీరెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ఈ ఫైలులో కొత్తగా ఏమైనా రాశారా లేదా తొలగించారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. అత్యంత కీలకమైన ఈ ఫైలును వైసీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి సిఫారసుతో ఉద్యోగంలో చేరిన మహిళ చేతిలో ఎందుకు ఉంచారో అర్థంకావడం లేదన్నారు. ఆమెకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇవ్వలేదని, కేవలం వాట్సాప్ మెసేజ్ ఆధారంగానే విధులు అప్పగించి, అధికారులు జీతం చెల్లిస్తూ వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆమె ఉద్యోగంలో కొనసాగారని, ఇటీవల ఆమెను విధుల నుంచి తొలగించామని వెల్లడించారు. గురువారం ఫైబర్‌నెట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కీలకమైన ఫైలును ఆ మహిళా ఉద్యోగికి అప్పగించిన అధికారులపై చర్యలు ఉండవా అన్న ప్రశ్నకు.. అన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.



[illegible] ఫైబర్‌నెట్ మానస పుత్రిక అని జీవీరెడ్డి అభివర్ణించారు. గ్రామాలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించాలన్న లక్ష్యంతో కేబుల్, ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్‌తో కూడిన వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఫైబర్‌నెట్ స్థాపించినప్పుడు కేవలం 108 మంది సిబ్బందితో నెలకు రూ.40 లక్షలు జీతభత్యాలుగా చెల్లించారని వివరించారు. అలాంటిది.. గత వైసీపీ ప్రభుత్వంలో మార్గదర్శకాలు, నియమ నిబంధనలు లేకుండా సిఫారసులు, వాట్సాప్ మెసేజ్‌లతో ఉద్యోగుల సంఖ్యను 1,360కు పెంచారని వెల్లడించారు. ఈ 1,360 మంది ఉద్యోగులకు నెలకు నాలుగు కోట్ల రూపాయలు చెల్లించాల్సిన దుస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. చాలామంది ఉద్యోగులు కార్యాలయానికి రాకుండా, వైసీపీ నాయకుల ఇళ్లలో పనిమనుషులుగా, కారు డ్రైవర్లుగా పనిచేశారని తెలిపారు. ఇలా అక్రమంగా జరిగిన నియామకాలపై చర్యలు చేపడుతున్నామని, లెక్కాపత్రం లేకుండా సంస్థలో చేరిన ఉద్యోగులందరినీ తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో పత్రికా ప్రకటన ఇచ్చి, ఇంటర్వ్యూలను నిర్వహించాకే ఉద్యోగ నియామకాలు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికలకు ముందు నిధులన్నీ విత్‌డ్రా చేసుకుపోయారని, ఫైబర్‌నెట్‌పై రూ.1,262కోట్ల అప్పును భారంగా వేశారని చెప్పారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఫైబర్‌నెట్ దివాలా తీసిందన్నారు.

‘వ్యూ’హంపై విచారణ

దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ సార్వత్రిక ఎన్నికలకు ముందు తీసిన ‘వ్యూహం’ సినిమాకు రూ.2.15 కోట్లు ఫైబర్‌నెట్ చెల్లించిందని జీవీ రెడ్డి తెలిపారు. వ్యూస్ ప్రకారం డబ్బులు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని వివరించారు. వ్యూహం సినిమాకు కేవలం 1,863 వ్యూస్ వచ్చాయని తెలిపారు. ఈ లెక్కన ఒక్కో వ్యూకు 11,000 చొప్పున చెల్లించినట్లు అయ్యిందని వివరించారు.

సంపూర్ణ ప్రక్షాళన

ఫైబర్‌గ్రిడ్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చాక వాటి వివరాలు బహిర్గతం చేస్తామని జీవీరెడ్డి తెలిపారు. 2019 నుంచి 2024 దాకా జరిగిన అక్రమాలన్నింటిపైనా సమగ్ర విచారణ జరుగుతోందని వెల్లడించారు. గతంలో ఫైబర్‌నెట్ చైర్మన్ మీడియా సమావేశాలకు సంస్థ ఎండీ హాజరయ్యేవారని, ఇప్పుడు ఎందుకు రాలేదన్న ప్రశ్నకు.. మంత్రివర్గ సమావేశం ఉన్నందున ఎండీ దినేశ్‌కుమార్ హాజరు కాలేకపోయారని వివరించారు. ఫైబర్‌నెట్‌ను సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తామని వెల్లడించారు.

శాంతి సిస్టర్స్‌కు సాయిరెడ్డి సిఫారసు!

» ఇద్దరికి ఫైబర్‌నెట్‌లో కొలువు

» వాట్సాప్ మెసేజ్‌తోనే నియామకాలు

» ఎగ్జిక్యూటివ్ స్థాయిలో విధులు

» బాబుపై కేసుకు వీలుగా ఫైళ్లలో మార్పులు చేశారనే అనుమానాలు

» కూపీ లాగుతున్న కూటమి ప్రభుత్వం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


ప్రియాంకతో సాయిరెడ్డి

ప్రజలకు వినోదం, సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఫైబర్‌నెట్‌ను వైసీపీ తన సొంత మనుషులతో నింపేసిన వైనం ఇప్పటికే బయటపడింది. అందులోనూ... కేవలం వాట్సాప్ మెసేజ్‌లతో సిఫారసు చేయగానే, ఎలాంటి నియామక పత్రాలూ లేకుండానే కొలువులో కూర్చోబెట్టి జీతభత్యాలు అందించేశారు. మరీ ముఖ్యంగా వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి విచ్చలవిడిగా సిఫారసులు చేశారు. దేవదాయ శాఖలో వివాదాస్పద అధికారిణిగా ముద్రపడిన అసిస్టెంట్ కమిషనర్ శాంతితో ఉన్న పరిచయంతో... ఆమె ఇద్దరు చెల్లెళ్లకూ సాయిరెడ్డే ఫైబర్‌నెట్‌లో పోస్టింగులు ఇప్పించారు. వైసీపీ అధికారంలో ఉండగా పెట్టిన అనేక అక్రమ కేసుల్లో... ‘ఫైబర్ నెట్’ కేసు ఒకటి! సంబంధిత ఫైళ్లలో శాంతి సిస్టర్స్ కీలకమైన మార్పు చేర్పులు చేసి... కేసు పెట్టేందుకు వీలుగా మార్చినట్లు ప్రస్తుత ప్రభుత్వం అనుమానిస్తోంది.

ఆ ఇద్దరు...ఇలా!

సస్పెండ్ అయిన అసిస్టెంట్ కమిషనర్ శాంతికి ప్రియాంక, ఇందిరా ప్రియదర్శిని అనే చెల్లెళ్లు ఉన్నారు. ఆమె విశాఖలో పని చేస్తుండగా సాయిరెడ్డితో పరిచయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో... ఆమె ఇద్దరు చెల్లెళ్లకు సాయిరెడ్డి ఫైబర్ గ్రిడ్‌లో ఉద్యోగాలు ఇప్పించారు. ఇందులో... ప్రియాంకను ఎగ్జిక్యూటివ్‌గా, ఇందిరను లీగల్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించారు. వారిద్దరికి కనీసం నియామక పత్రాలు కూడా లేవని ఇప్పుడు గుర్తించారు. చంద్రబాబుపై అప్పటి ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి కేసు పెట్టిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఫైలు ఇందిరకే అప్పగించారు. ఆమె జూనియర్ అయినప్పటికీ కీలక పాత్ర పోషించారు. ‘తాడేపల్లి’ ఆదేశాల మేరకు ఆ ఫైలులో మార్పు చేర్పులు జరిగాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. శాంతి చెల్లెళ్లను విధుల నుంచి తప్పించి... అప్పటి పరిణామాలపై ఆరా తీస్తోంది.

జగన్ అక్రమాస్తుల కేసు విచారణ జనవరి 27కు వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ అక్రమాస్తుల కేసులో భాగమైన వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్(వాన్‌పిక్) భూముల కేసును సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును మే 30న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే.. సీబీఐ తరఫు న్యాయవాదులు అందుబాటులో లేకపోవడంతో ఆ కేసును జనవరి 27కు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం పెంపు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 1961 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. పీఏసీఎస్‌లతో పాటు ఎఫ్ఎస్‌సీఎస్, ఎల్ఎస్‌సీఎస్‌ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని కూడా ఆరు నెలలు పెంచింది. ఈ పెంపు ఈ నెల 21 నుంచి ఆరు నెలలు, లేదా ఎన్నికలు జరిగే వరకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అగ్రి వర్సిటీకి 506 కోట్లు మంజూరు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సమగ్ర బడ్జెట్ పంపిణీ కింద రూ.506.03కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని నాలుగు త్రైమాసికాల్లో విడుదల చేయనుంది. ఇందులో జీతాల కింద రూ.456.03కోట్లు, ఇతర గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా రూ.50కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ అగ్రిస్టాక్ ప్రాజెక్ట్ అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ, వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన ఇంప్లిమెంటేషన్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పశు వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులను నియంత్రించడానికి నాలుగు నెలల కార్యాచరణ చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్‌నాయుడు తెలిపారు. వచ్చే మార్చి వరకు సీజనల్ వ్యాధులకు పశువుల మందులు, టీకాలు వేసేందుకు రూ.29కోట్లతో అవసరమైన మందులను పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన గురువారం తెలిపారు. ఈ నెలలో అనంతపురం, నెల్లూరు, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో గొర్రెలు, మేకలకు చీడపారుడు, గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు, జనవరిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో కోళ్లు, బాతులకు మశూచి, ప్లేగు, కొక్కెర వ్యాధి నివారణ టీకాలు, రాష్ట్రవ్యాప్తంగా మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు, దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు, ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఆవులు, గేదెలు, పెయ్యదూడలకు బ్రూసెల్లావ్యాధి నిరోధక టీకాలు, 17 జిల్లాల్లో కోళ్లు, బాతులకు టీకాలు, మార్చిలో అన్ని జిల్లాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు ఆయన వివరించారు.

ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు?

చిన్న కమతాలకూ ‘ఫ్రీ హోల్డ్’ కష్టాలు

- ఎకరం,రెండు ఎకరాల రైతులకు మోక్షమేదీ?
- అసైన్డ్ భూములపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- రికార్డుల పున: పరిశీలన ఇప్పటికే పూర్తి
- కానీ, రిజిస్ట్రేషన్ల నిలిపివేత మరోనెల పొడిగింపు
- జగన్ ఇచ్చిన జీవో 596తో అసైన్డ్‌కు ఆపద
- ఆ జీవోను వెనక్కి తీసుకోని కూటమి ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జగన్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించడంలో అక్రమాలు ఎలా చేశారో కూటమి ప్రభుత్వం నిగ్గు తేల్చింది. అక్రమార్కులు ఎవరో కనిపెట్టేందుకు సర్వం సిద్ధం చేసుకుంటోంది. కానీ, ఈ పేరిట ఫ్రీ హోల్డ్ పరిధిలోకి వచ్చిన భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసింది. రికార్డుల పున:పరిశీలన ప్రక్రియ ముగిసినా రిజిస్ట్రేషన్లపై స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చేవరకు రిజిస్ట్రేషన్లు చేపట్టడానికి వీల్లేదంటూ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో చిన్న కమతాలున్న అసైన్డ్ భూయజమానులు గగ్గోలు పెడుతున్నారు. భూములు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటే రుణాలు, ఇతర ఆర్థికపరమైన వనరులు సమకూరతాయని, కానీ గత ఐదారు నెలలుగా ప్రభుత్వం అనుమతించకపోవడంతో తమకు ఆ అవకాశాలు దక్కడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల నిబంధనతో చిక్కులు..

గత జగన్ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల చట్టం-1977(పీఓటీ యాక్ట్)ను సవరించిన సంగతి తెలిసిందే. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల గడువు 20 ఏళ్లు దాటితే వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు(ఓనర్‌షిప్ రైట్స్) వస్తాయనీ, అలాంటి భూములను నిషేధ భూముల జాబితా 22(ఏ) నుంచి తొలగించాలనీ, ఆ తర్వాత ఆ భూములను రైతుల పేరిట ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేయాలని గత ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులో జీవో 596 జారీ చేసింది. అయితే, వైసీపీ నేతలు, కొందరు అధికారులు కుమ్మక్కయి జీవోను అడ్డంపెట్టుకొని 4.17 లక్షల ఎకరాలను అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేశారు. అందులో 25వేల ఎకరాలను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు.

భూవివాదాలపై టాస్క్‌ఫోర్సు

కూటమి ప్రభుత్వం వచ్చాక మదనపల్లి ఫైల్స్ ఘటన జరిగింది. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ రికార్డు రూమ్‌లోని అసైన్‌మెంట్ పట్టాలు, రిపోర్టులను దుండగులు తగలబెట్టారు. ఆ తర్వాత అన్ని రెవెన్యూ ఆఫీసుల్లోని అసైన్డ్ భూముల రికార్డుల పున:పరిశీలన ప్రారంభించారు. ఈ ప్రక్రియ ముగిసేవరకు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం రికార్డుల పున:పరిశీలన అనేది సెప్టెంబరు నెలాఖరునాటికే పూర్తికావాల్సిఉంది. అయితే రెవెన్యూ శాఖ వివిధ పనుల్లో బిజీగా ఉంటూ ఈ లక్ష్యాన్ని సకాలంలో అందుకోలేకపోతోంది. దీంతో ఇప్పటివరకు రెండు దఫాలుగా రిజిస్ట్రేషన్ల నిలిపివేతను పొడిగించింది. ఈనెల 10తోనే ఈ గడువు ముగిసింది. వాస్తవానికి రికార్డుల పరిశీలన ఈనెల ఆరో తేదీనాటికే పూర్తయింది. తొమ్మిది లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేస్తే అందులో 4.17 లక్షల ఎకరాలు అక్రమంగా, జీవో 596కు విరుద్ధంగా చేశారని గుర్తించారు. కాబట్టి ఆ భూముల విషయంలో జరిగిన అక్రమాలకు బాధ్యులెవరో ప్రభుత్వం గుర్తించాలి. వారిపై చర్యలు తీసుకోవడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. కానీ, రిజిస్ట్రేషన్ల నిలిపివేత విషయంలో ఏ ఆదేశాలూ ఇవ్వలేదు. దీంతో రెవెన్యూ శాఖ ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేతను మరో నెలరోజుల పాటు పొడిగించింది.

ఏదో ఒకటి తేల్చాలి...

అక్రమాలు ఏపాటివో తేలింది. అక్రమార్కులు ఎవరో పోలీసులు కనిపెట్టాలి. కానీ, ఎకరం, రెండు ఎకరాల విస్తీర్ణం ఉన్న అసైన్డ్ భూములను ఇంకా నిషేధ జాబితాలో కొనసాగించడం దేనికి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఐదు లేదా పది ఎకరాలను ఒకేసారి ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేస్తే వాటిని నిలిపివేయాలేగానీ, 50 సెంట్లు, ఎకరం భూములను కూడా నిషేధ జాబితాలో కొనసాగించడం ఏమిటని పామర్రుకు చెందిన రైతు లక్ష్మణరావు ఆందోళన వ్యక్తంచేశారు. "అసైన్డ్ చట్టసవరణ సర్కారుకు ఇష్టమా? కాదా? ఏదో ఒకటి స్పష్టంగా చెప్పాలి. ఫ్రీ హోల్డ్ కొనసాగిస్తామనో లేక రద్దుచేస్తామనో చెప్పాలి. దీనిపై స్పష్టత ఇవ్వకుండా ఎంతకాలం రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తారు? అక్రమంగా ఫ్రీ హోల్డ్ చేసుకున్నవారెవరో కనిపెట్టి చర్యలు తీసుకోవాలి. అంతేతప్ప చిన్న కమతాలున్న రైతులకు ఇబ్బంది కలిగేలా రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం సరికాదు" అని రిటైర్డ్ అధికారి, రెవెన్యూ నిపుణుడు రామయ్య ‘ఆంధ్రజ్యోతి’కి చెప్పారు.

పెట్టుబడులు, ఉపాధిపై ‘అవలోకనం’

» రూ.50 కోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులపై నిరంతర పర్యవేక్షణ

» ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతిపై మరింత దృష్టిసారించనుంది. రాష్ట్రంలో వివిధ కంపెనీలు పెట్టే పెట్టుబడులు, ఆయా ప్రాజెక్టుల స్థితిగతులు, ఉపాధి కల్పనపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ), పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ)ల అనుమతి పొందిన ప్రాజెక్టుల స్థితిగతులు, పెట్టుబడి, ఉపాధి వివరాలను ఆన్‌లైన్ ట్రాకర్ సిస్టమ్‌లో ‘అవలోకనం’ శీర్షిక కింద క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. గురువారం పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, పశుసంవర్థక, ఫిషరీస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, టూరిజం, ఇంధన తదితర రంగాలలో రూ.50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడితో నెలకొల్పే భారీ, మెగా ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎనర్జీ (ఎన్ఆర్ఈడీసీఏపీ), పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, టూరిజం మొదలైన కొన్ని విభాగాలకు పూర్తి స్థాయి జిల్లా యూనిట్లు లేనందున పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్లను కన్వీనర్‌గా పరిగణించాలని జీవోలో పేర్కొంది. ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ ఆమోదించిన అన్ని భారీ,మెగా ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడుల సాకారం, పురోగతిపై కలెక్టర్ల అధ్యక్షతన నెలవారీ నిర్వహించే జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాల్లో సమీక్షించాలని నిర్దేశించింది. ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై చర్చించాలని సూచించింది. ఆయా ప్రాజెక్టుల ప్రతిపాదకుల ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాన్ని నిర్ధారించుకోవాలని, నిర్దేశిత కాలవ్యవధిలో అజెండా నోట్స్‌లో చర్చించాలని, అనంతరం అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ అజెండాలోకి తీసుకురావాలని సూచించింది.

కేటీఆర్‌పై ‘రేసు’ కేసు!

» ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై ఏసీబీ కేసు

» నోటీసులు ఇచ్చి.. అరెస్టు చేసే అవకాశం!?

» ఏ1గా కేటీఆర్.. ఏ2గా ఐఏఎస్ అర్వింద్



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించారని, నిధుల విడుదలలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో... కేటీఆర్‌ను ఏ1గా చేర్చింది. అప్పటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ ఏ2గా, నాటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంది. కేటీఆర్‌ను నోటీసు ఇచ్చిన అనంతరం అరెస్టు చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ తదితరులపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1),(ఏ)రెడ్ విత్ 13(2), సెక్షన్ 409, 120(బి) ప్రకారం కేసు నమోదు చేశారు. కేటీఆర్‌పై ఆరోపణలు వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదుపరి విచారణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి రాగానే.. క్యాబినెట్ సమావేశంలో చర్చించారు. ఈ ఫిర్యాదును ఏసీబీకి పంపాలని నిర్ణయించారు. బుధవారం సాయంత్రం ఫిర్యాదు అందడం.. గురువారం సాయంత్రానికి కేసు నమోదు చేయడం జరిగిపోయింది.

ఇదీ ఏసీబీ కేసు...

హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహించడానికి 2022లో ప్రభుత్వం త్రైపాక్షిక ఒప్పందం చేసుకొంది. బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), తెలంగాణ పురపాలకశాఖ, స్పాన్సరర్ అయిన ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 9, 10, 11, 12 సెషన్లను హైదరాబాద్‌లో నిర్వహించాలి. అప్పట్లో ట్రాక్ నిర్మించి ఇవ్వడం, ఇతర మౌలిక వసతుల కోసం హెచ్ఎండీయే 12కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. మిగతా సొమ్ము స్పాన్సరర్ కంపెనీ భరించింది. అయితే... మొదటి రేస్ పూర్తి అయిన తర్వాత ఎఫ్ఈవోకు, స్పాన్సరర్‌కు మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో స్పాన్సరర్ కంపెనీ ఒప్పందం నుంచి వైదొలగింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వమే స్పాన్సరర్‌గా ఉంటుందని అప్పటి మంత్రి కేటీఆర్ మౌఖికంగా చెప్పడంతో... అందుకు మొత్తం 160 కోట్లు ఖర్చు అవుతుందని అర్వింద్ కుమార్ ఫైల్ పెట్టడం... దానిపై అదే రోజున కేటీఆర్ సంతకం చేయడం చకచకా జరిగాయి. మరోవైపు... కేటీఆర్‌కు ఫైలు వెళ్లడానికి రెండు రోజుల ముందు, రెండు రోజుల తర్వాత రెండు విడతల్లో ఎఫ్ఈవోకు రూ.45.70 కోట్ల చెల్లింపులు జరిగాయి. దీనికి ఆర్థిక శాఖ అనుమతి లేదు. పైగా... డాలర్లలో డబ్బు చెల్లించడం వల్ల హెచ్ఎండీఏ సుమారు 8కోట్ల పన్ను చెల్లించాల్సి వచ్చింది. డాలర్లలో చెల్లింపులకు ఆర్బీఐ అనుమతి తీసుకోలేదు. మరోవైపు... తెలంగాణలో అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఈసీ అనుమతీ తీసుకోలేదు. చెల్లింపులు జరిగిన తర్వాత... 2023 అక్టోబరు 30న ఎఫ్ఈఓ, పురపాలకశాఖ మధ్య ఒప్పందం జరిగింది. దీనివల్ల తెలంగాణ ప్రభుత్వం రూ.90కోట్ల స్పాన్సరర్ ఫీజుతో పాటు ఇతర సదుపాయాల కల్పనకు 70 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అంశాలపై ఏసీబీ దర్యాప్తు కొనసాగనుంది.

హైకోర్టులో 11 జడ్జీ పోస్టులు ఖాళీ: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీలు 11 ఉన్నాయని కేంద్ర న్యాయ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. ఏపీ హైకోర్టుకు మంజూరు చేసిన న్యాయమూర్తుల సంఖ్య 37 కాగా, గత సెప్టెంబరు వరకు 26 మంది న్యాయమూర్తులు విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. గురువారం, వైసీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

ఏపీలో 2,682 కి.మీ హైవేలకు 35 వేల కోట్లు: గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.35 వేల కోట్లు కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 2,682 కి.మీ మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గురువారం, లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో ఏపీలో 1,774 కి.మీ పొడవు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించామని కేంద్ర మంత్రి తెలిపారు.

వరద ప్రభావిత 10 జిల్లాల్లో
రైతుల రుణాల రీ-షెడ్యూల్

- అమరావతిలో రూ.33137.98 కోట్లతో 45 ఇంజనీరింగ్ పనులు
- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం
- రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత 10 జిల్లాల్లో రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే, రాజధాని అమరావతిలో 45 ఇంజనీరింగ్ పనులను రూ.33137.98 కోట్లతో చేపట్టడానికి ప్రభుత్వం సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత ప్రభుత్వం రద్దు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. మంత్రివర్గ సమావేశంలో 21 అంశాలపై చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో 30-8-2024 తర్వాత వరద ముంపునకు గురైన ప్రాంతాల రైతులకు రుణాలు రీ-షెడ్యూల్ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే, రూ.50 వేల లోపు రుణాలపై స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలు మినహాయించాలని నిర్ణయించింది. 2024-25లో ధాన్యం సేకరణ నిమిత్తం మార్క్‌ఫెడ్‌కు రూ.1,000 కోట్ల అదనపు రుణాన్ని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి పొందేందుకుగాను ప్రభుత్వ హామీని పొడిగించడంతోపాటు నేషనల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్సీడీసీ) నుంచి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ధాన్యం కొనుగోలు చేసిన ఆరేడు గంటల్లోనే రైతులకు సొమ్ము చెల్లిస్తున్నారు. రైతులకు ఇన్‌స్టంట్ పేమెంట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాజధాని అమరావతిలో ఐఏఎస్, గజిటెడ్, క్లాస్ ఫోర్ క్వార్టర్ల నిర్మాణానికి, వరద మిటిగేషన్ పనులు, రహదారులు, మౌలిక వసతుల కల్పన తదితర 45 ఇంజనీరింగ్ పనులను రూ.33137.98 కోట్లతో చేపట్టడానికి సీఆర్డీఏకు అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే, ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 14 పోస్టుల మంజూరు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అలాగే, జలజీవన్ మిషన్ పథకం కింద రూ.11,400.80 కోట్ల విలువైన 44,195 పనులకు టెండర్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా టెండర్లను పిలిచేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు బదలాయించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మార్కెటింగ్ జీవీవీ రమేష్ కుమార్‌ను తిరిగి ఏపీలో ఆయన రిటైర్మెంట్ తేదీ(30.6.2026) వరకు విధుల్లో కొనసాగే విధంగా సూపర్ న్యూమరీ పోస్టు ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్యాకేజీ నెంబర్-3, 5, 5ఏ కింద పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 6ఏ ఎసెన్షియల్ బ్యాలెన్స్ పనుల టెండర్లకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జ్యుడీషియల్ ప్రివ్యూ న్యాయమూర్తి పదవి ఖాళీగా ఉన్నందున ప్రివ్యూ లేకుండానే టెండర్ ప్రక్రియ పూర్తికి ఆమోదం తెలిపింది. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్టీపీసీతో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రానికి రూ.20620 కోట్ల ఆదాయం రానుంది. 1 లక్షా 6 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రెండేళ్ల కాలపరిమితికి సృష్టించిన 679 సూపర్ న్యూమరీ డిప్యూటీ తహశీల్దార్(రీసర్వే) పోస్టులను మరో రెండేళ్లు కొనసాగించాలని నిర్ణయించింది.

జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు..

475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులతోపాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, హైస్కూల్ ప్లస్ విద్యా సంస్థలకు రూ.32.45 కోట్లతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద పాఠ్య పుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, రికార్డు బుక్స్, నోట్ బుక్స్ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇకపై ప్రభుత్వ కాలేజీల్లోనూ జేఈఈ, నీట్ శిక్షణ అందించాలని కేబినెట్ నిర్ణయించింది.

> మనకు కక్ష సాధింపులు అవసరం లేదు. విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం. ఉన్న సమయాన్ని మంచి పాలన అందివ్వడానికి వాడుకుందాం.
>
> రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల లెక్క నాకు ముఖ్యం కాదు. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయన్నది ప్రధానం. పక్క టేబుల్ మీదకు తోసేయడంలో కొందరు అధికారులు నిపుణులు. అలా కాకుండా వాటిని సవ్యంగా పరిష్కరించే విధానాలపై దృష్టి పెట్టండి.
>
> మంత్రులు ఫైళ్లను త్వరగా పరిష్కరించాలి. మీ వద్దకు వచ్చేవే గాక మీ శాఖకు వస్తున్నవి కూడా త్వరగా పరిష్కారయ్యేలా బాధ్యత తీసుకోవాలి.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు



కక్ష సాధింపులొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

వెలగపూడి సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా స్థానిక సంస్థల పాలక వర్గాలపై అవిశ్వాసం పెట్టే విషయమై చర్చ జరిగింది. గతంలో అవిశ్వాసం పెట్టడానికి ఏడాది సమయం ఉండేది. దానిని గత వైసీపీ ప్రభుత్వం మార్చి.. పదవీకాలం నాలుగేళ్లు పూర్తయ్యే వరకు అవిశ్వాసం పెట్టరాదని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యధిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీల మేయర్లు, చైర్‌పర్సన్లుగా వైసీపీకి చెందిన వారే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమయాన్ని కుదించడంపై కసరత్తు జరిగింది. అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి వీలు కల్పిస్తే వారందరినీ దించివేయడానికి అనేకచోట్ల టీడీపీ నేతలు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల పదవీకాలం రెండున్నరేళ్లు పూర్తికాగానే అవిశ్వాసం పెట్టడానికి వీలుకల్పిస్తూ పురపాలక శాఖ ఒక ప్రతిపాదనను కేబినెట్ ముందు ఉంచింది. పాలనపై దృష్టి పెడదామని, ఇప్పుడు అవిశ్వాస తీర్మానాలు పెట్టి ఉన్నవారిని దించే వ్యవహారాలు పెట్టుకోకపోవడం మంచిదని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఇప్పుడున్న పాలక వర్గాలకు ఇంకా ఎంత గడువుందని మంత్రి పొంగూరు నారాయణను సీఎం అడిగారు. 79 మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల పాలక మండళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగుస్తుందని, మిగిలిన వాటికి నవంబరులో పూర్తవుతుందని ఆయన బదులిచ్చారు. ఇంత కొద్ది సమయం ఉన్నవాటిని దించాల్సిన అవసరం లేదని సీఎం తేల్చిచెప్పారు. చైర్మన్ వేరే పార్టీ అయినప్పుడు జడ్పీ సమావేశాల్లో తీర్మానాలు చేయడానికి ఒక్కోసారి ఇబ్బంది ఎదురవుతోందని ఒక మంత్రి అనగా.. ముందుగానే అందరితో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని, దానికోసం చైర్మన్లను దించాల్సిన పని లేదని సీఎం సూచించారు. దీంతో ఆ ప్రతిపాదనను మంత్రివర్గం తిరస్కరించింది.

మూడు భారీ నీటి ప్రాజెక్టుల కొనసాగింపు..

జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన మూడు భారీ నీటి ప్రాజెక్టులను యథాతథంగా కొనసాగించాలని కేబినెట్ నిర్ణయించింది. పులివెందుల, డోన్, ఉద్దానంలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం నడుస్తోంది. పులివెందులకు జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అక్కడి ప్రజలకు ఉపయోగపడుతున్నందువల్ల ప్రాజెక్టును కొనసాగించి పూర్తి చేద్దామని, ఆయనలా కక్ష సాధింపులు మనకు అవసరం లేదని సీఎం అన్నారు.

సమస్యలను సవ్యంగా పరిష్కరించాలి..

గ్రామాల్లో రైతులు ప్రస్తుతం వ్యవసాయ పనుల ఒత్తిడిలో ఉన్నారని, అందువల్ల రెవెన్యూ సదస్సులను సంక్రాంతి తర్వాత కూడా నిర్వహించాలని నాదెండ్ల కోరారు. తమకు దరఖాస్తులు బాగానే వస్తున్నాయని, ఇప్పటికే 3.5లక్షలు వచ్చాయని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. సదస్సుల సమయం పొడిగింపునకు ముఖ్యమంత్రి అంగీకరించారు.



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు

ఒక్కదానికీ యూసీలివ్వలేదు..

కేంద్ర పథకాలు మొత్తం 93 ఉంటే వైసీపీ హయాంలో ఒక్కదానికి కూడా యూసీలు సమర్పించకపోవడంతో అన్నీ నిలిచిపోయాయని మంత్రి కేశవ్ చెప్పారు. ఈ ఆరు నెలల్లో అందులో 70 పథకాలు పునరుద్ధరించగలిగామన్నారు. ప్రభుత్వ విజన్ ప్రణాళిక, 20పాలసీలను మంత్రులు అధ్యయనం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచడానికి ప్రతి మంత్రి తన శాఖ పరిధిలో పనిచేయాలని సీఎం సూచించారు.

అసెంబ్లీ డిజైన్లపై స్పీకర్ అధ్యక్షతన కమిటీ

రాజధాని అమరావతిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన అసెంబ్లీ భవనం లోపల డిజైన్లు ఎలా ఉండాలో నిర్ణయించడానికి స్పీకర్ అధ్యక్షతన ఒక కమిటీ నియమించాలని కేబినెట్ నిర్ణయించింది. భవనం భౌతిక డిజైన్ ఇప్పటికే పూర్తయినందున అందులో మార్పులు ఉండవని.. లోపల ఎలా ఉండాలో.. ఏయే అవసరాలకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలో కమిటీలో చర్చించి సూచనలు ఇవ్వాలని సీఎం చెప్పారు. అసెంబ్లీ భవనం పైన ఉండే టవర్ విజయవాడ, గుంటూరు నుంచి కూడా కనిపిస్తుందని, ఇంత పెద్ద టవర్ దేశంలో మరే అసెంబ్లీకి లేదని తెలిపారు. 47 అంతస్థులతో నిర్మించబోయే సచివాలయ టవర్‌లో ప్రతి శాఖ మంత్రి, కార్యదర్శి, శాఖాధిపతి ఒకేచోట ఉండేలా చూడాలని ఆదేశించారు. శాఖాధిపతులకు సందర్శకుల తాకిడి ఉంటుందని, వాటిని వేరేచోట పెడితే బాగుంటుందని మంత్రి లోకేశ్ అన్నారు. ఇందుకు సీఎం అంగీకరించలేదు. గిరిజన వర్సిటీ కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన స్థలాన్ని గత జగన్ సర్కారు మార్చిందని.. అక్కడే నిర్మాణం కొనసాగిద్దామని ఆయన చెప్పారు. రాజధాని నిర్మాణ పనులు జనవరిలో ప్రారంభమవుతాయని మంత్రి నారాయణ తెలిపారు. హడ్కో రుణంతో చేపట్టే పనులు సంక్రాంతి తర్వాత మొదలవుతాయని, ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే పనులు ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఈ రెండు మార్గాల నుంచి అందే నిధులు రూ.31వేల కోట్లు ఉంటాయని, చాలా పనులు వీటితోనే పూర్తవుతాయన్నారు.

పనితీరు నివేదికలు ఇచ్చింది ముగ్గురే

మంత్రులు ఆరు నెలల పనితీరుపై స్వయం మదింపు నివేదికలు ఇవ్వాలని అడిగితే.. నిమ్మల రామానాయుడు, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మాత్రమే ఇచ్చారని, మిగిలిన వారు ఇవ్వలేదని చంద్రబాబు చెప్పారు. ప్రతి శాఖపై తానే ఆరు నెలల నివేదికలు తయారు చేయిస్తున్నానని ఆయన చెప్పినప్పుడు.. వాటిని మంత్రులకు ఇవ్వాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఒక్కో మంత్రితో విడివిడిగా మాట్లాడతానని, అప్పుడు ఇస్తానని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రుల పనితీరు మెరుగుకు ఆయన పలు సూచనలు చేశారు. 'వారు క్షేత్ర స్థాయి పర్యటనలు పెంచాలి. రాష్ట్ర సచివాలయానికి క్రమం తప్పకుండా వస్తూ ఉండండి. మీ శాఖలకు సంబంధించి కేంద్ర నిధులు ఎంత వరకూ రాబట్టాలో ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా పనిచేయండి. మీ పనితీరుపై సమాచారం తెప్పించుకుంటున్నాను. ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాను. మీ నియోజకవర్గంలో ప్రభుత్వ ఇమేజ్ ఎలా ఉందో కూడా సర్వే చేయిస్తున్నాను' అని ఆయన వారికి చెప్పారు.

పోలవరం నుంచి విశాఖకు
గోదావరి జలాలు

- 23.44 టీఎంసీల తరలింపు
- 788.11 కోట్లకు టెండర్లను ఆమోదించిన కేబినెట్

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద పోలవరం ఎడమ కాలువ ద్వారా 23.44 టీఎంసీల గోదావరి జలాలను విశాఖ పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చేందుకు పిలిచిన టెండర్లకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖ ఈ ఏడాది అక్టోబరు 9న రూ.788.11 కోట్లతో టెండర్లు పిలిచింది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీలు-1, 3, 5, 5ఎ, 6ఎ పనులు పూర్తిగా మందగించడంతో వాటికి టెండర్లు పిలిచారు.

పుంగనూరు బ్రాంచి కెనాల్ సీసీ లైనింగ్ పనులకు ఆమోదం

హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ విస్తరణలో భాగంగా.. పుంగనూరు బ్రాంచి కెనాల్ సిమెంట్ కాంక్రీట్ (సీసీ) లైనింగ్ పనులు రూ.480 కోట్లతో చేపట్టేందుకు మంత్రి మండలి ఆమోదించింది. ఇటీవల చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా ఈ పనులు చేపట్టాలని జల వనరుల శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ విస్తరణ పనులకు రూ.1929 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో రూ.480 కోట్లతో పుంగనూరు బ్రాంచి కెనాల్ 75.075 కిలోమీటర్ల నుంచి 189.800 కిలోమీటర్ల దాకా సీసీ పనులు చేపట్టాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. 2022-23 నాటి ఎస్ఎస్ఆర్ మేరకు ఈ పనులను ఎన్సీసీకి అప్పగిస్తూ జల వనరుల శాఖ తీసుకుంది.

ఎన్టీపీసీ-ఏపీజెన్కో జాయింట్ వెంచర్‌కు ఆమోదం

ఎన్టీపీసీ, ఏపీజెన్కో.. చెరి సగం పెట్టుబడులతో సంప్రదాయేతర ఇంధనోత్పత్తిని చేపట్టేందుకు మంత్రి మండలి ఆమోదించింది. గతనెల 21న సీఎం చంద్రబాబు సమక్షంలో చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదించింది. ఈ ఒప్పందం మేరకు విశాఖ జిల్లా పూడిమడకలో సోలార్, విండ్, హైబ్రీడ్ విధానంలో 25 గిగావాట్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ, ఏపీజెన్కో నిర్ణయించుకున్నాయి. అదే విధంగా 10గిగావాట్ పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తును కూడా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

షా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు: సీఎం

పార్లమెంటులో గురువారం చోటు చేసుకున్న పరిణామాలపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు. ఎజెండా అంశాలపై చర్చ అనంతరం అధికారులు వెళ్లిపోయాక ఈ చర్చ జరిగింది. పార్లమెంటు పరిణామాలను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఢిల్లీ నుంచి ఫోన్లో లోకేశ్‌కు వివరించారు. ఆయన వాటిని చంద్రబాబుకు తెలియజేశారు. 'అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అర్థరహితం. ఆ పార్టీ అంబేడ్కర్‌కు ఏనాడూ గౌరవం ఇవ్వలేదు. ఆ పార్టీ హయాంలోనే ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. పార్లమెంటులో కూడా ఆ పార్టీ అంబేడ్కర్ స్మృతి చిహ్నం ఏర్పాటు చేయలేదు. వీపీ సింగ్ ప్రభుత్వం ఆయన విగ్రహం పెట్టింది. సెంట్రల్ హాల్లోనూ ఆయన చిత్రపటం పెట్టింది. ఇప్పుడు అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ ఎలా మాట్లాడుతుంది' అని సీఎం ప్రశ్నించారు. సున్నితమైన అంశాలపై మాట్లాడిన విషయాలను వక్రీకరించడం సులభమన్నారు. అమిత్‌షా మాటలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు.

పార్టీకి ఎవరూ చెడ్డపేరు తేవొద్దు

అలాంటి వారిని ఉపేక్షించం: ముఖ్యమంత్రి చంద్రబాబు

- జెండా మోసింది.. మోసేది కార్యకర్తలే
- అధికారంలో ఉండడానికి కారణం వారే
- వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నాయకులు పనిచేయాలి
- వారికి న్యాయం చేసి ఆదుకోవాలి
- 2 రాష్ట్రాల్లో 76.89 లక్షలకు చేరిన సభ్యత్వాలు
- 30లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి
- శాశ్వత సభ్యత్వ నిధితో కార్యకర్తల సంక్షేమం
- ఇప్పటికే మెజారిటీ నామినేటెడ్ పదవుల భర్తీ
- మిగతావి కూడా త్వరలోనే చేస్తాం: సీఎం
- పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్టీకి ఎవరూ చెడ్డపేరు తీసుకురావద్దని టీడీపీ నేతలకు ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యకర్తల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని నాయకులు పని చేయాలని తేల్చిచెప్పారు. పార్టీ జెండా మోసింది.. మోసేది వారేనని.. వారిని నిత్యం గౌరవించాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచి నేడు అధికారంలో ఉన్నారంటే దానికి కారణం పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలేనన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఈ నెల 30లోపు పూర్తి చేయాలని నేతలను ఆదేశించారు. సభ్యత్వ నమోదుపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటరీ అధ్యక్షులు, గ్రామ స్థాయి కార్యకర్తలతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో ఏ పార్టీకీ లేని కార్యకర్తల బలం టీడీపీకి ఉందని.. సభ్యత్వ నమోదు ద్వారా ఇది నిరూపితమైందని చెప్పారు. 76 లక్షల సభ్యత్వాల నమోదుతో దేశంలో చరిత్ర సృష్టించామని.. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో 76,89,103 మంది సభ్యత్వం తీసుకున్నారని.. అందరి భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రతి నలుగురిలో ఒకరు టీడీపీ సభ్యులుగా చేరాలనుకుంటున్నారని చెప్పారు. 'కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా రూ.135 కోట్లు మన కార్యకర్తలకు ఖర్చు చేశాం. రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల బీమా అందించే ఏకైక పార్టీ మనదే. ఇప్పటికే 685 మంది శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శాశ్వత సభ్యత్వం ద్వారా వచ్చిన నిధులను కార్యకర్తల కోసం ఖర్చు చేస్తాం. శాశ్వత సభ్యత్వం తీసుకున్న నియోజకవర్గాల్లో మంగళగిరి 71, జీడీ నెల్లూరు 38, పెదకూరపాడు 37 మందితో ముందు వరుసలో ఉన్నాయి. పారీంట సభ్యత్వం తీసుకున్న వారికి త్వరలోనే కార్డులు అందిస్తాం. వారికి వచ్చే జనవరి నుంచి బీమా అమలవుతుంది. అయినా ఇప్పటికే ప్రమాదంలో చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం' అని వివరించారు.


> టీడీపీ బలం కార్యకర్తలే. పార్టీని కాపాడింది వారే. వారికి న్యాయం చేసి, ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. నేతలు ఈ విషయంలో చొరవ చూపాలి.
>
> గత ఐదేళ్లు విధ్వంస పాలన జరిగింది. మనం అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరించుకుంటూ పాలన గాడిన పెట్టాం. ఎన్డీయే ప్రభుత్వం శాశ్వతంగా అధికారంలో ఉంటే రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరుగుతుంది.
>
> - సీఎం చంద్రబాబు

ప్రతిభ ఆధారంగా పదవులు

మెజారిటీ నామినేటెడ్ పదవులను ఇప్పటికే భర్తీ చేశామని.. మిగతావి కూడా త్వరలో భర్తీ చేస్తామని చంద్రబాబు తెలిపారు. అందరి అభిప్రాయాలూ తీసుకోవడంతో పాటు ప్రతిభ ప్రకారం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయుల్లో పదవులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. 'ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూడా కూటమిదే పైచేయి. గత ప్రభుత్వం నీరు-చెట్టు కింద చేసిన పనులకు బిల్లులను చెల్లించకుండా ఇబ్బందిపెట్టింది. కొందరి అకౌంట్లు కూడా మూసేసింది. ఈ సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తాం. మన ప్రభుత్వం చేపట్టిన అధికారిక కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వాట్సాప్ గవర్నెన్స్ విధానం తెస్తున్నాం. దీనిద్వారా నేరుగా ప్రజల సెల్‌ఫోన్‌కే సర్టిఫికెట్లు పంపిస్తాం. గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు మొదలయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.4,500 కోట్లతో 30వేల పనులకు శ్రీకారం చుట్టాం. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్ల పథకానికి శ్రీకారం చుట్టాం. గత 6 నెలల కాలంలో అనేక సవాళ్లు, అవరోధాలు ఎదురైనా మంచి ఫలితాలు సాధించాం' అని చంద్రబాబు తెలిపారు.

విజయ సాయిరెడ్డికి ఊరట సరికాదు

- ఆయనపై చర్యలు తీసుకోకముందే కోర్టు జోక్యం చేసుకుంది
- ప్రాథమిక అభిప్రాయాన్ని సింగిల్ జడ్జి కొట్టేయడం తగదు
- క్రమశిక్షణ కమిటీ విచారణకు అనుమతి ఇవ్వండి
- తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఐసీఏఐ అప్పీల్
- మధ్యంతర పిటిషన్‌పై తీర్పు రిజర్వు



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై విచారణ పూర్తికాకుండానే కోర్టు జోక్యం సరికాదని.. చార్టర్డ్ అకౌంటెంట్స్ యాక్ట్ ప్రకారం క్రమశిక్షణ చర్యలపై విచారణకు ప్రత్యేక ప్రక్రియ ఉందని తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌కి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నివేదించింది. వృత్తిపరమైన దుష్ప్రవర్తన వ్యవహారంలో చార్టర్డ్ అకౌంటెంట్ అయిన విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా తమ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన ప్రాథమిక అభిప్రాయాన్ని సింగిల్ జడ్జి కొట్టేయడం తగదని పేర్కొంది. విజయసాయిరెడ్డిపై ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోకుండానే కోర్టు జోక్యం చేసుకుందని తెలిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టేసి విజయసాయిరెడ్డిపై ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ విచారణను యథావిధిగా కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో నిందితుడిగా ఉండటం సహా పలు ఆరోపణల నేపథ్యంలో వృత్తిపరమైన దుష్ప్రవర్తనపై ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ విజయసాయిరెడ్డిపై విచారణ చేపట్టింది. దీనిపై విజయసాయిరెడ్డి గతేడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ ప్రాథమిక అభిప్రాయాన్ని సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. విజయసాయిరెడ్డికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ ఐసీఏఐ, ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ, ఐసీఏఐ డిసిప్లినరీ డైరెక్టరేట్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశాయి. ఈ అప్పీల్‌పై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ తరపున సీనియర్ న్యాయవాది ఎంఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. విజయసాయిరెడ్డి తమిళనాడు చాప్టర్‌లో సీఏగా నమోదయ్యారని.. ఆయన ఎక్కడ సీఏగా నమోదై ఉన్నారో అక్కడి హైకోర్టులో పిటిషన్ వేసుకోవాలే తప్ప.. తెలంగాణ హైకోర్టుకు అధికార పరిధి లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సింగిల్ జడ్జి గుర్తించలేదని తెలిపారు. సీఏ యాక్ట్ ప్రకారం క్రమశిక్షణ విచారణకు ప్రత్యేక ప్రక్రియ ఉందని.. అది పూర్తికాకుండానే కోర్టు జోక్యం సరికాదన్నారు. గతంలో ఇదే తరహా కేసులో పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిందని తెలిపారు. విజయసాయిరెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐసీఏఐ ఎందుకు తొందర పడుతోందని.. తుది విచారణ చేపట్టే వరకు వేచిఉండకుండా మధ్యంతర ఉత్తర్వుల కోసం పట్టుబట్టడం ఏంటని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం.. విజయసాయిరెడ్డికి అనుకూలంగా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే కోరుతూ ఐసీఏఐ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌పై తీర్పు రిజర్వుచేసింది. ప్రధాన పిటిషన్‌ను జనవరి నెలకు వాయిదా వేసింది.

చంద్రబాబు చంద్రముఖిలా మారాడు

- కుంభకోణాలకు రాష్ట్రం కేరాఫ్‌గా మారింది
- రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది.. వైసీపీ నేతలు గొంతు విప్పాలి: జగన్



అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, చంద్రముఖిలా మారిపోయాడు' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని తన నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. 'రాష్ట్రంలో ఇసుక, లిక్కర్ మాఫియా నడుస్తోంది. కుంభకోణాలకు రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. ఇలాంటి సమయంలో వైసీపీ నేతలంతా గొంతు విప్పాలి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వాన్ని నిలదీయాలి. వైసీపీ నేతలందరికీ నేను, పార్టీ అండగా ఉంటాం. నాయకులుగా ఎదగడానికి ఇది ఒక అవకాశం. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని లేపడమే. పులినోట్లో తలపెట్టడమే. నేను ఎన్నికల సమయంలో ఇదే చెప్పా. ఈరోజు అవన్నీ నిజమవుతున్నాయి. వైఎస్ జగన్ పలావు పెట్టాడు, చంద్రబాబు బిర్యానీ పెడతాడని ప్రజలు భావించారు. ఇప్పుడు ఈ రెండూ పోయాయి. ఉన్న పథకాలు పోయాయి... ఇస్తానన్న పథకాలూ అమలు చేయడం లేదు. రాష్ట్రంలో కుంభకోణాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు.. నేతలంతా నీకింత, నాకింత అని పంచుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వైసీపీకి సానుకూలంగా మారాలంటే ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. ఆ దిశగా పార్టీ నేతలు అడుగులు వేయాలి' అని జగన్ పిలుపునిచ్చారు.

బాబాసాహెబ్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనం

- ఆయన భారత జాతికి క్షమాపణలు చెప్పాలి
- తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలి: షర్మిల



అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. గురువారం ఆమె ఎక్స్ సామాజిక మాధ్యమంలో స్పందించారు. 'అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మను సంస్కృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ కుట్ర పన్నింది. అందులో భాగంగానే అంబేడ్కర్‌పై అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. మను సంస్కృతిని బీజేపీ విశ్వసిస్తున్నందునే అనుక్షణం రాజ్యాంగంపై దాడి చేస్తోంది. రాజ్యాంగ నిర్మాతను ప్రతిసారి బీజేపీ హేళన చేస్తోంది. అమిత్‌షా వ్యాఖ్యలతో భారత రాజ్యాంగం మీద, జాతీయ జెండా మీద బీజేపీకి గౌరవం లేదని నిరూపితమైంది. అంబేడ్కర్‌ను అవమానించినందుకు అమిత్‌షా భారత జాతికి క్షమాపణలు చెప్పాలి. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

అదానీతో ఒప్పందాలను రద్దు చేయండి

- సీఎం చంద్రబాబును కలిసిన సీపీఐ నేతలు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. గత వైసీపీ ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు. ఈ ఒప్పందాల్లోని లోటు పాట్లను, రాష్ట్ర ప్రభుత్వంపై పడే భారాలపైనా న్యాయ సలహాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు తమతో చెప్పినట్లు రామకృష్ణ మీడియాకు తెలిపారు.



మంత్రి లోకేశ్ సమక్షంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో గడ్డం శేఖర్ బాబుతో ఒప్పందం చేసుకుంటున్న సీడాప్ సీఈవో నారాయణస్వామి

మూడు కంపెనీలతో సీడాప్ ఒప్పందాలు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంస్థ మూడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో 2కామ్స్ గ్రూప్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, సెంచూరియన్ సంస్థలతో గురువారం ఉండవల్లిలో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు సీడాప్ పెద్దఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ గునుపాటి దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఐలో ఏపీకి సాంకేతిక సహకారం

- గూగుల్ పునరుద్ఘాటన



ఢిల్లీలోని గూగుల్ కార్యాలయంలో ఏఐపై జరిగిన వర్క్‌షాపులో ఆర్టీజీఎస్ సీఈవో కె.దినేశ్ కుమార్

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధలో ఆంధ్రప్రదేశ్‌కు సాంకేతిక సహకారం అందిస్తామని గూగుల్ సంస్థ పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షల మేరకు ప్రభుత్వ శాఖల్లో ఏఐ విస్తృత వినియోగంతో అత్యున్నత ఫలితాలు సాధించేలా సాంకేతిక సహకారాన్ని అందిస్తామని వెల్లడించింది. ఢిల్లీలోని గూగుల్ కార్యాలయంలో గురువారం ఏఐపై జరిగిన వర్క్‌షాప్‌లో సంస్థ యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ రియల్ టైమ్ గవర్నెన్స్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు ప్రభుత్వ శాఖల్లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని వెల్లడించారు. ఏఐలో గూగుల్ సేవలను వినియోగించుకునేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంసిద్ధంగా ఉన్నారని ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్ చెప్పారు.



పందుల ఉచ్చులో చిక్కి చిరుత మృతి

అది.. కృష్ణా జిల్లా గన్నవరం మండలం మెట్లపల్లి, ఆగిరిపల్లి మండలం నూరవరం గ్రామాల శివారులోని మామిడి తోట. గత 30 ఏళ్లలో ఈ ప్రాంతంలో పులి సంచరించిన ఆనవాళ్లు లేవు..! కానీ.. గురువారం ఈ తోటలో అడవి పందుల కోసం పెట్టిన ఉచ్చులో పడి చిరుతపులి మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీస్, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుత మృతికి ఉచ్చులు పెట్టడమే కారణమని నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. దీనిపై డీఎఫ్‌వో సునీత మాట్లాడుతూ.. ముప్పై ఏళ్లుగా ఈ పరిసరాల్లో చిరుతపులి సంచారంపై ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. ఆహారం కోసం పులి రోజూ 10-15 కిలోమీటర్లు ప్రయాణిస్తుంటుందని, ఈ క్రమంలో అటవీప్రాంతం నుంచి ఇటుగా వచ్చి ఉంటుందని చెప్పారు. - గన్నవరం



ఎంత పే...ద్ద జుంకాలో!

బంగారు ఆభరణాల రంగంలో రాణిస్తున్న 'జీఆర్టీ జువెలర్స్'.. 22 క్యారెట్ల బంగారంతో, మూడున్నర కేజీల జుంకాలను తయారుచేసి గిన్నిస్ రికార్డు సాధించింది. జీఆర్టీ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ ఆనంద్ అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్‌లకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ గుర్తింపు తమ అరవయ్యేళ్ల ప్రయాణంలో ఒక అద్భుతమైన క్షణమని, భగవంతుని దయ, వినియోగదారుల మద్దతుతో ఇలాంటి ప్రశంసను అందుకోవడం గర్వంగా ఉందని జీఆర్టీ అధినేతలు అన్నారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి



రాష్ట్ర పండుగగా.. రథసప్తమి

అరసవల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏటా ఇక్కడ జరిగే రథసప్తమి వేడుకలకు తెలుగు రాష్ట్రాలతోపాటు, ఒడిశా, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులకు కూడా పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న నిర్వహించే రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం

- ఉత్తర్వులు జారీ.. మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి ఫరూక్



అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 5 వేల ఆదాయంలేని మసీదుల ఇమామ్‌లు, మౌజన్లకు కూటమి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10వేలు, మౌజన్ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల చొప్పున కొనసాగిస్తూ గురువారం ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ గౌరవ వేతనం వర్తిస్తుందని, ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.90 కోట్లు వెచ్చిస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అడుగడుగునా విఘాతం కల్పించి, గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల పనితీరుపై మంత్రి సమీక్ష

రాష్ట్రంలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరుపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం అమరావతి సచివాలయంలో సమీక్షించారు. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవితో పలు అంశాలపై చర్చించారు.

రోల్‌మోడల్‌లా తిరుమల

- అభివృద్ధికి టీటీడీ ప్రణాళిక
- తిరుమల విజన్-2047 ప్రారంభం
- ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఏజెన్సీలకు ఆహ్వానం

తిరుమల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరిచేందుకు టీటీడీ దూరదృష్టితో ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రపంచానికి ఆధ్యాత్మికపరంగా రోల్‌మోడల్‌లా తిరుమలను అభివృద్ధి చేసేందుకు నడుంకట్టింది. 'స్వర్ణాంధ్ర విజన్-2047' స్ఫూర్తితో 'తిరుమల విజన్-2047'ను ప్రారంభించింది. తిరుమలలో ప్రణాళికబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టిసారించేలా వ్యూహాత్మక ప్రణాళికను రూపొందిస్తోంది. ఆ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రముఖ ఏజెన్సీలను ఆహ్వానిస్తూ ప్రతిపాదనల కోసం ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ను విడుదల చేసింది. తిరుమల అభివృద్ధిలో సంప్రదాయాన్ని, ఆధునికతను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు టీటీడీ ఉన్నతాధికారులకు సూచించారు. ఆధ్యాత్మిక పవిత్రత, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించి ముందుచూపుతో భక్తులకు సౌకర్యాలు, వసతిని మెరుగుపరచాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించాలని ఇటీవల జరిగిన సమావేశంలో టీటీడీ బోర్డు తీర్మానం చేసింది.

కన్సల్టెంట్ల నుంచి ప్రతిపాదనలకు ఆహ్వానం

తిరుమల విజన్-2047 లక్ష్యాలను చేరుకునేందుకు, పట్టణ ప్రణాళిక, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ నిర్వహణపై ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఏజెన్సీల నుంచి ప్రతిపాదనలను టీటీడీ గురువారం ఆహ్వానించింది. ఇప్పటికే తిరుమల పట్టణ అభివృద్ధిపై ప్రణాళికను సిద్ధం చేసిన టీటీడీ, మూడు వారాల్లోగా ఆసక్తి కలిగిన, ముందస్తు అనుభవం ఉన్న ఏజెన్సీలు తమ ప్రతిపాదనలను సమర్పించాలని కోరింది.

విజన్-2047 లక్ష్యాలు

- ఆధునిక పట్టణ ప్రణాళిక నిబంధనలను అనుసరిస్తూ తిరుమల పవిత్రతను పెంపొందించేందుకు శాశ్వత వ్యూహాలను అమలుచేయడం.
- వారసత్వ పరిరక్షణ, పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వడం.
- ప్రపంచంలో తిరుమలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించడం.
- అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయడం.
- ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జోన్‌ల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయడం.
- తిరుమలలో పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి భవిష్య వ్యూహాలను రూపొందించడం.
- ● ప్రాముఖ్యత కలిగిన మౌలిక సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయడం.



గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం ఏకపక్షం!

- ఏకాభిప్రాయం లేకున్నా ముందుకే!!
- రాష్ట్రాలతో జలశక్తి శాఖ వీడియో కాన్ఫరెన్స్
- స్కీంను తీవ్రంగా వ్యతిరేకించిన తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక
- సాంకేతిక లోపంతో వినిపించని ఏపీ వాదన
- అభ్యంతరాలు రేపటిలోగా చెప్పాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సూచన
- నేడే పంపనున్న ఆంధ్రప్రదేశ్





అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధాన ప్రక్రియపై రాష్ట్రాల అభిప్రాయ సేకరణకు కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశం ఏకపక్షంగా సాగింది. గోదావరి నదిలో నికర జలాలు అందుబాటులో లేకున్నా.. ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 147 టీఎంసీల జలాల ఆధారంగా గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియపై ముందుకెళ్లాలని కేంద్రం నిర్ణయించుకుంది. గురువారం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా రాష్ట్రాలతో సమావేశం జరిగింది. దాదాపు రూ.63,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టదలచిన ఈ గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియలో రాష్ట్రాల మధ్య కేంద్రం ఏకాభిప్రాయం సాధించలేకపోయింది. వాటిని ఒప్పించే ప్రయత్నం చేయకపోగా... వాటి అభిప్రాయాలను బుల్‌డోజ్ చేసుకుంటూ పోవాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు కనబడుతోంది. ఈ పథకాన్ని తెలంగాణ, కర్ణాటక తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆంధ్రప్రదేశ్ తరఫున వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతుండగా.. సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో రాష్ట్రం వైఖరి కేంద్రానికి చేరలేదు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్రాలు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా రెండ్రోజుల్లో తమకు అందజేయాలని పాటిల్ సూచించారు. దరిమిలా శుక్రవారమే తన వైఖరిని జలశక్తి శాఖకు రాష్ట్ర జల వనరుల శాఖ పంపనుంది. ప్రధానంగా.. గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి కావేరికి తరలించడం కాకుండా.. పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి.. నాగార్జున సాగర్ కుడి కాలువ.. బొల్లాపల్లి రిజర్వాయరు.. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ మీదుగా తీసుకెళ్లాలని స్పష్టం చేయనుంది. గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను అంగీకరించే ప్రసక్తేలేదని తెగేసిచెప్పనుంది. ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధానం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి ప్రయోజనమూ ఉండదని తెలియజేయనుంది.

ఏ రాష్ట్రం ఏమందంటే..

ఇచ్చంపల్లి నుంచి గోదావరి కావేరి నదుల అనుసంధానానికి అంగీకరించబోమని తెలంగాణ ఈ భేటీలో స్పష్టం చేసింది. తుపాకుల గూడెం నుంచి గోదావరి జలాలను తరలించేందుకు సూత్రప్రాయంగా అంగీకరిస్తామని తెలిపింది. అనుసంధాన ప్రక్రియ వల్ల తమ రాష్ట్రానికి కలిగే ప్రయోజనం ఏవిటో స్పష్టం చేయాలని కర్ణాటక డిమాండ్ చేసింది. ఈ అనుసంధానం వల్ల ప్రయోజనం పొందే తమిళనాడు మాత్రం ఈ పథకాన్ని త్వరగా ప్రారంభించాలని కేంద్రాన్ని కోరింది. దీనివల్ల కలిగే నీటి ప్రయోజనాలేమిటో చెప్పాలని పుదుచ్చేరి కోరింది.

కొసమెరుపు: ఛత్తీస్‌గఢ్ వినియోగించని 147 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి-కావేరి అనుసంధానానికి వినియోగిస్తామని కేంద్రం చెబుతుంటే.. మరోవైపు.. ఈ జలాలను వదులుకునేది లేదని ఛత్తీస్‌గఢ్ తేల్చి చెబుతోంది. భవిష్యత్‌లో ఆ నీటిని వాడుకుంటామని అంటోంది. అయినా కేంద్రం ముందుకు వెళ్తుండడం గమనార్హం.

దక్షిణాదిలో ఎన్డీఏ విస్తరణ

- వ్యూహ రూపకల్పనలో చంద్రబాబుకు కీలక పాత్ర
- ముగ్గురు కీలక మంత్రులతో ఉన్నత స్థాయి కమిటీ
- సమన్వయ కర్తగా జగత్ ప్రకాశ్ నడ్డా

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్డీఏను విస్తరించేందుకు ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలి? ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే విషయంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు. మోదీ, అమిత్ షా ఈ విషయాలపై తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. చంద్రబాబుతో సలహా సంప్రదింపులు చేస్తూ కీలకమైన నిర్ణయాలను సూచించేందుకు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, రామ్మోహన్ నాయుడు, భూపేంద్ర యాదవ్‌లతో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. దక్షిణాదికి సంబంధించి రాజకీయ వ్యూహం, అభివృద్ధికి సంబంధించి నిర్ణయాలను ఖరారు చేయడంలో ఈ కమిటీ తుది నిర్ణయాలు తీసుకుంటుంది. వీరు కాక ఆయా రాష్ట్రాలకు చెందిన సమస్యలను గుర్తించి పరిష్కారాలను సూచించేందుకు పలువురు కేబినెట్ మంత్రుల ఆధ్వర్యంలో అంతర్గత కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీల్లో కనీసం పదిమంది చొప్పున సభ్యులను కూడా నియమించారని సమాచారం. దక్షిణాదిన ఏ విధంగా విస్తరించాలి, ఏయే నిర్ణయాలు తీసుకోవాలి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టాలన్న అంశాలపై నిరంతరం ఈ కమిటీలు చర్చిస్తాయని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ కమిటీలకు ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా సమన్వయ కర్తగా వ్యవహరిస్తారు. వారి చర్చలు, ప్రతిపాదనల గురించి నడ్డా ఎప్పటికప్పుడు మోదీ, షాలకు చెబుతారు. ఒక వైపు ఈ కేబినెట్ మంత్రులందరూ, తమ తమ మంత్రిత్వ శాఖల బాధ్యతలను నిర్వహిస్తూనే మరో వైపు దక్షిణాదిపై పూర్తి దృష్టి కేంద్రీకరిస్తారని, రానున్న రెండు, మూడేళ్లలో దక్షిణాదిలో ఎన్డీఏ తిరుగులేని శక్తిగా రూపొందించడమే తమ లక్ష్యమని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే మోదీ, అమిత్ షా చంద్రబాబుతో చర్చిస్తున్నారని, ధర్మేంద్ర ప్రధాన్ కమిటీ రెండు సార్లు సమావేశమైందని సమాచారం.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా మధుమూర్తి

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఎన్ఐటీ వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.మధుమూర్తి పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. దీనిపై శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయనుంది. తొలినుంచీ జాతీయ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారి పేర్లనే ఉన్నత విద్యామండలి కోసం ప్రభుత్వం పరిశీలించింది. ఇటీవల రెండు పేర్లు తుది పరిశీలనకు రాగా వివిధ కారణాలతో పక్కనపెట్టారు. చివరికి మధుమూర్తి నియామకానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

సెలవులతో సరి!

- గనుల శాఖలో అవినీతి అధికారులకు సెలవులు
- గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో కుమ్మక్కై భారీ అక్రమాలకు పాల్పడ్డారని అభియోగాలు
- ఇప్పటికే రెండు విడతల్లో 28 మంది ఇంటికి
- వారిలో ఇద్దరికి 3 నెలల తర్వాత పోస్టింగ్
- తాజాగా 13మందితో జాబితా సిద్ధం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారన్న అభియోగాలపై గనుల శాఖ అధికారులను కూటమి ప్రభుత్వం సెలవులపై పంపిస్తోంది. ఇప్పటికే తొలి విడతలో ఇద్దరిని, రెండో విడత 26 మందిని సెలవుపై పంపింది. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు, ఆదేశాలు లేకుండా అధికారులను వ్యక్తిగతంగా పిలిచి... 'మీరు కొంతకాలం సెలవు తీసుకోవాల్సిందే' అని చెబుతున్నారు. తాజాగా ఎనిమిది జిల్లాల్లో గనుల శాఖ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 13 మంది అధికారులను సెలవుపై పంపించేందుకు మరో జాబితా సిద్ధమవుతోంది. త్వరలో ఒక్కొక్కరినీ పిలిచి సెలవుపై వెళ్లాలని గనులశాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇవ్వనున్నారని తెలిసింది. అయితే జగన్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ సెలవుపై పంపుతున్న వారిపై ఏసీబీ, విజిలెన్స్ విచారణ ఎందుకు చేపట్టడం లేదు? సెలవుపై పంపిస్తే వారు చేసిన అక్రమాలు, అన్యాయాలు సరి అయిపోతాయా? లేక తెరవెనక మరేదైనా గూడుపుఠాణి జరుగుతోందా? అనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డికి అనుకూలంగా వ్యవహరించి, వైసీపీ నేతలతో అంటకాగి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కూటమి ప్రభుత్వం 28 మంది అధికారులను సెలవుపై పంపింది. వారిలో ఇద్దరిని 3 నెలల తర్వాత తిరిగి ఉద్యోగంలోకి తీసుకోగా, మరో 26మంది ఇంకా సెలవులోనే ఉన్నారు. శాఖలో కీలకమైన డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, విజిలెన్స్ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటి అధికారులు ఇందులో ఉన్నారు. వీరంతా అక్రమాలకు పాల్పడటం నిజమైతే, ఈ ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో దర్యాప్తు చేయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. వారివల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం జరిగితే, అది ఎంతో నిగ్గుతేల్చి రికవరీ చేసే అవకాశమూ ఉంది. ఇవేవీ చేయకుండా, వారిని సెలవు పేరిట పంపించడంపై గనుల శాఖ వర్గాల్లో అనేక రకాల చర్చలు సాగుతున్నాయి.

అంతా అనుమానాస్పదం

గత ప్రభుత్వంలో వెంకటరెడ్డితో పాటు అనేక అంశాల్లో సూత్రధారులు, పాత్రధారులుగా వ్యవహరించిన వారికి కూటమి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. అప్పట్లో ఒక మంత్రి, ఆయన అనుచరులతో అంటకాగిన అధికారిపై చర్యలు తీసుకున్నట్లే తీసుకొని, తర్వాత ఆయనకు రెండు కీలక పోస్టులు కట్టబెట్టారు. ఆయనపై విచారణ చేస్తే కనీసం రూ.300 కోట్ల అక్రమాస్తులు బయటకొస్తాయని అధికార వర్గాలే చెబుతున్నాయి. అలాంటి వ్యక్తికి రెండు జిల్లాల కీలక బాధ్యతలు అప్పగించడంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఒకే అంశంలో గనుల శాఖ పెద్దలు కొందరి విషయంలో ఒకలా, మరికొందరి పట్ల మరోలా ప్రవర్తిస్తుండటం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది.



కరెంటు ఉంది.. ఇళ్లే లేవు!

ఇది గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నపాడులో గత ప్రభుత్వం పేదల ఇళ్ల కోసం కేటాయించిన జగనన్న కాలనీ. ఇక్కడ 7,000 మందికి ఇళ్లు మంజూరు చేసినా.. ఒక్కటీ నిర్మించలేదు. ఇళ్లు లేకపోయినా విద్యుత్ సౌకర్యం మాత్రం కల్పించింది. 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ స్తంభాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది.

నేడు కోస్తాకు వర్ష సూచన

- ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు.. కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం గురువారం నాటికి నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. శుక్రవారం ఉదయానికి అది వాయవ్యంగా పయనించి ఉత్తర తమిళనాడు, దక్షిణాంధ్ర తీరం సమీపంగా రానుంది. తర్వాత 24 గంటల్లో ఉత్తరంగా కోస్తాంధ్ర తీరానికి ఆనుకుని పయనిస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. దీని ప్రభావంతో గురువారం కోస్తాలోని అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించగా, ఉత్తర కోస్తాలో పలుచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. శుక్రవారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు పడతాయని.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ కూడా పేర్కొంది. కాగా, తీవ్ర అల్పపీడనం ప్రభావంతో కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 35 నుంచి 45, అప్పుడప్పుడూ 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నందున ఈ నెల 21, 22వ తేదీల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది.

నేడు మరింత స్పష్టత..: నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారుతుందా..? లేదా..? అనేదానిపై రకరకాల అంచనాలు వెలువడుతున్నాయి. వాయుగుండంగా బలపడితే ఈశాన్యంగా దిశ మార్చుకుని మయన్మార్ తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని ఒక మోడల్ అంచనా వేస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తీవ్ర అల్పపీడనం నెమ్మదిగా పయనించే క్రమంలో బలహీనపడినా దాని ప్రభావంతో ఈ నెల 23, 24వ తేదీల్లో ఉత్తర కోస్తాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని మరో మోడల్ చెబుతుందన్నారు. దీనిపై శుక్రవారం మరింత స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే రెండు రోజుల నుంచి ఉత్తర కోస్తాలో అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరో మూడు, నాలుగు రోజులు వర్షాలు కొనసాగితే మరింత ఇబ్బందులు తలెత్తుతాయని వ్యవసాయ శాఖాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పారా బాయిల్డ్ బియ్యం ఎగుమతిపై అభ్యంతరం లేదు

- పిటిషనర్లకు అన్ని అనుమతులు ఉన్నాయి
- హైకోర్టుకు నివేదించిన ఏఏజీ
- వ్యాజ్యాల ఉపసంహరణకు కోర్టు అనుమతి

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులోని తమ పారా బాయిల్డ్ రైస్‌ను బార్జ్‌ల నుంచి ఎంవీ స్టెల్లా నౌకలో లోడ్ చేసేందుకు అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లను ఉపసంహరించుకొనేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా అడిషనల్ అడ్వకేట్ జనరల్(ఏఏజీ) సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ.. పారా బాయిల్డ్ బియ్యం ఎగుమతికి పిటిషనర్లకు అన్ని అనుమతులు ఉన్నాయన్నారు. వారి బియ్యం విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న 1320 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్టెల్లా నౌక నుంచి దించేశాక పిటిషనర్ల పారా బాయిల్డ్ రైస్‌ను నౌకలో లోడ్ చేసుకోవచ్చన్నారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్లు, అధికారుల మధ్య సంప్రదింపులు జరిగాయని, వారి బియ్యాన్ని నౌకలో లోడ్ చేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారని తెలిపారు. అందువల్ల పిటిషన్లను ఉపసంహరించుకుంటామని చెప్పారు. ఇరువైపుల వాదనలు నమోదుచేసిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు.. వ్యాజ్యాల ఉపసంహరణకు అనుమతిచ్చారు. భవిష్యత్తులో తమకు వ్యతిరేకంగా అధికారులు ఏమైనా చర్యలు చేపడితే తిరిగి కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనపై న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. ఉపముఖ్యమంత్రి మౌఖిక ఆదేశాలను అనుసరించి కాకినాడ పోర్టులో తమ పారా బాయిల్డ్ బియ్యాన్ని బార్జ్‌ల నుంచి స్టెల్లా నౌకలో లోడ్ చేయనీయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని పేర్కొంటూ చిత్ర అగ్రి ఎక్స్‌పోర్ట్స్ ఎండీ కేవీ భాస్కర్‌రెడ్డి, పద్మశ్రీ రైస్‌మిల్ ఎండీ పోతంశెట్టి గంగిరెడ్డి, సూర్యశ్రీ రైస్‌మిల్ ఎండీ పోతంశెట్టి విశ్వనాథ్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన కోర్టు బియ్యం రవాణాకు పిటిషనర్లకు అనుమతులున్నాయా? బియ్యం లోడింగ్‌ను అడ్డుకొనేందుకు ప్రభుత్వానికున్న అధికారాలేంటి? వివరాలు తమ ముందుంచాలని ఏఏజీని కోర్టు ఆదేశించింది.



మొక్క మొక్కకో ఎల్‌ఈడీ!

పొందికగా అమర్చిన మొక్కలు.. వాటిపై వెలుగు పడేలా అమర్చిన ఎల్‌ఈడీ లైట్లు... చామంతి పూల సాగులో ఓ యువ రైతు చేస్తున్న కృషికి ప్రత్యక్ష నిదర్శనం ఈ చిత్రాలు. అన్నమయ్య జిల్లా పెద మాండ్యం కలిచెర్ల గ్రామానికి చెందిన యువరైతు షేక్ అబ్దుల్లా.. అగ్రికల్చర్ బీఎస్సీ చదివి వ్యవసాయంపై ఆసక్తితో ఐదు ఎకరాల భూమిలో చామంతి పూల సాగు చేపట్టారు. తోటలో రెండు అడుగులకో ఎల్‌ఈడీ లైట్ ఏర్పాటు చేశారు. సాయంత్రం కాగానే ఈ ఎల్‌ఈడీ వెలుగుల్లో చామంతి తోటంతా ఆకర్షణీయంగా కనిపిస్తోంది.



*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*